Bhavani Publication Trust https://prajatheerpudaily.com

# ప్రజాతీర్పు

The people's Verdict

తెలుగు జాతీయ దినపత్రిక

రిపోర్టర్లు కావలెను

అధునాతన సాంకేతికతతో..
ఎప్పటి వార్తలు అప్పుడు అందించేందేందుకు
మీ ముందుకు వచ్చిన

ప్రజా టెలివిజన్

యూట్యూబ్ చానల్‌లో పని చేయుటకు
రిపోర్టర్లు కావలెను. ఎలాంటి టార్గెట్లు ఉండవు.
నిత్యనూతనంగా వార్తలు, లైవ్‌లు అందించడమే మీ పని..
సంప్రదించండి: 8309979541, 9494659622

PRAJA TELEVISION
The People's Favour

మా యూట్యూబ్ చానల్‌ను
సపోర్ట్ చేయండి
8309979541

ప్రజా టెలివిజన్
తాజా వార్తలు, అప్‌డేట్,
లైవ్ ప్రోగ్రామ్‌ల కోసం లైక్, షేర్, సబ్‌స్క్రైబ్

సంపుటి : 26 | సంచిక : 210 | హైదరాబాద్ | మంగళవారం 23 జూన్ 2026 | పేజీలు : 8 | వెల : రూ. 1/-

Cerculated From : KARIMNGAR, HYDERABAD, WARAGAL, RANGAREDDY, MAHABOOBNAGAR, THIRUPATI, GUNTUR, KURNOOL, ANATAPUR, VISAKAPATNAM, CHENNAI, BANGALOOOR



## బలిపశువుగా వాన్స్?

### ఇరాన్‌తో చర్చల వైఫల్యానికి బాధ్యుడేనా?

వాషింగ్‌టన్, జూన్ 22: ఇరాన్‌తో జరిగే శాంతి చర్చల్లో అమెరికా ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్ బలి పశువుగా మారనున్నాడా..? అవుననే సమాధానం వైట్‌హౌస్ వర్గాల నుంచి వినవస్తున్నాయి. ఒకవేళ ఈ చర్చలు విఫలమై తే ఆయన భారీ మూల్యం చెల్లించుకోక తప్ప దు. జేడీ వాన్స్ ఇప్పుడు తీవ్ర సంక్షోభంలో పడ్డారు. ఇరాన్‌తో శాంతి ఒప్పందాన్ని కుదుర్చుకునే బాధ్యత ఆయనపై పడింది. అమెరికా అధ్యక్షుడు డొనాల్ ట్రంప్ ఇప్పటికే రెండుసార్లు దీనిపై సంకేతాలు ఇచ్చారు. వైఫల్యానికి తన డిప్యూటీనే బాధ్యత వహించాల్సి ఉంటుందని స్పష్టం చేశారు. ఇరాన్ చేతిలో అమెరికాకు ఎదురవుతున్న అవమానానికి వాన్స్‌ను ట్రం ప్ ముఖచిత్రంగా మార్చారు. ఇరాన్‌తో చర్చ లు అనుకున్నట్లు సాగడం లేదు. దీంతో వాన్స్‌పై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఆదివారం జెనీవాలో జరిగిన చర్చల్లో ఈ విష యం స్పష్టమైంది. ఇరాన్ ప్రధాన చర్చల ప్రతినిధి మహ్మద్ బాకర్

- మిగతా 2వ పేజీలో



# రైతుకు అండగా రేవంత్

## ఈసారి 7.20 గుంటలున్న రైతులందరికీ రైతుకు పెట్టుబడి సాయం

### 73 లక్షల మంది రైతులకు.. రూ.9వేల కోట్లు

### నిజమైన రైతులకు లబ్ధిచేకూరేలా ప్లాన్

### శాటిలైట్ చిత్రాల ఆధారంగా సర్వే

(ప్రజాతీర్పుప్రతినిధి, హైదరాబాద్)

తెలంగాణ రైతులకు సీఎం రేవంత్‌రెడ్డి అండగా నిలుస్తున్నారు. ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి రైతులకు పెట్టుబడి సాయం అందించేందుకు కార్యాచరణ సిద్ధం చేశారు. ఈనెల 30న ఖమ్మం జిల్లా మధిర నియోజకవర్గంలో జరగనున్న భారీ బహిరంగ సభలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్వయంగా ఈ నిధులను విడుదల చేయనున్నారు. ఈ విడతలో మొత్తం 73 లక్షల మంది రైతుల ఖాతాల్లో రూ. 9,000 కోట్లను జమ చేసేందుకు ప్రభుత్వం పక్కా ప్రణాళికను సిద్ధం చేసింది. గత యాసంగి సీజన్‌లో కేవలం రెండు ఎకరాల లోపు ఉన్న వారికే పెట్టుబడి సాయం అందించడంతో రైతుల నుంచి కొంత వ్యతిరేకత వచ్చింది. ఈసారి ఆ పరిస్థితి రాకుండా అందరికీ ఒకేసారి నిధులు జమ చేయాలని ప్రభుత్వం భావిస్తోంది. ఒకవేళ నిధుల కొరత ఏమైనా ఎదురైతే.. మొదట ఎకరం చొప్పున ప్రారంభించి, 9 రోజుల్లో పూర్తిగా పంపిణీ పూర్తి చేసేలా వ్యవసాయ శాఖ ప్రత్యామ్నాయ ప్లాన్‌ను కూడా సిద్ధం చేసుకుంది. గత ప్రభుత్వంలా కాకుండా.. ప్రజల సొమ్ము వృథా కాకుండా కేవలం నిజమైన, సాగు చేసే రైతులకే ఈ సాయం అందేలా రేవంత్ ప్రభుత్వం కఠిన నిర్ణయాలు తీసుకోబోతోంది. రాష్ట్రంలో ఉన్న 1.50 కోట్ల ఎకరాల భూమిలో సాగుకు పనికిరాని పడావు భూములు, రియల్ ఎస్టేట్ లేఅవుట్లు, కాలువలు, కుంటలు, బీడు భూములు ఉన్న 20 నుంచి 25 లక్షల ఎకరాలను భరోసా జాబితా నుంచి ఇప్పటికే తొలగించనున్నారు.

**పది ఎకరాలకంటే ఎక్కువుంటే..**

ధనవంతులైన పెద్ద రైతులకు కాకుండా పేద, మధ్యతరగతి రైతులకు లబ్ధి చేకూర్చేలా ఈ వానాకాలం సీజన్ నుంచి 7.20 గుంటల వరకు భూమి ఉన్న వారికే భరోసా సాయం పరిమితం చేయాలని ప్రభుత్వం ఆలోచిస్తోంది. 10 ఎకరాల కంటే ఎక్కువ భూమి ఉన్నవారిని ఈ జాబితా నుంచి మినహాయించే అవకాశం ఉంది. పత్తి వంటి పంటలు రబీలో సాగు చేయనందున.. రైతు భరోసాను కేవలం ఒకే ఒక ప్రధాన ఖరీఫ్ సీజన్‌కే పరిమితం చేయాలా? అనే కోణంలోనూ ప్రభుత్వ పెద్దలు సమాలోచనలు

- మిగతా 2వ పేజీలో



## వడ్లనే కొనలేని సీఎం భారాసను గెలవనివ్వరట!

### రేవంత్‌నూ ఓడించి అధికారంలోకి వస్తాం

### అచ్చంపేటలో హరీశ్‌రావు

నాగర్‌కర్నూల్, అచ్చంపేట: వడ్లనే కొనలేని ముఖ్యమంత్రి, భారాసను మళ్లీ అధికారంలోకి రానివ్వనంటూ చెప్పుకొంటున్నారని ఆ పార్టీ సీనియర్ నేత, మాజీ మంత్రి హరీశ్‌రావు అన్నారు. కొడంగల్‌లో మళ్లీ రేవంత్‌రెడ్డిని ఓడించి ఉమ్మడి పాలమూరులో 14 సీట్లు గెలిచే అధికారంలోకి వస్తామని స్పష్టం చేశారు. సోమవారం నాగర్‌కర్నూల్ జిల్లాలోని అచ్చంపేట నియోజకవర్గ కార్యకర్తల సమ్మేళనం, సర్‌పై నిర్వహించిన అవగాహన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా

- మిగతా 2వ పేజీలో



## ఉద్ధవ్ 'సేన'లో చీలిక

### ఆరుగురు ఎంపీలు షిండే శివసేనలోకి

### సిక్స్ కొట్టామన్న ఏక్‌నాథ్ షిండే

### ఆపరేషన్ టైగర్ విజయవంతమని వ్యాఖ్య

ముంబై: మహారాష్ట్ర రాజకీయాల్లో సోమవారం కీలక పరిణామం చోటుచేసుకుంది. ఉద్ధవ్ ఠాక్రే సారథ్యంలోని శివసేన (యూబీటీ) పార్లమెంటరీ పార్టీ అధికారికంగా చీలిపోయింది. ఆ పార్టీకి చెందిన ఆరుగురు లోక్‌సభ ఎంపీలు అధికార పక్షం, మహారాష్ట్ర డిప్యూటీ సీఎం ఏక్‌నాథ్ షిండే నేతృత్వంలోని శివసేనలో అధికారికంగా చేరారు. తాజా పరిణామంతో శివసేన (యూబీటీ) తిరుగుబాటు ఎంపీల రాజకీయ భవితవ్యంపై కొన్ని రోజులుగా తీవ్రస్థాయిలో సాగుతున్న ఊహాగానాలకు తెరపడినట్లయింది. తాజా పరిణామంతో శివసేనపై షిండే పట్టు మరింత బలపడటంతోపాటు, రాష్ట్ర రాజకీయాల్లో ఆయన ప్రభావం మరింతగా పెరిగింది. సోమవారం ముంబైలో షిండే, సీనియర్ నేతలు

- మిగతా 2వ పేజీలో

# సినిమా చూపిస్తా!

### చిట్టినాయుడూ.. బీఆర్‌ఎస్ కార్యకర్తలను ఇబ్బందులు పెట్టినోడ్ని లాక్కొచ్చి నిలబెడతా

### నేను సాఫ్ట్‌వేర్ మాత్రమే కాదు.. హార్డ్‌వేర్ కూడా!

### అర్జున్‌రెడ్డి సినిమా హిట్.. రేవంత్‌రెడ్డిఅట్టర్ ఫ్లాఫ్

### పంటల కొనుగోళ్లపై రైతులకు మరణ శాసనం

### రెండున్నర సంవత్సరాలలో తెలంగాణ వినాశనం

### ఇందిరమ్మ రాజ్యంలో ఇంటింటా సంక్షోభం

### బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

వరంగల్/హనుమకొండ (మహబూబాబాద్), జూన్ 22: 'వచ్చే ఐదేళ్లు చిట్టినాయుడు(సీఎం రేవంత్‌రెడ్డి)కు, ఆయన బృందానికి సినిమా చూపెట్టే బాధ్యత నాది. మా కార్యకర్తలను ఇబ్బందులు పెట్టిన ఒక్కొక్కడిని రిటైర్డ్ అయినా, పారిపోయినా, సప్త సముద్రాల ఆవల ఉన్నా లాక్కొచ్చి నిలబెడతా' అని బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ హెచ్చరించారు. 'నేను సాఫ్ట్‌వేర్ మాత్రమే కాదు.. హార్డ్‌వేర్ కూడా.. కాంగ్రెస్‌పై గేర్ ఎప్పుడు మార్చాలో తెలుసు. కుర్చీ మడత పెట్టి కాంగ్రెస్ పార్టీని, సీఎం రేవంత్‌రెడ్డిని ఎప్పుడు తరిమికొట్టాలా అని

- మిగతా 2వ పేజీలో



# మెట్రోపై సానుకూలం

### రైల్వేశాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్‌తో సీఎం రేవంత్‌రెడ్డి, కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి భేటీ

### మెట్రో ఫేజ్--2ను సంయుక్త వెంచర్‌గా చేపట్టాలని రేవంత్ వినతి

### మెట్రో తొలి దశకు ఐఆర్‌ఎఫ్‌సీ రుణం మంజూరు చేయాలని విజ్ఞప్తి

### సంయుక్త కమిటీ నియమిస్తే విస్తరణ వేగవంతమవుతుందన్న కేంద్ర మంత్రులు

### రెండు గంటలకుపైగా చర్చలు

### నేడు కేంద్ర గృహనిర్మాణ శాఖ మంత్రి ఖట్టర్‌తో సమావేశం



న్యూఢిల్లీ: దేశ రాజధాని పర్యటనలో ఉన్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సోమవారం రైల్వే శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్‌తో భేటీ అయ్యారు. కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి కూడా వీరితోపాటు చర్చలో పాల్గొన్నారు. ఢిల్లీలోని రైల్వేభవన్ వీరి సమావేశానికి వేదికైంది. వీరి మధ్య దాదాపు రెండు గంటలపాటు చర్చలు సాగాయి. ఇండియన్ రైల్వే ఫైనాన్స్ కార్పొరేషన్ (ఐఆర్‌ఎఫ్‌సీ) రుణంతోపాటు మెట్రో ఫేజ్--2 విస్తరణకు త్వరితగతిన అనుమతుల విషయమై వారి మధ్య ప్రధానంగా చర్చ జరిగింది. హైదరాబాద్ మెట్రో ప్రాజెక్టు ఫేజ్--1కు కేంద్రం వయబిలిటీ గ్యాప్ ఫండింగ్ కింద ఇప్పటివరకు రూ. 1,204 కోట్లు ఇచ్చిందని ఈ సందర్భంగా అశ్వినీ వైష్ణవ్ చెప్పినట్లు తెలిసింది. ఫేజ్--2 విషయంలో తర్జనభర్జనలు జరుగుతున్న సమయంలోనూ కేంద్రం సూచించిన రెండు ప్రత్యామ్నాయాలు కూడా ప్రస్తావనకు వచ్చినట్లు

- మిగతా 2వ పేజీలో




## పాలమూరులో బ్రహ్మోస్!

### దేవరకద్ర నియోజకవర్గంలో 416 ఎకరాల్లో క్షిపణి తయారీ కేంద్రం

### శంషాబాద్ విమానాశ్రయానికి 100 కి.మీ.ల దూరంలో బెంగళూరు హైవేకు దగ్గర్లో ఏర్పాటు..

### భూసేకరణకు గత ఏడాది అక్టోబరు 24న సర్కారు మెమో

### రూ.500 కోట్ల పెట్టుబడి..

### లఖ్‌నవూలో రూ.380 కోట్లతో మొదటి యూనిట్ ఏర్పాటు

-2లో

## ఆర్డీఎస్ వేగవంతం

### తుంగభద్ర జలాలపై తెలంగాణ హక్కులను కాపాడుతాం

### తుమ్మిళ్ల రెండో దశ పనులను వేగవంతం

### ఆర్డీఎస్ ఆయకట్టు రైతుల ప్రయోజనాలే లక్ష్యం

### నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి



హైదరాబాద్, జూన్ 22: రాజోలిబండ డైవర్షన్ స్కీమ్(ఆర్డీఎస్) ఆధునికీకరణ పనులను ఇకపై ఆలస్యం చేయకుండా వేగవంతంగా పూర్తి చేయాలని నీటిపారుదల, పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. ఆర్డీఎస్ వ్యవస్థను బలోపేతం చేయడం, తుంగభద్ర జలాలపై తెలంగాణ హక్కులను పరిరక్షించడం, తుమ్మిళ్ల ఎత్తిపోతల పథకం రెండో దశ పనులను వేగంగా అమలు చేయడం ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని ఆయన స్పష్టం చేశారు. సోమవారం సచివాలయంలో నిర్వహించిన సమావేశంలో మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ఆర్డీఎస్, తుంగభద్ర ఆనకట్ట నిర్వహణ, అంతర్రాష్ట్ర జలాల పంపిణీ, తుమ్మిళ్ల ఎత్తిపోతల పథకం పురోగతి అంశాలపై సమగ్రంగా

- మిగతా 2వ పేజీలో

# రైతుకు అండగా రేవంత్

(మొదటి పేజీ తరువాయి)

చేస్తున్నారు. ఎన్నికల హామీ ప్రకారం ఎకరానికి రూ. 15 వేలు ఇస్తే స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీకి తిరుగుండదని, అలాగే కౌలు రైతులను ఆదుకునేందుకు ఒక ప్రత్యేక చట్టాన్ని తీసుకురావాలని కొందరు మంత్రులు సీఎంకు ప్రతిపాదనలు పెట్టారు.

### హైటెక్ టెక్నాలజీ

రైతు భరోసాలో ఎలాంటి అవినీతి, అక్రమాలకు తావులేకుండా ప్రభుత్వం హైటెక్ టెక్నాలజీని వాడుతోంది. వ్యవసాయ విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో స్విట్జర్లాండ్ దేశానికి చెందిన సార్ మ్యాప్ సంస్థతో ఒప్పందం కుదుర్చుకుని శాటిలైట్ చిత్రాల ఆధారంగా రాష్ట్రవ్యాప్తంగా సర్వే నిర్వహించారు. ఈ సర్వే ద్వారా రాష్ట్రంలో ఏ గ్రామంలో, ఏ సర్వే నంబర్‌లో, ఏ పంట వేశారనేది 95 శాతం ఖచ్చితత్వంతో గుర్తించారు. పైలట్ ప్రాజెక్ట్ కింద జిల్లాకు 5 గ్రామాలను ఎంపిక చేసి ఏఈఓ లతో క్షేత్రస్థాయిలో సర్వే చేయించగా శాటిలైట్ వివరాలు, క్షేత్రస్థాయి వివరాలు ఒక్కటిగానే వచ్చాయి. దీనివల్ల కేవలం పంట సాగు చేసిన వారికే ప్రభుత్వ పథకాలు అందుతాయి. అంతేకాకుండా ప్రకృతి విపత్తుల వల్ల పంట నష్టపోతే నేరుగా నష్టపరిహారం అందించడానికి, విత్తనాలు–ఎరువులు ముందే సిద్ధం చేసుకోవడానికి ఈ డేటా ప్రభుత్వానికి ఎంతో ఉపయోగపడనుంది. ప్రభుత్వం తీసుకోబోతున్న ఈ విప్లవాత్మక మార్పులతో నిజమైన పేద రైతులకు పూర్తి స్థాయిలో భరోసా దక్కనుందని స్పష్టమవుతోంది.

# బలిపశువుగా వాన్స్?

(మొదటి పేజీ తరువాయి)

కాలిబాఫ్, విదేశాంగ మంత్రి అబ్బాస్ అరాక్చీ ఫొటోల కార్యక్రమం నుంచి అర్ధాంతరంగా వాకౌట్ చేశారు. వాషింగ్టన్ నుంచి ట్రంప్ చేసిన తాజా హెచ్చరికలపై వారు మండిపడ్డారు. అమెరికా ప్రతినిధులను సైతం అవమానించారు. దీంతో ఇవన్నీ వాన్స్ నేరుగా భరించాల్సి వచ్చింది. ప్రజల నుంచి వస్తున్న విమర్శలను ఆయన ఎదుర్కొన్నారు. ట్రంప్ ప్రతిపాదించిన 14 అంశాల శాంతి ఒప్పందంపై స్వదేశంలో తీవ్ర విమర్శలు వస్తున్నాయి. రిపబ్లికన్ పార్టీలోని రక్షణ నిపుణులు దీనిని తప్పుబడుతున్నారు. ఇరాన్‌పై చమురు ఆంక్షల ఎత్తివేత, నిలిచిపోయిన నిధుల విడుదల వంటి నిర్ణయాలను వారు అమెరికా లొంగుబాటుగా భావిస్తున్నారు. మధ్యప్రాచ్య వ్యవహారాల్లో జోక్యాన్ని తీవ్రంగా వ్యతిరేకించే వాన్స్ ఇప్పుడు ఈ ఒప్పందానికి ప్రధాన మద్దతుదారుగా నిలవడం గమనార్హం. విదేశాంగ కార్యదర్శి మార్కో రూబియో, రక్షణ కార్యదర్శి పీట్ హెగ్సెత్ వంటి కఠిన వైఖరి గల నాయకులు ఈ చర్చల నుంచి వ్యూహాత్మకంగా తప్పుకున్నారు. దీంతో వాన్స్ ఒంటరి అయిపోయారు. వాన్స్ రాజకీయ భవిష్యత్తుకు ఇది అత్యంత కీలకమైన సమయం. ఇరాన్‌తో శాంతి ఒప్పందానికి ఆయనే ప్రధాన నాయకుడిగా మారారు. ఒకవేళ ఇరాన్‌తో విజయవంతంగా ఒప్పందం కుదిరితే ఆయన రాజకీయ కెరీర్ అద్భుతంగా ఎదుగుతుంది. రిపబ్లికన్ అధ్యక్ష అభ్యర్థిత్వానికి ఆయన బలం పెరుగుతుంది. ఒకవేళ చర్చలు విఫలమైతే మాత్రం ట్రంప్ ఆ నిందనంతా వాన్స్ పైనే నెట్టేస్తారు. ట్రంప్ కావాలనే వెలుగులోకి రాకుండా వాన్స్ ముందుకు నెట్టారని వైట్‌హౌస్ వర్గాలు అంటున్నాయి. ట్రంప్ తన డిప్యూటీని బలిపశువును చేశారని కొందరు విశ్లేషిస్తున్నారు.

# ఉద్ధవ్ 'సేన'లో చీలిక

(మొదటి పేజీ తరువాయి)

పాల్గొన్న ఓ కార్యక్రమంలో ఉద్ధవ్ వర్గంలోని ఆరుగురు ఎంపీలు శివసేనలో చేరారు. అనంతరం, ఆరుగురితో కలిసి షిండే మీడియాతో మాట్లాడారు. ఆపరేషన్ టైగర్ విజయవంతంగా పూర్తయిందని ఈ సందర్భంగా ప్రకటించారు. 'ఈ రోజు ఇక్కడ నా పక్కన ఏకంగా ఆరు పులులున్నాయి. ఈసారి మేం సిక్స్ కొట్టాం'అని చెప్పారు. ఈ 6 ఎంపీలు క్షేత్రస్థాయిలో ప్రజలతో మమేకమైన రాజకీయ దురంధరులు అంటూ పొగిడారు. వీరి చేరిక కోసం పక్కా ప్రణాళికతో చేపట్టిన ఆపరేషన్ టైగర్ విజయవంతంగా పూర్తయిందంటూ చెప్పుకొచ్చారు.

### 13కు చేరిన షిండే వర్గం ఎంపీలు

ఢిల్లీలో ఐదు రోజుల క్రితం జరిగిన శివసేన (యూబీటీ) పార్లమెంటరీ పార్టీ భేటీకి మొత్తం 9 మంది ఎంపీలకుగాను ఆరుగురు డుమ్మాకొట్టగా ముగ్గురు మాత్రమే హాజరయ్యారు. ఆ ఆరుగురే తాజాగా షిండే పార్టీలో చేరారు. వారు..సంజయ్ దేశ్‌ముఖ్, సంజయ్ జాదవ్, సంజయ్ దినా పాటిల్, నగేశ్ పాటిల్, ఓం ప్రకాశ్ రాజే నింబాల్కర్, భావుసాహెబ్ వాక్‌చౌరె ఉన్నారు. వీరంతా కలిసి బయటకు రావడంతో ఫిరాయింపుల చట్టం పరిధిలోకి రాకుండా ఉండేందుకు అవసరమైన మూడింట రెండొంతుల మెజారిటీ ఈ వర్గానికి లభించినట్లయింది.

### ఉద్ధవ్ భేటీకి ఎమ్మెల్సీ, ఇద్దరు ఎమ్మెల్యేలు డుమ్మా

శివసేన(యూబీటీ)లో మరో ముసలం మొదలయిందా అంటే, అవుననే అంటున్నారు. సోమ వా రం ఆరుగురు లోక్‌సభ ఎంపీలు షిండే శివసేనలో చేరారు. అదే సమయంలో ఆ పార్టీ చీఫ్ ఉద్ధవ్ ఏర్పాటు చేసిన భేటీకి ముగ్గురు కీలక ప్రజాప్రతినిధులు మొహం చాటేయడమే ఇందుకు కారణంగా మారింది. వర్షాకాల సమావేశాల్లో అసెంబ్లీలో అనుసరించాల్సిన వ్యూహంపై చర్చించేందుకు శివసేన(యూబీటీ) ప్రధాన కార్యాలయం శివాలయ్‌లో ఉద్ధవ్ ఠాక్రే సమావేశం ఏర్పాటు చేశారు. భేటీకి ఎమ్మెల్యేలు సంజయ్ పొట్నిస్, రాహుల్ పాటిల్, ఎమ్మెల్సీ సునీల్ షిండే డుమ్మా కొట్టారు.

# పాలమూరులో బ్రహ్మోస్!

## దేవరకద్ర నియోజకవర్గంలో 416 ఎకరాల్లో క్షిపణి తయారీ కేంద్రం

### శంషాబాద్ విమానాశ్రయానికి 100 కిలోమీటర్ల దూరంలో బెంగళూరు హైవేకు దగ్గర్లో ఏర్పాటు..

హైదరాబాద్, జూన్ 22: అత్యాధునిక బ్రహ్మోస్ క్షిపణులను తయారుచేసే యూనిట్‌ను తెలంగాణలో ఏర్పాటుకు రంగం సిద్ధమైంది. 'మేక్ ఇన్ ఇండియా', 'ఆత్మనిర్భర్ భారత్' పథకాల్లో భాగంగా రక్షణ శాఖ లఖ్‌నవూ (ఉత్తరప్రదేశ్)లోని యూపీ డిఫెన్స్ ఇండస్ట్రియల్ కారిడార్‌లో 200 ఎకరాల విస్తీర్ణంలో రూ.380 కోట్లతో ఇప్పటికే ఒక బ్రహ్మోస్ మిస్సైల్ తయారీ యూనిట్‌ను ఏర్పాటు చేసింది. 2025 మే నెలలో రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ దాన్ని ప్రారంభించారు. ఈ క్రమంలోనే రెండో యూనిట్ ఏర్పాటుకు అవసరమైన భూముల కోసం బ్రహ్మోస్ టీమ్ అన్వేషిస్తున్న నేపథ్యంలో.. ఆ యూనిట్‌ను రాష్ట్రంలో ఏర్పాటు చేయాలని.. అందుకు అవసరమైన భూములను ఇస్తామని సీఎం రేవంత్ ఆ బృందానికి విజ్ఞప్తి చేశారు. అందుకు బ్రహ్మోస్ టీమ్ సానుకూలంగా స్పందించింది. దరిమిలా ఈ యూనిట్‌ను.. మహబూబ్‌నగర్ జిల్లా దేవరకద్ర నియోజకవర్గంలో ఏర్పాటు చేయడానికి సంబంధించి దాదాపు అన్ని ప్రక్రియలూ ప్రాథమికంగా పూర్తయినట్టు తెలిసింది. అక్కడ ఈ యూనిట్ ఏర్పాటు నిమిత్తం సర్వే నిర్వహించిన బ్రహ్మోస్ బృందం.. ఆ ప్రాంతం అన్నివిధాలా అనుకూలంగా ఉందని సంతృప్తి వ్యక్తం చేసినట్టు సమాచారం. దీంతో.. సోమవారం రక్షణ మంత్రి రాజ్‌నాథ్‌తో భేటీ అయిన సీఎం రేవంత్ రెడ్డి.. డీఆర్‌డీఎల్ పరిధిలో చేపట్టే ఈ ప్రాజెక్టుకు అనుమతి ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. నిజానికి ఈ 'బ్రహ్మోస్ ఏరోస్పేస్ సెంటర్'ను తొలుత హైదరాబాద్‌లోనే ఏర్పాటు చేయాలని భావించారు. కానీ భూముల లభ్యత తక్కువగా ఉండడంతో.. మరోచోట పెట్టాలని నిర్ణయించారు. అందుకు అవసరమైన భూములు తమ నియోజకవర్గంలో ఉన్నట్టు దేవరకద్ర ఎమ్మెల్యే మధుసూదన్ సీఎం రేవంత్‌కు తెలియజేశారు. ప్రభుత్వం బ్రహ్మోస్ బృందానికి ఆ వివరాలను తెలపగా... శంషాబాద్ ఎయిర్‌పోర్టుకు కేవలం 100 కిలోమీటర్ల దూరంలో.. బెంగళూరు హైవేకు (ఎన్‌హెచ్–44) దగ్గరగా ఉన్న ఆ భూములను పరిశీలించిన టీమ్ సంతృప్తి వ్యక్తం చేసింది.

# సినిమా చూపిస్తా!



(మొదటి పేజీ తరువాయి)

ప్రజలు ఎదురుచూస్తున్నారు' అని వ్యాఖ్యానించారు. కాంగ్రెస్ ప్రభుత్వం సీఎం రేవంత్‌రెడ్డి పంటల కొనుగోళ్లపై రైతులకు మరణ శాసనం రాస్తున్నదని విమర్శించారు. రెండున్నర సంవత్సరాలలో తెలంగాణ వినాశనం అయిందని, ఇందిరమ్మ రాజ్యంలో ఇంటింటా సంక్షోభం నెలకొన్నదని మండిపడ్డారు. సోమవారం ఉమ్మడి వరంగల్ జిల్లాలోని పరకాల నియోజకవర్గంలోని దామెర, వర్ధన్నపేట నియోజకవర్గంలోని మడికొండలో బీఆర్ఎస్ సభ్యత్వ నమోదు, ఎస్ఐఆర్ ప్రక్రియ, సోషల్ మీడియాపై నిర్వహించిన శిక్షణ తరగతుల కార్యక్రమాలు నిర్వహించారు. ఆయా కార్యక్రమాలకు కేటీఆర్ హాజరై మాట్లాడారు. బీఆర్ఎస్ కార్యకర్తలకు అన్ని విధాలుగా అండగా ఉంటానని, కార్యకర్తలను ఇబ్బందులు పెట్టిన కాంగ్రెస్ నేతలు రిటైర్డ్ అయినా, పారిపోయినా, సప్త సముద్రాల ఆవల ఉన్నా లాక్కొచ్చి నిలబెడతానని హెచ్చరించారు. బీఆర్ఎస్ కార్యకర్తలు, నేతలు అధైర్య పడొద్దని, వచ్చే ఐదేళ్లు చిట్టినాయుడుకు, ఆయన బృందానికి సినిమా చూపెట్టే బాధ్యత తనదేనని సీఎం రేవంత్‌రెడ్డిని ఉద్దేశించి ఘాటుగా వ్యాఖ్యానించారు. అప్పట్లో అర్జున్‌రెడ్డి సినిమా వచ్చిందని, అది సూపర్ హిట్ అని, ఇప్పుడు రేవంత్‌రెడ్డి అనే సినిమా అట్టర్ ఫ్లాప్ అయ్యిందన్నారు. ఇంటర్వెల్ దాకా అయిపోయిన రేవంత్‌రెడ్డి సినిమాలో బూతుల మోతలు, ఎగవేతలు కూల్చివేతలే తప్పా ఏమీ లేవని ఎద్దేవా చేశారు. హామీల గురించి అడిగితే లాగులో తొండలు విడుస్తా, గుడ్లు పీకి గోలీలు ఆడుతా అంటున్నారని మండిపడ్డారు. కుర్చీ మడత పెట్టి కాంగ్రెస్ పార్టీని, సీఎం రేవంత్‌రెడ్డిని ఎప్పుడు తరిమికొట్టాలా అని ప్రజలు ఎదురుచూస్తున్నారని అన్నారు. కేసీఆర్ హయాంలో నాట్ల సమయంలో రైతుబంధు వేస్తే, కాంగ్రెస్ పాలనలో రైతుబంధు బంద్ అయిందని, యూరియా దొరకడం లేదన్నారు.

### బీఆర్ఎస్ టార్చ్ బేరర్.. కాంగ్రెస్‌కు దశ దిశ లేదు

అని మండిపడ్డారు. అధికారం ఎవరికి శాశ్వతం కాదని, అధికారంలో ఎప్పటికీ మనమే ఉంటామని అనుకోవడం కూడా అత్యాశ అవుతుందని పేర్కొన్నారు. పదేళ్ల కేసీఆర్ పాలనలో తెలంగాణ దేశంలోనే టార్చ్ బేరర్‌గా నిలబడిందని, కాంగ్రెస్ పాలనలో దశ దిశ లేకుండా పోయిందని విమర్శించారు. అందుకే దేశమంతా కాంగ్రెస్ పాలనను ప్రజలు వదిలించుకున్నారని అభిప్రాయపడ్డారు. తెలంగాణ వచ్చేదాకా ఉద్యమం వదిలేస్తే నన్ను రాళ్లతో కొట్టి చంపండి అని ప్రజలకు అధికారం ఇచ్చిన ఏకైక నాయకుడు కేసీఆర్ అని గుర్తు చేశారు. కేసీఆర్ అనే మూడు అక్షరాల పదమే లేకపోతే తెలంగాణ రాష్ట్రమే లేదని, తెలంగాణ తెచ్చింది గులాబీ జెండా అని ఆ గులాబీ జెండానే రాష్ట్రానికి శ్రీరామరక్ష అని ఆయన అభిప్రాయపడ్డారు. ఇందిరమ్మ రాజ్యం వచ్చింది, ఇంటింటా సంక్షోభం తెచ్చిందని విమర్శించారు. పంటల కొనుగోళ్లపై రేవంత్‌రెడ్డి రైతులకు మరణ శాసనం రాసిందని మండిపడ్డారు. ఒకప్పుడు కేంద్రం చెప్తే వినడానికి మోదీ బ్రోకరా అన్న రేవంత్‌రెడ్డి.. ఇప్పుడు అదే పని చేస్తున్నాడని ఆరోపించారు. సీఎం మాటలను చూస్తే వచ్చే సీజన్ నుంచి రైతన్నల పంటలు కొనే నాథుడే ఉండరనిపిస్తోందని పేర్కొన్నారు. రెండున్నర సంవత్సరాలలో రాష్ట్రానికి కాంగ్రెస్ ఒక్క మంచి పని చేయలేదని విమర్శించారు. తాను సాఫ్ట్‌వేర్ మాత్రమే కాదు.. హార్డ్‌వేర్ కూడా అని, తనకు కాంగ్రెస్‌పై గేర్ ఎప్పుడు మార్చాలో తెలుసని చెప్పారు. గత పదేళ్ల మాదిరిగా బీఆర్ఎస్ ఇప్పుడు ఉండదని, పార్టీ శ్రేణులను ఇబ్బందులు పెట్టిన వారికి తప్పనిసరిగా సినిమా చూపిస్తానని ప్రకటించారు. బీఆర్ఎస్ సభ్యత్వం పూర్తిగా డిజిటల్ విధానంలో నిర్వహిస్తున్నామని, ఆధునిక సాంకేతికతను వినియోగిస్తున్నామని, సభ్యత్వ నమోదు కార్యక్రమం పూర్తయిన వెంటనే డిజిటల్ మెంబర్షిప్ కార్డు అందుబాటులోకి వస్తుందని, పార్టీ కార్యకర్తలు అభిమానులు పెద్ద ఎత్తున సభ్యత్వం తీసుకోవాలని కేటీఆర్ పిలుపునిచ్చారు. వచ్చే ఐదేళ్లు కార్యకర్తల అభివృద్ధి లక్ష్యంగా పనిచేసే బాధ్యత నేను తీసుకుంటానని ప్రకటించారు. ఈ కార్యక్రమంలో అరూరి రమేష్, మాజీ మంత్రి సత్యవతి రాథోడ్, ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి, ఎమ్మెల్సీ పోచంపల్లి శ్రీనివాస్ రెడ్డి, ఎమ్మెల్సీ దేశపతి శ్రీనివాస్, ఎమ్మెల్యే పాడీ కౌశిక్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు దాస్యం వినయ్ భాస్కర్, టి. రాజయ్య, పెద్ది సుదర్శన్ రెడ్డి, గండ్ర వెంకటరమణ రెడ్డి, మాజీ కార్పొరేషన్ చైర్మన్లు సతీష్ రెడ్డి, వాసుదేవ రెడ్డి, మాజీ జడ్పీ చైర్మన్ సుధీర్ బాబు, బిఆర్ఎస్ నాయకులు ఏనుగుల రాకేష్ రెడ్డి, లలిత యాదవ్ పాల్గొన్నారు.

## వడ్లనే కొనలేని సీఎం

# భారాసను గెలవనివ్వరట!

(మొదటి పేజీ తరువాయి)



హాజరై హరీశ్‌రావు మాట్లాడారు. "పాలమూరు ప్రాజెక్టుల పూర్తికోసం జొన్నలబొగుడ వద్ద గబ్బిలాలు తిరిగిన చోట రాత్రుళ్లు నిద్రించాం. ఐదేళ్లలో 6.50 లక్షల ఎకరాలకు నీళ్లిచ్చాం. పనులన్నీ అయిపోయినా మిగిలిన కాలువలు పూర్తిచేయలేకపోతున్నారు.

ప్రస్తుత ముఖ్యమంత్రికి పాలమూరు ప్రాజెక్టులు అర్థమవ్వడానికే రెండున్నరేళ్లు పట్టింది. పూర్తికి ఎంత సమయం పడుతుందో. మరోపక్క రుణమాఫీ చేయకుండా, రైతుబంధు(భరోసా) ఇవ్వకుండా రేవంత్ మోసం చేస్తున్నారు. మా హయాంలో కొవిడ్, ఆర్థికమాంద్యం వచ్చినా...11 విడతల్లో రూ.73 వేల కోట్లు రైతుబంధు ఇచ్చాం. రెండు సార్లు కాదు మూడుసార్లు ఇవ్వాలన్న రేవంత్‌రెడ్డి ప్రస్తుతం ఒక్క ఎకరా రైతుబంధు(భరోసా)నిధుల విడుదల కోసం ఒక్కో పబ్లిక్ మీటింగ్ పెడుతున్నారు. మా ప్రభుత్వంలో నిధుల విడుదల కోసం మీటింగ్‌లు పెట్టిన ఘటనలే లేవు. ఎన్నికల ముందు అన్ని పంటలకు బోనస్ ఇస్తామని..ఇప్పుడు ఏడు రకాలకే అంటున్నారు.

### కొండల్‌రెడ్డి బ్యాంకు పెట్టినా ఆశ్చర్యంలేదు

ఎస్సీ, ఎస్టీ, బీసీ కార్పొరేషన్ల ద్వారా ఎవరికీ సహాయం అందడం లేదు. గీత కార్మికులు చనిపోతే ఇచ్చే ఎక్స్‌గ్రేషియా 700 మందికి అందలేదు. సిగాచి పరిశ్రమ బాధితులకు ఇంకా పరిహారం ఇవ్వలేదు. భూముల విషయంలో కోర్టుకు వెళ్లినందుకు ఎస్బీఐని నిషేధిస్తామంటున్నారు. రాష్ట్ర లావాదేవీలు నిర్వహించడానికి బ్యాంకులు తప్పనిసరి కదా..వాటిని నిషేధించి కొండల్‌రెడ్డి అనే బ్యాంకు పెట్టినా ఆశ్చర్యంలేదు. అందరూ రావడం కోసం ప్రజల సౌకర్యార్థం రూ.50 కోట్లతో ప్రగతిభవన్ నిర్మిస్తే.. అన్ని నిధులు అవసరమా అని మాట్లాడిన రేవంత్‌రెడ్డి ఆయన ఇంటికి సమీపంలో ఎంసీహెచ్‌ఆర్‌డీలో రూ.100 కోట్లు పెట్టి విలాసవంత క్యాంప్ ఆఫీస్ కట్టి రూ.17 కోట్లతో కంచె ఏర్పాటు చేశారు. రుణమాఫీ, ఫీజు రీయింబర్స్‌మెంట్‌కు మాత్రం డబ్బులు లేవంటున్నారు. మ్యానిఫెస్టోలో చెప్పిన హామీలు అమలు చేయకపోవడంతో కరీంనగర్ మీటింగ్‌లో ఎనుముల రేవంత్‌రెడ్డి కాదు ఎగవేతలరెడ్డి అన్నందుకు నాపై కేసు పెట్టారు" అని మాజీ మంత్రి మాట్లాడారు. కార్యక్రమంలో మాజీ మంత్రులు నిరంజన్‌రెడ్డి, శ్రీనివాస్‌గౌడ్, ఎమ్మెల్సీ నవీన్‌కుమార్, మాజీ ఎమ్మెల్యేలు జనార్దన్‌రెడ్డి, జైపాల్‌యాదవ్, ఆల వెంకటేశ్వర్‌రెడ్డి, భారాస రాష్ట్ర నాయకులు ప్రవీణ్‌కుమార్, ఎర్రోళ్ల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# ఆర్డీఎస్ వేగవంతం

(మొదటి పేజీ తరువాయి)



సమీక్షించారు. సమావేశంలో రైతు ప్రతినిధులు ఆర్డీఎస్ హెడ్‌వర్క్స్ దుస్థితి, పొరుగు రాష్ట్రాల ద్వారా జరుగుతున్న అనధికార నీటి మళ్లింపులు, తుంగభద్ర జలాశయంలో పూడిక పేరుకుపోవడం వల్ల నిల్వ సామర్థ్యం తగ్గిపోవడం వంటి అంశాలను మంత్రి దృష్టికి తీసుకువచ్చారు. ఆర్డీఎస్ వ్యవస్థలోని అనేక నిర్మాణాలు కాలపరిమితి దాటిపోయాయని, అత్యవసర పునరుద్ధరణ అవసరమని వారు వివరించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. ఆర్డీఎస్ ఆధునికీకరణ పనులపై సమగ్ర కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. పెండింగ్‌లో ఉన్న బలోపేత పనులను త్వరితగతిన పూర్తిచేయాలని, కాలువ గట్టులను పటిష్టం చేయాలని, నీటి నష్టాలను తగ్గిస్తూ కాలువల సామర్థ్యాన్ని పెంచే చర్యలు చేపట్టాలని సూచించారు. తుమ్మిళ్ల ఎత్తిపోతల పథకం రెండో దశలో భాగంగా మల్లమ్మకుంట, జూలకల్, వల్లూరు జలాశయాల నిర్మాణానికి అవసరమైన భూసేకరణను ప్రాధాన్యతతో చేపట్టాలని మంత్రి ఆదేశించారు. ఈ జలాశయాల ద్వారా సుమారు 2.12 టీఎంసీల స్థూల నీటి నిల్వ సామర్థ్యం ఏర్పడుతుందని తెలిపారు. భూసేకరణ వల్ల ప్రభావితమయ్యే రైతులకు న్యాయమైన, తగిన పరిహారం అందేలా చూడాలని రెవెన్యూ అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. మల్లమ్మకుంట జలాశయం వల్ల 567 ఎకరాలు, జూలకల్ వల్ల 382 ఎకరాలు, వల్లూరు జలాశయం వల్ల 2,216 ఎకరాలు ముంపునకు గురయ్యే అవకాశం ఉందని అధికారులు వివరించారు. ఆర్డీఎస్ కాలువ వ్యవస్థ ద్వారా తెలంగాణకు హామీ మేరకు నీటి విడుదలలు కొనసాగేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని మంత్రి సూచించారు. కాలువ వ్యవ స్థలో కీలక ప్రాంతాల్లో నీటి ప్రవాహాలను రక్షించేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. తుంగభద్ర జలాలపై తెలంగాణకు ఉన్న న్యాయబద్ధమైన హక్కులను ఎట్టి పరిస్థితుల్లోనూ రాజీపడబోమని మంత్రి స్పష్టం చేశారు. తుంగభద్ర బోర్డులో తెలంగాణకు ప్రాతినిథ్యం వహిస్తున్న అధికారులు మరింత చురుకుగా వ్యవహరించాలని మంత్రి సూచించారు. ఆర్డీఎస్ నిర్వహణ, కేసీ కెనాల్ నీటి విడుదలలు, అంతర్రాష్ట్ర సమన్వయం, ట్రిబ్యునల్ తీర్పుల అమలు వంటి అంశాలపై కూడా చర్చించారు. సాంకేతిక అంశాలు, రైతుల ఆందోళనలు, న్యాయపరమై న అంశాలు, విధానపరమైన ప్రత్యామ్నాయాలపై సమగ్ర నివేదిక సిద్ధం చేసి సీఎం రేవంత్ రెడ్డికి సమర్పించాలని మంత్రి అధికారులను ఆదేశించారు. ఈ విషయాలపై త్వరలోనే ముఖ్యమంత్రితో ప్రత్యేకంగా చర్చిస్తామని మంత్రి తెలిపారు. కర్ణాటక, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలు, కేంద్ర ప్రభుత్వంతో సమన్వయం కొనసాగిస్తూనే తెలంగాణ నీటి హక్కులను దృఢంగా కాపాడుతామని మంత్రి స్పష్టం చేశారు. ఈ సమావేశంలో నీటిపారుదల శాఖ ముఖ్యకార్యదర్శి ఈ శ్రీధర్, సహాయ కార్యదర్శి కే శ్రీనివాస్, ఇంజినీర్– ఇన్–చీఫ్ జనరల్ రమేష్‌బాబు, నీటిపారుదల శాఖ ఇంజినీర్లు, జలవ నరుల నిపుణులు, ఉన్నతాధికారులు, ఆర్డీఎస్ ఆయకట్టు రైతులు పాల్గొన్నారు.

# మెట్రోపై సానుకూలం

(మొదటి పేజీ తరువాయి)



సమాచారం. దీనిలో ప్రధానంగా రూ.10వేల కోట్లు తక్కువ ఖర్చయ్యేలా సూచించిన ఆర్ఆర్‌టీఎస్ ఫార్ములాకు రాష్ట్ర ప్రభుత్వం ఒప్పుకోలేదనే విషయాన్ని కిషన్ రెడ్డి ప్రస్తావించినట్లు తెలిసింది. మెట్రో రెండో దశకు కేంద్రం సూత్రప్రాయంగా అంగీకారం తెలిపిన విషయాన్ని అశ్వినీ వైష్ణవ్ చెప్పినట్లు సమాచారం. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మధ్య సమన్వయం కోసం సంయుక్త కమిటీ ఏర్పాటు చేస్తే, తద్వారా సమన్వయ ప్రక్రియ ఆలస్యం లేకుండా మెట్రో విస్తరణ వేగవంతమవుతుందనే విషయాన్ని ఇద్దరు కేంద్ర మంత్రులూ రేవంత్‌రెడ్డితో అన్నట్లు తెలిసింది.

### మెట్రో ఫేజ్--2 50:50 నిష్పత్తిలో..

హైదరాబాద్ మెట్రో ఫేజ్--1లో ఈక్విటీ షేర్ కొనుగోలుకు రూ.1,461.47 కోట్లు, ప్రాజెక్టు అప్పుల రీఫైనాన్సింగ్‌కు రూ.13,538.53 కోట్లు కలిపి మొత్తం రూ.15వేల కోట్ల లావాదేవీలున్నాయి. రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన గ్యారంటీ మేరకు ఐఆర్ఎఫ్‌సీ రుణం మంజూరు చేయడానికి ఒప్పందం కుదిరింది. అయితే, జూన్ 15న మొదటి విడత రుణం విడుదల కాలేదని ఈ సందర్భంగా రేవంత్ రెడ్డి అశ్వినీ వైష్ణవ్‌కు చెప్పారు. ఆ రుణం విడుదల చేయడంతోపాటు మెట్రో ఫేజ్--2ను 50:50 నిష్పత్తిలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు జాయింట్ వెంచర్‌గా చేపట్టేలా ఆమోదించాలని కోరారు. భేటీ అనంతరం రేవంత్‌రెడ్డి మీడియాతో మాట్లాడుతూ.. చర్చలు సానుకూలంగా సాగినట్లు చెప్పారు. మంగళవారం కేంద్ర గృహనిర్మాణం, పట్టణ వ్యవహారాల శాఖ మంత్రి మనోహర్ లాల్ ఖట్టర్‌తో సమావేశమైన తర్వాత, మెట్రో ప్రాజెక్టు సమస్యలు కొలిక్కి వచ్చే అవకాశం ఉందని చెప్పారు. ఖట్టర్, రేవంత్ భేటీలో కిషన్‌రెడ్డి కూడా పాల్గొననున్నారు.

### పరస్పర సవాళ్ల మధ్య భేటీ

హైదరాబాద్ మెట్రో రైలు వ్యవహారం ముందుకెళ్లకుండా మోకాలడ్డుతున్నారంటూ కిషన్‌రెడ్డిపై కొన్నిరోజులుగా రేవంత్‌రెడ్డి ఆరోపణలు చేస్తున్న విషయం తెలిసిందే. దీనికి కిషన్‌రెడ్డి స్పందిస్తూ ఎన్నికల హామీల అమలులో తమ వైఫల్యంపై ప్రజల దృష్టి మళ్లించడానికే రేవంత్ నిరాధార ఆరోపణలు చేస్తున్నారని మండిపడ్డారు. రాష్ట్ర అభివృద్ధికి నిధులివ్వొద్దని తాను ఏ మంత్రికి చెప్పానో నిరూపించగలరా? అని సవాలు కూడా విసిరారు. అయితే తాను రెండ్రోజుల ఢిల్లీ పర్యటనకు వస్తున్నానని, అప్పుడు రైల్వే మంత్రి అశ్వినీ వైష్ణవ్‌తో సమావేశం ఏర్పాటు చేయించాలని రేవంత్ బహిరంగ లేఖ రాశారు. ఈ నేపథ్యంలో రైల్వే మంత్రితో రేవంత్ రెడ్డి, కిషన్‌రెడ్డి సమావేశమవ్వడం ప్రాధాన్యం సంతరించుకుంది.

# ముంబైని తాకిన రుతుపవనాలు

ముంబై, జూన్ 22: ఎట్టకేలకు నైరుతి రుతు పవనాలు ముంబై నగరంలోకి ప్రవేశించాయి. జూన్ మధ్యలో కాస్త నెమ్మదించినప్పటికీ, బంగాళాఖాతంలో ఏర్పడిన వాతావరణ పరిస్థితుల వల్ల రుతుపవనాలు చురుగ్గా మారి ఎడతెరిపి లేకుండా వర్షాలు కురుస్తున్నాయి. అరేబియా సముద్రం నుంచి వీస్తున్న గాలులు ముంబై, దక్షిణ గుజరాత్ ప్రాంతాల్లో రుతుపవనాలను మళ్లీ చురుగ్గా మార్చాయి. గత రెండు వారాలుగా రుతుపవనాల గమనం పూర్తిగా నిలిచిపోయింది. దీంతో దేశవ్యాప్తం గా జూన్ నెలలో తీవ్ర వర్షభావ పరిస్థితులు ఏర్పడ్డాయి. ప్రస్తుతం వాతావరణ పరిస్థితుల్లో క్రమంగా మార్పులు వస్తున్నాయి. లోతైన రుతుపవన తేమ ముంబై, పరిసర ప్రాంతాలకు చేరుతోంది. తేమతో కూడిన గాలులు సూరత్ సహా దక్షిణ గుజరాత్ వైపు విస్తరిస్తున్నాయి. వాతావరణ పటాల ప్రకారం అరేబి యా సముద్రపు రుతుపవన శాఖ మళ్లీ పుంజుకుంటోంది. వాతావరణంలో తేమ రవాణా బలోపేతం అవుతున్నట్లు సంకేతాలు కనిపిస్తున్నాయి. రాబోయే 24 నుంచి 48 గంటల్లో మహారాష్ట్ర, గుజరాత్, మధ్య భారత ప్రాంతాలలో వర్షాలు క్రమంగా పెరుగుతాయి. రుతుపవనాలు మళ్లీ పుంజుకున్నప్పటికీ ఇప్పటికే చాలా ఆలస్యమైంది. కాగాగత 146 సంవత్సరాలలో ఎన్నడూ లేనంత అత్యంత పొడి వాతావరణం ఈ జూన్లో నమోదైంది.



## నిబంధనలు పాటించని పానీ పూరి విక్రయ కేంద్రాలపై చర్యలు

**(పాష సయ్యద్ ప్రజాతీర్పు వేములవాడ) జూన్ 22:**

ఆహార భద్రత నిబంధనలు పాటించని పలు పానీ పూరి విక్రయ కేంద్రాలపై అధికారులు చర్యలు తీసుకున్నారు. కేసు నమోదు చేశారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు, సిరిసిల్ల వేములవాడ పట్టణాల్లో రెవెన్యూ అధికారులు, మున్సిపల్ కమిషనర్లు, వైద్య శాఖ అధికారులు, ఆహార భద్రతా అధికారి సంయుక్తంగా పానీపూరి విక్రయ దుకాణాల్లో ఇటీవల తనిఖీ చేశారు. సిరిసిల్లలోని కైలాస్ పానీ పూరి, శివ్ కైలాస్ బేల్, అలాగే వేములవాడ లోని అనిల్ పానీ పూరి, శ్రీ బాలాజీ చాట్ భండార్, శ్రీ లక్ష్మీ చాట్ భండార్, సాయి చాట్ భండార్, దేవీ నారాయణ చాట్ భండార్, శ్రీ లక్ష్మీ చాట్ భండార్ లో తనిఖీ చేయగా, అపరిశుభ్రమైన పరిసరాల్లో తయారు చేసిన పానీ పూరీలు, పప్పు, పరిశుభ్రంగా లేని నీరు, ఉల్లిగడ్డలు, ఆలు గడ్డలు అధికారులు గుర్తించారు. ఆహార పదార్థాల తయారీ లో పాటించాల్సిన జాగ్రత్తలు నియమాలపై అవగాహన కల్పించారు. పని సమయంలో తప్పనిసరిగా ఆప్రాన్లు, హెయిర్ క్యాప్స్ ధరించాలని వారికి ఆదేశాలు జారీ చేశారు. సరైన ఆహార భద్రత ప్రమాణాలు పాటించని ఆయా దుకాణాల యజమానులపై కేసులు నమోదు చేశారు. జిల్లాలోని అన్ని ఆహార పదార్థాల విక్రయ దుకాణాల్లో నిరంతరం ఆకస్మిక తనిఖీ చేస్తామని, నిబంధనలు పాటించని వారిపై చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని అధికారులు స్పష్టం చేశారు.




## పోరాటాల ద్వారానే ఇంక్రిమెంట్లు జీవో జారీ చేయడం హర్షణీయం

### తెలంగాణ రాష్ట్ర రెవెన్యూ రికార్డ్ అసోసియేషన్

**(ప్రజాతీర్పు ప్రతినిధి, హైదరాబాద్)**

తెలంగాణ రాష్ట్రంలోని రికార్డ్ అసిస్టెంట్లు, అటెండర్లు, చైన్‌మెన్‌లకు సంబంధించిన ప్రొబేషన్, ఇంక్రిమెంట్లు, సీనియారిటీ ఫిక్సేషన్ వంటివి పోరాటాల ద్వారా సాధించుకున్నామని తెలంగాణ రాష్ట్ర రెవెన్యూ రికార్డ్ అసోసియేషన్ నేతలు పేర్కొన్నారు. ఉద్యోగుల పోరాటాన్ని గుర్తించిన ప్రభుత్వం రాష్ట్రంలోని రికార్డ్ అసిస్టెంట్లు, అటెండర్లు, చైన్‌మెన్‌లకు సంబంధించిన ప్రొబేషన్, ఇంక్రిమెంట్లు, సీనియారిటీ ఫిక్సేషన్‌కు సంబంధించి ఈ నెల 16న జీవో జారీ చేయగా, ఈ రోజు అన్ని జిల్లాల కలెక్టర్లకు ఆదేశాలు అందాయని పేర్కొన్నారు. సీసీఎల్ఏ కార్యాలయంలో సోమవారం జరిగిన సమావేశంలో అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు మెట్టు రవీందర్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎడ్ల వెంకటేష్, రాష్ట్ర కోశాధికారి బాలరాజు రికార్డ్ అసిస్టెంట్లు, అటెండర్లు, చైన్‌మెన్‌ను ఉద్దేశించి మాట్లాడారు. రికార్డ్ అసిస్టెంట్లు, అటెండర్లు, చైన్‌మెన్‌ల ప్రొబేషన్, ఇంక్రిమెంట్లు, సీనియారిటీ ఫిక్సేషన్‌పై కొంతకాలంగా అసోసియేషన్ నాయకత్వంలో ముఖ్యంగా రాష్ట్ర అధ్యక్షులు మెట్టు రవీందర్ నాయకత్వంలో పలు కార్యక్రమాలు చేపట్టినట్లు వివరించారు. ఆ కృషికి ఫలితంగా నేడు సీసీఎల్ఏ నుండి జిల్లాలకు స్పష్టమైన ఆదేశాలు జారీ కావడం రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న రికార్డ్ అసిస్టెంట్లు, అటెండర్లు, చైన్‌మెన్‌లకు ఎంతో ఆనందాన్ని కలిగించే విషయమన్నారు. ఈ విజయానికి సహకరించిన ప్రతి జిల్లా నాయకత్వానికి, సభ్యులకు పోరాటంలో భాగస్వాములైన ప్రతి ఒక్కరికీ తెలంగాణ రాష్ట్ర రికార్డ్ అసిస్టెంట్ అసోసియేషన్ తరఫున హృదయపూర్వక ధన్యవాదాలు తెలియజేస్తున్నామని వివరించారు. ఈ కార్యక్రమంలో ఇంకా హనుమకొండ జిల్లా అధ్యక్షులు చుంచు శ్రీను, నిజామాబాద్ జిల్లా అధ్యక్షులు షాదుల్లా, తదితరులు పాల్గొన్నారు.


మెట్టు రవీందర్. రాష్ట్ర అధ్యక్షులు


ఎడ్ల వెంకటేష్ ప్రధాన కార్యదర్శి


మన్నే బాలరాజ్ రాష్ట్ర కోశాధికారి

## ప్రభుత్వ డిగ్రీ కళాశాల, కోరుట్లలో జాబ్ మేళా

**కోరుట్ల, జూన్ 22 (ప్రజాతీర్పు)**

విద్యార్థులు మరి యు నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించాలనే లక్ష్యంతో ప్రభుత్వ డిగ్రీ కళాశాల, కోరుట్ల ఆధ్వర్యంలో 2026 జూన్ 23వ తేదీ మంగళవారం ఉద యం 10:00 గంటలకు కళాశాల ప్రాంగణంలో భారీ జాబ్ మేళా నిర్వహించబడనుంది. ఈ కార్యక్రమానికి కళాశాల ప్రిన్సిపాల్ ఎన్. సందీప్ అధ్యక్షత వహిం చనున్నారు. బ్యాంకిం గ్ మరియు ఫైనాన్స్ రంగాలకు చెందిన ప్రముఖ సంస్థలు టాటా క్యాపిటల్, బజాజ్ ఫిన్‌సర్వ్, SBI సెక్యూరిటీస్, ICICI బ్యాంక్, IDFC ఫస్ట్ బ్యాంక్, ముత్తూట్ ఫిన్‌కార్ప్, యాక్సిస్ బ్యాంక్, యెస్ బ్యాంక్ తదితర సంస్థలు పాల్గొని అర్హులైన అభ్యర్థులను ఎంపిక చేయనున్నాయి. అభ్యర్థులకు బిజినెస్ డెవలప్‌మెంట్ ఎగ్జిక్యూటివ్ ఉద్యోగ అవకాశాలు అందుబాటులో ఉంటాయి. డిగ్రీ, పీజీ, ఎంబీఏ, ఎంసీఏ పూర్తి చేసిన అభ్యర్థులు ఈ జాబ్ మేళాలో పాల్గొనవచ్చు. అభ్యర్థుల వయస్సు 28 సంవత్సరాల లోపు ఉండాలి. పాల్గొనే అభ్యర్థులు తమ తాజా బయోడేటా యొక్క పలు ప్రతులు, విద్యార్హతల ధ్రువపత్రాలు, ఆధార్ కార్డు వెంట తీసుకురావలసిందిగా నిర్వాహకులు కోరారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని విద్యార్థులు, నిరుద్యోగ యువతీ యువకులు ఉద్యోగాలను పొందాలని కళాశాల ప్రిన్సిపాల్ ఎన్. సందీప్ పిలుపునిచ్చారు. సంప్రదించవలసిన వారు: డా. వసీమ్ బేగం అసిస్టెంట్ ప్రొఫెసర్, ఉర్దూ మొబైల్: 7989882595 తోట రాజ్‌కుమార్ లెక్చరర్, కంప్యూటర్ సైన్స్ అండ్ అప్లికేషన్స్ మొబైల్: 8500093263




# ప్రజావాణి దరఖాస్తులను త్వరగా పరిష్కరించాలి

### జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్

**(వి వెంకటేష్ ప్రజాతీర్పు మంచిర్యాల స్టాఫ్ రిపోర్టర్) జూన్ 22**

ప్రజావాణి కార్యక్రమంలో అందిన దరఖాస్తులను త్వరగా పరిష్కరించే విధంగా అధికారులు సమన్వయంతో కృషి చేయాలని మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. సోమవారం జిల్లాలోని నస్పూర్ లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సమావేశ మందిరంలో జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) వి.రాములు, జిల్లా రెవెన్యూ అధికారి మోతిరామ్, ట్రైనింగ్ డిప్యూటీ కలెక్టర్ విలాయత్ అలీ లతో కలిసి అర్జీదారుల నుండి దరఖాస్తులు స్వీకరించారు. చెన్నూరు పట్టడానికి చెందిన లింగ కృష్ణ తాను టైల్స్, మార్బుల్ వ్యాపారం నిర్వహిస్తున్నానని, అన్ లోడింగ్ సమయంలో హమాలీలు అధిక ధరలు చెబుతూ ఇబ్బందులకు గురి చేస్తున్నారని, ఈ విషయమై తగు చర్యలు తీసుకోవాలని కోరుతూ అర్జీ సమర్పించారు. మంచిర్యాల పట్టణానికి చెందిన దోమల చంద్రశేఖర్ తన కూతురు మందమర్రి లోని మహాత్మ జ్యోతిబాపూలే పాఠశాలలో ఆరవ తరగతి పూర్తి చేసిందని, మంచిర్యాలలోని వసతి గృహానికి బదిలీ చేయగలరని కోరుతూ దరఖాస్తు అందజేశారు. నెన్నెల మండలం కోనంపేట గ్రామ రైతులు తమకు ముఖ్యమంత్రి గిరి వికాస్ పథకం కింద మంజూరైన బోర్లకు విద్యుత్ కనెక్షన్ ఇప్పించాలని కోరుతూ దరఖాస్తు అందజేశారు. మంచిర్యాల పట్టణంలోని ఎన్ టి ఆర్ నగర్ కు చెందిన చిలుక పద్మ తాము ఉంటున్న రేకుల ఇల్లు శిథిలావస్థకు చేరుకుందని, ఇందిరమ్మ ఇల్లు ఇప్పించాలని కోరుతూ అర్జీ సమర్పించారు. బెల్లంపల్లి పట్టణానికి చెందిన మాగంటి సౌభాగ్యవతి తాను భూభారతి పోర్టల్ లో పాస్ పుస్తకం వివరాల సవరణ కొరకు దరఖాస్తు చేసుకున్నానని, దరఖాస్తును పరిశీలించి పరిష్కరించాలని కోరుతూ అర్జీ సమర్పించారు. మందమర్రి మండలం అమరవాది కు చెందిన తోటపల్లి లత తన భర్త మరణించినందున జాతీయ కుటుంబ ప్రయోజన పథకం కింద ఆర్థిక సహాయం కోసం దరఖాస్తు చేసుకున్నానని, ఇప్పించాలని కోరుతూ అర్జీ సమర్పించారు. మందమర్రి మండలం గద్దెరాగడి ప్రాంతానికి చెందిన గొట్టే నరేందర్ బెల్లంపల్లి మండలం బుచ్చయ్యపల్లిలో అనుమతులకు మించి మట్టి తవ్వకాలు జరిగాయని, ఈ విషయమై పూర్తి విచారణ చేపట్టాలని కోరుతూ దరఖాస్తు అందజేశారు. జన్నారం మండలం రేండ్లగూడ గ్రామానికి చెందిన సముద్రాల శంకర్ తమ గ్రామంలోని చెరువులపై జరిగిన అక్రమ ఆక్రమణలను తొలగించి చెరువులను పునరుద్ధరించాలని, శాశ్వత రక్షణ చర్యలు చేపట్టాలని కోరుతూ దరఖాస్తు అందజేశారు. అనంతరం వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో ఈ నెల 28న నిర్వహించనున్న పల్స్ పోలియో కార్యక్రమానికి సంబంధించి జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి నరేందర్ రాథోడ్, వైద్యాధికారులతో కలిసి గోడ ప్రతులను ఆవిష్కరించారు. ఈ నెల 29, 30 తేదీలలో ఇంటింటికి తిరిగి పోలియో చుక్కలు వేయడం జరుగుతుందని, సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో 0-5 సంవత్సరాల పిల్లలకు పోలియో చుక్కలు వేయడం జరుగుతుందని, జిల్లా వ్యాప్తంగా 1 వేయి 836 సిబ్బంది 459 బూత్ ల ద్వారా పోలియో చుక్కల పంపిణీ చేయడం జరుగుతుందని తెలిపారు. పోలియో వ్యాక్సిన్ సురక్షితమైనదని, అనారోగ్యంగా ఉన్నవాళ్లు కూడా ఈ వ్యాక్సిన్ వేసుకోవచ్చని తెలిపారు. వర్షాకాలం దృష్ట్యా నీటి జనిత, కీటక జనిత వ్యాధులు వచ్చే అవకాశం ఉన్నందున ప్రతి ఒక్కరు జాగ్రత్తగా ఉండాలని, అన్ని శాఖల సమయంతో సీజనల్ వ్యాధులు రాకుండా చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. జిల్లాను పోలియో రహిత, ఆరోగ్య మంచిర్యాల గా తీర్చిదిద్దడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారూ.






## విమర్శలకు అభివృద్ధి పనులతోనే సమాధానం

### ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్...

**( గుండేటి రాజు ప్రజాతీర్పు జగిత్యాల స్టాఫ్ రిపోర్టర్ ) జూన్ 22.**

అభివృద్ధి పనులతోనే విమర్శకులకు సమాధానం చెబుతానని జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ అన్నారు. రాయికల్ మండలంలోని బషీర్ పల్లి -- చింతలూరు గ్రామాల మధ్య రూ.68 లక్షల వ్యయంతో చేపట్టిన రహదారి పనులను సోమవారం జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నియోజకవర్గ అభివృద్ధిపై వస్తున్న విమర్శలకు తాము చేపడుతున్న అభివృద్ధి పనుల ద్వారానే సమాధానం చెబుతామని అన్నారు. ముఖ్యమంత్రి సహకారంతో జగిత్యాల నియోజకవర్గానికి సుమారు రూ.200 కోట్ల విలువైన రహదారి పనులు మంజూరయ్యాయని తెలిపారు. హామ్ స్కీమ్ కింద పలు కొత్త రహదారులకు ఆమోదం లభించిందని పేర్కొన్నారు. రాయికల్ మండలంలో ఉప్పుమడుగు--లింగాపూర్--ధవన్‌పల్లి రహదారి, జగిత్యాల--కండ్లపల్లి--కిష్టంపేట రహదారి, మూటపల్లి--కొత్తపేట డబుల్ రోడ్డు, కొత్తపేట--లింగాపూర్ (వయా వడ్డెర కాలనీ) రహదారి, లింగాపూర్--తాట్లవాయి డబుల్ రోడ్డు తదితర పనులు మంజూరయ్యాయని చెప్పారు. త్వరలోనే ఈ పనులు ప్రారంభమవుతాయని వెల్లడించారు. అదేవిధంగా, ఈజీఎస్ కింద రూ.2.30 కోట్లతో రోడ్డు పనులకు ఆమోదం లభించిందన్నారు. హామ్ స్కీమ్‌లో నిర్మించే రహదారులను 15 సంవత్సరాల పాటు కాంట్రాక్టర్ నిర్వహణ బాధ్యతలు చేపడతారని తెలిపారు. రాయికల్ మండలంలోని దాదాపు అన్ని ప్రధాన రహదారులను అభివృద్ధి చేసి ప్రజలకు మెరుగైన రవాణా సౌకర్యాలు కల్పిస్తామని ఎమ్మెల్యే వివరించారు. ఈ కార్యక్రమంలో మండల, గ్రామస్థాయి ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, అధికారులు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

## టీసీ పేరుతో ప్రైవేట్ విద్యాసంస్థల దందా

- అక్రమ వసూళ్లు ఆపకపోతే ఆందోళనలు తప్పవు
- టీఎన్ఎస్ఎఫ్

**(దుర్గం నగేష్, ప్రజా తీర్పు పెద్దపల్లి జిల్లా స్టాఫ్ రిపోర్టర్), జూన్ 22**




ప్రైవేట్ పాఠశాలలు, జూనియర్, డిగ్రీ కళాశాలలు విద్యార్థుల నుంచి బదిలీ ధ్రువీకరణ పత్రం (టీసీ) పేరుతో అక్రమంగా భారీ మొత్తంలో డబ్బులు వసూలు చేస్తున్నాయని టీఎన్ఎస్ఎఫ్ పెద్దపల్లి పార్లమెంట్ అధ్యక్షుడు ఎండి వాజీద్ ఆరోపించారు. విద్యార్థులు ఏడాది పొడవునా నిర్ణీత ఫీజులు చెల్లించి చదువు పూర్తిచేసుకున్న తర్వాత టీసీ తీసుకోవడం వారి హక్కు అయినప్పటికీ, రూ.2,000 నుంచి రూ.2,500 వరకు వసూలు చేయడం దారుణమని ఆయన పేర్కొన్నారు. టీసీ జారీకి ఎలాంటి రుసుము వసూలు చేయరాదని స్పష్టమైన నిబంధనలు ఉన్నప్పటికీ, కొన్ని ప్రైవేట్ విద్యాసంస్థలు వాటిని బేఖాతరు చేస్తూ విద్యార్థులు, తల్లిదండ్రులపై ఆర్థిక భారం మోపుతున్నాయని విమర్శించారు. ఈ అక్రమ వసూళ్లు విద్యాశాఖ అధికారులకు తెలియవా? తెలిసినా ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని ప్రశ్నించారు. సంబంధిత అధికారుల తనిఖీలు ఎక్కడ జరుగుతున్నాయో, ఎవరి ప్రోత్సాహంతో ఈ దందా కొనసాగుతోందో ప్రజలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. విద్యాశాఖ అధికారులు వెంటనే జిల్లాలోని అన్ని ప్రైవేట్ పాఠశాలలు, కళాశాలల్లో తనిఖీలు నిర్వహించి, టీసీలను ఎలాంటి రుసుము లేకుండా జారీ చేయాలని స్పష్టమైన ఆదేశాలు ఇవ్వాలని కోరారు. ఈ మేరకు విద్యాధికారి పత్రికా ప్రకటన విడుదల చేసి ప్రజల్లో అవగాహన కల్పించాలని సూచించారు. ఇకపై టీసీ పేరుతో అక్రమంగా డబ్బులు వసూలు చేసే విద్యాసంస్థల ఎదుట టీఎన్ఎస్ఎఫ్ ఆధ్వర్యంలో ధర్నాలు, ఆందోళనలు చేపడతామని ఎండి వాజీద్ హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో రెమ్మ సతీష్, వెంకటేష్, రాజు, నారీ తదితరులు పాల్గొన్నారు.

## ఉద్ధవ్ శివసేనలో మరో చీలిక..

### ఏక్‌నాథ్ షిండే వర్గంలో చేరిన ఆరుగురు రెబల్ ఎంపీలు

శివసేన (యూబీటీ)కి చెందిన ఆరుగురు తిరుగుబాటు ఎంపీలు సోమవారం మహారాష్ట్ర ఉప ముఖ్యమంత్రి ఏక్‌నాథ్ షిండే నేతృత్వంలోని అధికార శివసేనలో చేరిపోయారు. దీంతో ఉద్ధవ్ ఠాక్రే సారథ్యంలోని శివసేన(యూబీటీ) పార్లమెంటరీ పార్టీలో అధికారికంగా చీలిక ఏర్పడింది. శివసేన(యూబీటీ)కి లోక్‌సభలో 9 మంది ఎంపీలు ఉన్నారు. మూడింట రెండు వంతుల సంఖ్యాబలాన్ని సాధించడానికి తిరుగుబాటు వర్గానికి కనీసం ఆరుగురు సభ్యుల అవసరం ఉంది. శివసేన(యూబీటీ)కి చెందిన ఆరుగురు ఎంపీలను తన వర్గంలోకి చేరుకున్న అనంతరం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఏక్‌నాథ్ షిండే మాట్లాడుతూ ఈ పరిణామం తమ పార్టీకి ఒక గొప్ప బలంగా పేర్కొన్నారు. ఇక ఎమ్మెల్యేల తిరుగుబావుటా? ఉద్ధవ్ వర్గంలో ఎమ్మెల్యేలూ తిరుగుబాటుకు సిద్ధమవుతున్నట్లు కనపడుతున్నది.

# జీవో నెంబర్ 42 కి విరుద్ధంగా అధిక ఫీజులు వసూలు

- ప్రైవేట్ పాఠశాలల పైన చర్యలు తీసుకోవాలి.
- ఆల్ ఇండియా స్టూడెంట్ జాయింట్ యాక్షన్ కమిటీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అమ్మ వెంకటేష్.

**జమ్మికుంట జూన్ 22 ప్రజాతీర్పు**



జమ్మికుంట మున్సిపాలిటీ పరిధిలోని పలు ప్రైవేట్ పాఠశాలలు జీవో నెంబర్ 42 కి విరుద్ధంగా అధిక ఫీజులు వసూలు చేస్తూ ప్రభుత్వ నియమ నిబంధనలను తుంగలో తొక్కి వారి ఇష్టా రాజ్యాంగ వ్యవహరిస్తున్నారని ఆల్ ఇండియా స్టూడెంట్ జాయింట్ యాక్షన్ కమిటీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అమ్మ వెంకటేష్ మండల విద్యాధికారికి వినతి పత్రం అందజేసారు. అనంతరం వారు మాట్లాడుతూ.. నేడు ప్రైవేట్ పాఠశాలలో ఐఐటి మెడికల్ ఫౌండేషన్ కర్సులం ఆక్టివిటీస్ పేరిట విద్యార్థుల తల్లిదండ్రుల నుండి అధిక ఫీజులు వసూలు చేస్తూ వారి రక్తాన్ని జలగల పిలుస్తున్నారని, అధిక ఫీజుల దోపిడీ మీద ఉన్న ఆలోచన విద్యార్థుల భవిష్యత్తు మీద లేకుండా పోయిందని, విద్యదానం చేయాల్సినటువంటి విద్యా సంస్థలు విద్యార్థుల పాలిట శాపంగా మారి వేలాది రూపాయల ఫీజులను దండుకుంటున్నారని నేడు ప్రైవేట్ విద్యా సంస్థలు డబ్బుల మీద ఉన్నటువంటి వ్యామోహం విద్యార్థుల భవిష్యత్తు మీద లేకుండా పోయింది ప్రతి విద్య సంవత్సరం విద్యార్థుల మార్కుల పాస్ పర్సంటేజ్ లో మాత్రం విద్యాసంస్థలు పూర్తిస్థాయిలో విఫలమవుతున్నాయి. అధిక ఫీజుల దోపిడీ మీద ఉన్నటువంటి ఆలోచన విద్యార్థులు భవిష్యత్తు మీద ఉంటే బాగుంటుందని, విద్యార్థుల భవిష్యత్తును ఆలోచించకుండా అధిక ఫీజుల దోపిడికి పాల్పడుతున్నటువంటి పలు ప్రైవేట్ పాఠశాల పైన ఎంక్వయిరీ చేసి శాఖ పరమైనటువంటి చర్యలు తీసుకోవాలని కోరడం జరుగుతుందని అమ్మ వెంకటేష్ తెలిపారు. ఈ కార్యక్రమంలో జమ్మికుంట మండల అధ్యక్షుడు గడ్డం సత్య విష్ణు, వరుణ్, కర్మల, సాయిచరణ్, సాయికుమార్, వినయ్, తదితరులు పాల్గొన్నారు.

# పోలీసు నైపుణ్యాల ప్రదర్శనకు డ్యూటీ మీట్ ఉత్తమ వేదిక

## జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ ..

( గుండేటి రాజు ప్రజాతీర్పు జగిత్యాల స్టాఫ్ రిపోర్టర్ ) జూన్ 22.




పోలీస్ అధికారులు, సిబ్బంది విధుల్లో మరింత సమర్థవంతంగా రాణించాలంటే వృత్తి నైపుణ్యం అత్యంత అవసరమని, నేర దర్యాప్తు, శాస్త్రీయ ఆధారాల సేకరణ, కేసుల ఛేదన, ప్రజా భద్రత పరిరక్షణ వంటి అంశాల్లో నిరంతరం తమ నైపుణ్యాలను మెరుగుపరుచుకోవాలని జిల్లా ఎస్పీ అశోక్ కుమార్, పేర్కొన్నారు. జిల్లా పోలీస్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన జిల్లా 3వ పోలీస్ డ్యూటీ మీట్--2026 కార్యక్రమాన్ని ఎస్పీ , అదనపు ఎస్పి తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ, పోలీసు సిబ్బందిలో వృత్తిపరమైన నైపుణ్యాలను పెంపొందించేందుకు, ఆధునిక దర్యాప్తు పద్ధతులు, ఫోరెన్సిక్ సాంకేతికతలు, నేర పరిశోధనలో అనుసరించాల్సిన ఉత్తమ విధానాలపై అవగాహన పెంపొందించేందుకు డ్యూటీ మీట్ ఒక గొప్ప వేదికగా నిలుస్తుందని అన్నారు.పోలీసు శాఖలో ప్రతి అధికారి, సిబ్బంది చట్టాలపై సంపూర్ణ అవగాహనతో పాటు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని సమర్థవంతంగా వినియోగించుకోవాలని సూచించారు. నేరస్థులను శాస్త్రీయ ఆధారాలతో న్యాయస్థానంలో దోషులుగా నిరూపించే సామర్థ్యాన్ని పెంపొందించుకోవడం అత్యంత అవసరమని పేర్కొన్నారు. పోలీస్ డ్యూటీ మీట్ ద్వారా పోలీసు అదికారులు, సిబ్బంది తమ నైపుణ్యాలను ప్రదర్శించేందుకు, అనుభవాలను పంచుకోవడానికి, వినూత్న ఆలోచనలను పరస్పరం మార్పిడి చేసుకునేందుకు చక్కటి వేదిక అని అన్నారు. ఈ డ్యూటీ మీట్‌లో కంప్యూటర్, ఫోరెన్సిక్ సైన్స్, ఫింగర్‌ప్రింట్స్, బాంబ్ డిస్పోజల్, , డాగ్ స్క్వాడ్ ట్రాకింగ్, ఎక్స్‌ప్లోజివ్స్, యాంటీ-సబోటేజ్ చెకింగ్, మరియు కంప్యూటర్ అవగాహన, ఫోటోగ్రఫీ, వీడియోగ్రఫీ, తదితర విభాగాల్లో పోటీలు నిర్వహించబడుతున్నాయని తెలిపారు. వివిధ విభాగాల్లో ప్రతిభ కనబరిచిన అధికారులు, సిబ్బందికి జోనల్ స్థాయి పోటీల్లో పాల్గొనే అవకాశం లభిస్తుందని అదేవిధంగా జాతీయ స్థాయిలో నిర్వహించే పోలీస్ డ్యూటీ మీట్‌లో విజేతలకు విశేష గుర్తింపు లభిస్తుందని, రాష్ట్రాలు మరియు ఇతర ప్రాంతాల పోలీసు అధికారుల మధ్య సమన్వయం, సహకారం, వృత్తిపరమైన అనుభవాల మార్పిడి పెరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ చేతన్ నితిన్, ఐపీఎస్, డీఎస్పీ పురుషోత్తం రెడ్డి, రాములు, ఇన్‌స్పెక్టర్లు ఆరిఫ్ అలీ ఖాన్,సుధాకర్, కరుణాకర్, రవి,లక్ష్మీనారాయణ, కిరణ్ కుమార్,వేణు, ఎస్. ఐ లు మరియు పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.



# విద్యార్థుల సౌకర్యాలపై ప్రత్యేక దృష్టి

- సోఫీనగర్ గురుకుల పాఠశాలలో ఆకస్మిక తనిఖీలు
- స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ బి. వెంకటేశ్వర్లు

నిర్మల్ జిల్లా ప్రతినిధి,జూన్ 22(ప్రజాతీర్పు )

విద్యార్థులకు అందుతున్న వసతులు, భోజన నాణ్యతను క్షేత్రస్థాయిలో స్వయంగా పరిశీలించేందుకు స్థానిక సంస్థల అదనపు కలెక్టర్, మండల ప్రత్యేక అధికారి బి. వెంకటేశ్వర్లు సోమవారం సోఫీనగర్‌లోని ప్రభుత్వ బాలికల గురుకుల పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన హాస్టల్ గదులు, వంటశాల, పాఠశాల పరిసరాలను క్షుణ్ణంగా పరిశీలించారు. విద్యార్థులకు కల్పిస్తున్న వసతులు, సౌకర్యాలపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులకు ఇబ్బందులు కలగకుండా చూడాలని, వసతుల విషయంలో రాజీపడకుండా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.తనిఖీల్లో భాగంగా అదనపు కలెక్టర్ విద్యార్థులతో కలిసి అల్పాహారం స్వీకరించారు. అనంతరం వారి విద్యాభ్యాసం, పాఠశాలలో అందుతున్న సౌకర్యాలపై ముచ్చటించారు. మెనూ ప్రకారం ప్రతిరోజూ రుచికరమైన, పౌష్టికాహారం అందుతున్నదా లేదా అని విద్యార్థులను అడిగి నిర్ధారించుకున్నారు. చదువులో ఏవైనా సందేహాలు ఉన్నా, సమస్యలు ఎదురైనా వెంటనే ఉపాధ్యాయుల దృష్టికి తీసుకురావాలని విద్యార్థులకు సూచించారు. విద్యార్థుల సంక్షేమం, పాఠశాల అభివృద్ధి విషయంలో ఉపాధ్యాయులు, అధికారులు నిరంతరం అప్రమత్తంగా ఉండాలని అదనపు కలెక్టర్ సూచించారు. ఈ పరిశీలనలో ప్రిన్సిపాల్ డానియల్, ఎం. ఈ. ఓ పద్మ, ఉపాధ్యాయులు కల్పన, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



# రైతులకు ఎరువులు పురుగు మందులు విత్తనాలు సబ్సిడీపై ఇవ్వాలి

(పగడాల.రామారావు.. ప్రజా తీర్పు. గార్ల మండల ప్రతినిధి.) జూన్ 22

గార్ల రైతులకు సబ్సిడీపై విత్తనాలు ఎరువులు కల్తీ లేనివి ఇవ్వడంలో ప్రభుత్వం వైఫల్యం చెందిందని ఏఐకేఎంఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షులు జడ సత్యనారాయణ అన్నారు. స్థానిక తహసిల్దార్ కార్యాలయం ముందు ధర్నా జరిగింది. ఈ ధర్నా ను ఉద్దేశించి జడ సత్యనారాయణ ప్రసంగిస్తూ వ్యవసాయ సీజన్ నెత్తిమీద వచ్చిందనిఇప్పటికీ రైతులు దుక్కులు చేస్తున్నారని రైతులకు విత్తనాలు దొరకడం లేదని ఎరువులు పురుగు మందులు కల్తీ మయమయ్యాయని అన్నారు బ్యాంకుల్లో నరసింహన్ కమిటీ సిఫార్సుల మేరకు వ్యవసాయ రంగానికి 18 శాతం రుణాలు ఇవ్వాలని రుణాలు ఇవ్వడం లేదని అన్నారు రైతులు రుణాల కోసం ప్రైవేటు బ్యాంకులను ప్రైవేటు వ్యక్తులపై ఆధారపడి అధిక వడ్డీలకి తీసుకుంటున్నారని అన్నారు రైతులు పండిస్తున్న వరి మిర్చి పత్తి మొక్కజొన్న పంటలకు ఖర్చులు కూడా వెళ్ళటం లేదని ప్రభుత్వం ప్రకటించే మద్దతు ధరలు సహితకంగా లేవని రాబడి కూడా రానటువంటి పరిస్థితి ఉన్నదని దీన్ని దృష్టిలో పెట్టుకొని రైతులకు గిట్టుబాటు ధర కల్పించాలని అన్నారు గత సంవత్సరం 38 రకాల వడ్లైన ప్రభుత్వం కొనుగోలు చేసిందని నేడు ఏడు రకాల వడ్లను మాత్రమే కొనుగోలు చేస్తామని కొర్రీలు పెడుతున్నారని ఈ వడ్లకి ఖర్చు ఎక్కువ అవుతున్నాయని నీ రు కూడా ఎక్కువ అవసరం అవుతుందని చీడపీడలు ఎక్కువగా వస్తాయని అందుకోసం మన ప్రాంత భూసారానికి ఈ ఏడు రకాల సన్నధాన్యం అనుకూలంగా లేదని వీటికి ఖర్చు కూడా అధికంగా అవుతుందని బోనస్ 500 ఇవ్వాలని అన్ని రకాల ధాన్యానికి బోనస్ ఇవ్వాలని అన్నారు. కలితికి పాల్పడుతున్న వ్యాపారస్తులపై పీడీ యాక్ట్ నమోదు చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా సహాయ కార్యదర్శి సక్రు మట్టపల్లి వీరభద్రం గౌని మల్లేష్ మాన్య మారుతి శ్రీరాములు జంగాల పెంటయ్య గోసు చిన్న బజార్ అయ్యా కట్టబోయిన వెంకటేశ్వర్లు చిర్ర కృష్ణ కొండలరావు శ్రీశైలం రవి పుల్లయ్య మాధవరావు పాల్గొన్నారు.



# ఫీజు నియంత్రణ చట్టం తీసుకురావాలని. కోరుతూ.. విద్యార్థి జన సమితి ఆధ్వర్యంలో కలెక్టర్కు వినతిపత్రం

(అనంతుల శ్రీనివాస్ గౌడ్, ప్రజా తీర్పు సూర్యాపేట జిల్లా ప్రతినిధి) జూన్ 22

ఫీజు నియంత్రణ చట్టం తీసుకువచ్చి కార్పొరేట్ ప్రైవేటు విద్యాసంస్థల దోపిడిని అరికట్టాలని కోరుతూ తెలంగాణ విద్యార్థి జన సమితి జిల్లా అధ్యక్షుడు బొమ్మ గాని వినయ్ గౌడ్ ఆధ్వర్యంలో నేడు సూర్యాపేట జిల్లా కలెక్టర్ కార్యాలయంలో వినతిపత్రం సమర్పించడం జరిగింది. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షులు వినయ్ గౌడు మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రైవేట్ కార్పొరేట్ స్కూళ్లు, కళాశాలలు విద్యను వ్యాపారంగా మార్చి తల్లిదండ్రులను దోపిడీ చేస్తున్నాయి అన్నారు. విద్య అందరికీ అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకుంటాము అనిపదేపదే హామీలు ఇస్తున్నప్పటికీ, అవి కేవలం ప్రకటనలకే పరిమితమవుతున్నవి అని విమర్శించారు. రాష్ట్రంలోని మధ్యతరగతి, పేద కుటుంబాలకు చెందిన విద్యార్థులకు నాణ్యమైన విద్య అందడం రోజురోజుకూ భారంగా మారుతోంది . ప్రభుత్వ నిబంధనలను పట్టించుకోకుండా లక్షల రూపాయల ఫీజులు వసూలు చేస్తున్నప్పటికీ వారిపై కఠిన చర్యలు లేకపోవడం దురదృష్టకరశీ ప్రభుత్వం ప్ర ఫీజు నియంత్రణ చర్యలు లేక పేద వర్గాలకు మంచి జరిగే విధంగా నాణ్యమైన విద్య అందించే విధంగా ఎటువంటి చర్యలు తీసుకోకపోవడం దురదృష్టకరం అన్నారు. . అధిక ఫీజుల భారం వల్ల వేలాది మంది తల్లిదండ్రులు అప్పుల పాలవుతుండగా, విద్యార్థులు మానసిక ఒత్తిడికి గురవుతున్నారు ఫీజులు, పుస్తకాలు, యూనిఫాంలు, హాస్టల్ మరియు ఇతర పేర్లతో భారీగా డబ్బులు వసూలు చేస్తూ విద్యార్థుల భవిష్యత్తుతో చెలగాటమాడుతున్నవి రాష్ట్రంలో , అధిక ఫీజులు వసూలు చేస్తున్న సంస్థలపై కఠిన చర్యలు తీసుకోవాలని, ఫీజు నియంత్రణ చట్టం తీసుకురావాలని రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు ఈ కార్యక్రమంలో విద్యార్థి జన సమితి నాయకులు దినేష్ నాయక్. ఈశ్వర్ సింగ్. వరుణ్. హర్ష రింగు. మహేష్. సాయి పాల్గొన్నారు

# రైతులను అయోమయానికి గురి చేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం

- డిజిటల్ 'యూరియా యాప్'ను వెంటనే రద్దు చేయాలి
- వెల్గటూర్ వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ పత్తిపాక వెంకటేష్

(ఎలుక భగవాన్ యాదవ్, ప్రజాతీర్పు, ఎండపల్లి), జూన్ 22:



తెలంగాణ రాష్ట్రంలో వ్యవసాయమంటేనే రైతులు ఆసక్తి చూపే పరిస్థితి లేకుండా కాంగ్రెస్ ప్రభుత్వం చూస్తుందని, డిజిటల్ యూరియా యాప్ విధానం వల్ల చిన్న, సన్న కారు రైతుల తో పాటు నిరక్షరాస్యులైన రైతులు తీవ్రంగా నష్టపోయే ప్రమాదం ఉందని, వెంటనే యూరియా యాప్ విధానం రద్దు చేయాలని జగిత్యాల జిల్లా బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు,వెల్గటూర్ వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ పత్తిపాక వెంకటేష్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం కొత్తగా ప్రవేశపెట్టిన ఎరువుల డిజిటల్ విధానంతో రైతులు క్షేత్రస్థాయిలో తీవ్ర గందరగోళానికి గురవుతున్నారని, గ్రామాల్లో నిరక్షరాస్యులైన రైతులే ఉంటారని,వీరికి స్మార్ట్‌ఫోన్ల వాడకం కానీ, ప్రభుత్వాలు ప్రవేశపెట్టే యాప్‌లలో రిజిస్ట్రేషన్ల ప్రక్రియపై కనీస అవగాహన లేదన్నారు. ఎలాంటి ముందస్తు ప్రణాళికలు లేకుండా, రైతులకు సరైన శిక్షణ ఇవ్వకుండా ఇలాంటి యాప్ విధానాలను బలవంతంగా రుద్దడం సరికాదని ఆరోపించారు. గతంలో 33 రకాల సన్నపు ధాన్యానికి బోనస్ చెల్లిస్తామని ప్రకటించిన ప్రభుత్వం, ప్రస్తుతం కేవలం 7 రకాల ధాన్యానికి చెల్లిస్తామనడం అత్యంత దారుణమని అన్నారు. అనేకమార్లు రైతుబంధు కు ఎగనామం పెట్టి, రైతు బీమా క్లెయిమ్ లు కూడా సకాలంలో చెల్లించకపోవడం అత్యంత శోచనీయమని వాపోయారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి రైతులను ఆందోళనకు గురి చేయకుండా, యూరియా యాప్ ను రద్దుచేసి, సకాలంలో రైతుబంధు, రైతు బీమా లను వర్తింపజేయాలని, లేనియెడల బిఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో తీవ్ర స్థాయిలో ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు.

## అయిలాపూర్ లయన్స్ క్లబ్

# నూతన కార్యవర్గం ప్రమాణ స్వీకారం

కోరుట్ల రూరల్ జూన్ 22 (ప్రజాతీర్పు)



అయిలాపూర్ లయన్స్ క్లబ్ నూతన అధ్యక్షుడిగా దీకొండ రాజనర్సయ్య గౌడ్‌ను లయన్స్ క్లబ్ ప్రతినిధులు నియమించగా, నూతన కార్యవర్గం సోమవారం ఘనంగా ప్రమాణ స్వీకారం చేసింది.ఈ సందర్భంగా అధ్యక్షుడిగా దీకొండ రాజనర్సయ్య గౌడ్, కార్యదర్శిగా మాసుల అశోక్, కోశాధికారిగా బండారి శశికిరణ్ బాధ్యతలు స్వీకరించి ప్రమాణ స్వీకారం చేశారు.నూతన అధ్యక్షుడిగా ఎన్నికైన రాజనర్సయ్య గౌడ్ గతంలో అయిలాపూర్ లయన్స్ క్లబ్ కార్యదర్శిగా సేవలందిస్తూ అనేక సామాజిక సేవా కార్యక్రమాలను విజయవంతంగా నిర్వహించి ప్రత్యేక గుర్తింపు పొందారు. భవిష్యత్తులో కూడా క్లబ్ ఆధ్వర్యంలో మరిన్ని సేవా కార్యక్రమాలను చేపట్టి సమాజ అభివృద్ధికి కృషి చేస్తానని ఆయన తెలిపారు.ఈ సందర్భంగా నూతన కార్యవర్గ సభ్యులను పలువురు అభినందించి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ ప్రతినిధులు అల్లాడి ప్రవీణ్ కుమార్, ఆడెపు మధు, నగునూరి గంగాధర్ గౌడ్, పోతాని ప్రవీణ్ కుమార్, బొల్లాపల్లి రాజలింగం గౌడ్, నాగచంద్ర ప్రకాశ్ తదితరులు పాల్గొన్నారు.

# కోరుట్లలో పురాతన రహదారి కబ్జాపై ఆర్డీవోకు ఫిర్యాదు

కోరుట్ల, జూన్ 22 (ప్రజాతీర్పు)



కోరుట్ల పట్టణంలోని పురాతన రహదారి (పాత గుంలాపూర్ రోడ్డు) కబ్జాకు గురవుతోందని ఆరోపిస్తూ తెలంగాణ ప్రజాసంఘాల జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు డా. పేట భాస్కర్ సోమవారం ఆర్డీవో జీవాకర్ రెడ్డికి ఫిర్యాదు చేశారు. మాదిగ కుల సంఘం అధ్యక్షుడు శనిగారపు రాజేష్‌తో కలిసి ప్రజావాణి కార్యక్రమంలో వినతిపత్రం సమర్పించారు.ఫిర్యాదులో పేర్కొన్న వివరాల ప్రకారం,సాయిబాబా దేవాలయం వెనుక ఒర్రె కాలువకు ఆనుకుని ఉన్న పాత హద్దీ రాస్తాను సర్వే నంబర్ 742కు చెందిన కొందరు వ్యక్తులు చదును చేసి, కందకాలు తవ్వి ప్లాట్లుగా విభజించి అమ్మకానికి సిద్ధం చేస్తున్నారని ఆరోపించారు. ప్రభుత్వ ఉద్యోగులుగా ఉన్న వారు రియల్టర్లతో కుమ్మక్కై ప్రభుత్వ రహదారిని ఆక్రమించడం దుర్మార్గమైన చర్య అని పేర్కొన్నారు.అంబేద్కర్ రోడ్ నుంచి వాగు మీదుగా మహాలక్ష్మి, మడేలయ్య, పెద్దమ్మ, మారేమ్మ దేవాలయాలకు వెళ్లే భక్తులు, అలాగే రైతులు ఈ రహదారిని ఉపయోగిస్తున్నారని తెలిపారు. రహదారి ఆక్రమణ వల్ల ప్రజలకు తీవ్ర ఇబ్బందులు కలుగుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు.



# గోదాం నిర్మాణం ప్రొసీడింగ్ కాపీని అందజేసిన ముధోల్ మాజీ ఎమ్మెల్యే గాడ్డిగారి విట్టల్ రెడ్డి

(కపిల్ వాగ్మారే సీఆర్ కే,ప్రజా తీర్పు భైంసా)జూన్ 22

నిర్మల్ జిల్లా కుంటాల మండలంలోని కల్లూరు గ్రామంలో నూతనంగా గోదాం నిర్మాణం కోసం సుమారు 30 లక్షల రూపాయల ప్రొసీడింగ్ కాపీని ఈరోజు అందజేయడం జరిగింది.గోదాం నిర్మాణం కోసం నిధులు మంజూరు చేసి ఇచ్చినందుకు మన రాష్ట్ర ముఖ్యమంత్రివర్యులు శ్రీ రేవంత్ రెడ్డికీ మరియు ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ఇన్చార్జి మంత్రి గౌరవనీయులు జూపల్లి కృష్ణారావు,మరియు ముధోల్ మాజీ శాసనసభ్యులు గాడ్డిగారి విఠల్ రెడ్డికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపిన గ్రామస్తులు.ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ ఎస్సీ సెల్ ఉపాధ్యక్షులు తూర్పాటి వెంకటేష్, మాజీ జిల్లా పరిషత్ వైస్ చైర్మన్ రాజన్న ,గ్రామ సర్పంచ్ దశరథ్,మాజీ సర్పంచ్ రమణ గౌడ్ కుంటాల మండలం ముదిరాజ్ సంఘం అధ్యక్షులు ప్రశాంత్, పిఎసిఎస్ డైరెక్టర్ పురుషోత్తం, యువ నాయకులు మల్లేష్ గౌడ్ , వార్డ్ మెంబర్ అబ్బు మౌలానా మరియు తదితరులు ఉన్నారు.

# నీట్ పరీక్షల నిర్వహణలో కేంద్ర ప్రభుత్వ వైఫల్యం

## ఎంపీ గడ్డం వంశీకృష్ణ ఆగ్రహం

(వి వెంకటేష్ ప్రజాతీర్పు మంచిర్యాల స్టాప్ రిపోర్టర్) జూన్ 22

నీట్ పరీక్షల నిర్వహణలో కేంద్ర ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీకృష్ణ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. విద్యార్థుల భవిష్యత్తుతో కేంద్ర ప్రభుత్వం ఆటలాడుతోందని ఆయన మండిపడ్డారు.ఆదివారం విడుదల చేసిన ప్రకటనలో ఆయన మాట్లాడుతూ, నీట్ ప్రశ్నాపత్రాల లీకేజీల కారణంగా లక్షలాది మంది విద్యార్థులు తీవ్ర మానసిక వేదనకు గురయ్యారని అన్నారు. ఒకసారి పరీక్ష రద్దు కావడంతో మళ్లీ నెలల తరబడి కష్టపడి సిద్ధమైన విద్యార్థులను కేవలం ఐదు లేదా పది నిమిషాలు ఆలస్యంగా వచ్చారనే కారణంతో పరీక్షకు అనుమతించకపోవడం దారుణమని విమర్శించారు. కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ మరియు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ విద్యార్థుల సమస్యల పట్ల బాధ్యతాయుతంగా వ్యవహరించాల్సిన అవసరం ఉందని ఆయన అన్నారు. పేపర్ లీకేజీలను అరికట్టడంలో విఫలమైన ప్రభుత్వం, మరోవైపు కష్టపడి చదివిన విద్యార్థుల భవిష్యత్తును నాశనం చేసే నిర్ణయాలు తీసుకోవడం సరికాదని పేర్కొన్నారు. పరీక్ష కేంద్రాల వద్ద కన్నీటి పర్యంతమైన విద్యార్థులు, వారి తల్లిదండ్రుల ఆవేదన ప్రభుత్వానికి శాపంగా మారుతుందని గడ్డం వంశీకృష్ణ హెచ్చరించారు. యువత ఆశయాలను గౌరవించి, వారి భవిష్యత్తును కాపాడే విధంగా కేంద్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. పిల్లల భవిష్యత్తు కోసం పని చేయండి.. వారి జీవితాలతో ఆడుకోవద్దు అని ఎంపీ గడ్డం వంశీకృష్ణ పేర్కొన్నారు.

# హఠయోగ విన్యాసాలతో ఆకట్టుకున్న శంకరాచారి.. జవహర్‌నగర్‌లో యోగా మహోత్సవం

(వినోద్, ప్రజా తీర్పు,జవహర్ నగర్, మేడ్చల్ జిల్లా) జూన్ 22




మేడ్చల్ జిల్లా, జవహర్‌నగర్ ప్రపంచ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని జవహర్‌నగర్ అంబేద్కర్ నగర్‌లోని ఫ్లవర్ గార్డెన్‌లో హఠ యోగ ఆశ్రమం ఆధ్వర్యంలో యోగా దినోత్సవ వేడుకలను అత్యంత వైభవంగా నిర్వహించారు. హఠ యోగ ఆశ్రమ వ్యవస్థాపక అధ్యక్షుడు, ప్రముఖ యోగా గురువు శంకరాచారి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమం యోగా ప్రేమికులను విశేషంగా ఆకట్టుకుంది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు తోటకూర వజ్రేష్ యాదవ్ హాజరయ్యారు. ఉత్తరాఖండ్ రాష్ట్రంలోని రిషికేష్‌లో గల రుద్ర యోగ్ పీఠ్‌లో హఠ యోగ, అష్టాంగ యోగ విద్యలో శిక్షణ పొందిన యోగా గురువు శంకరాచారి ఆధ్వర్యంలో చిన్నారులు, యువత, మహిళలు, ప్రజాప్రతినిధులు కలిసి యోగా ఆసనాలు, ప్రాణాయామాలు, సూర్య నమస్కారాలు చేసి అందరినీ ఆకట్టుకున్నారు. ఈ సందర్భంగా శంకరాచారి ప్రదర్శించిన క్లిష్టమైన యోగా విన్యాసాలు ప్రేక్షకులను మంత్రముగ్ధులను చేశాయి. యోగా కేవలం వ్యాయామం మాత్రమే కాదని, అది శరీరం, మనస్సు,ఆత్మ మధ్య సమతుల్యతను పెంపొందించే జీవన విధానమని వివరించారు. ముఖ్య అతిథి తోటకూర వజ్రేష్ యాదవ్ మాట్లాడుతూ, నేటి వేగవంతమైన జీవనశైలిలో ఒత్తిడి, ఆందోళనలు, అనారోగ్య సమస్యలు పెరుగుతున్నాయని, వాటికి యోగా ఒక అద్భుతమైన పరిష్కారమని అన్నారు. ప్రతి కుటుంబంలో యోగాను దినచర్యలో భాగం చేసుకోవాలని సూచించారు. పిల్లల నుంచి వృద్ధుల వరకు అందరికీ యోగా అవసరమని పేర్కొన్నారు. యోగ సాధన ద్వారా గుండె జబ్బులు, మధుమేహం, రక్తపోటు, మానసిక ఒత్తిడి వంటి సమస్యలను నియంత్రించవచ్చని నిపుణులు చెబుతున్నారని గుర్తు చేశారు. ప్రపంచ వ్యాప్తంగా కోట్లాది మంది యోగాను ఆచరిస్తుండటం భారతీయ సంస్కృతికి గర్వకారణమన్నారు. హఠ యోగ ఆశ్రమం చేస్తున్న సేవలను అభినందించిన వజ్రేష్ యాదవ్, భవిష్యత్తులో ఆశ్రమ అభివృద్ధి కోసం ప్రభుత్వం నుంచి రెండు ఎకరాల స్థలం కేటాయింపునకు తన వంతు సహకారం అందిస్తానని హామీ ఇచ్చారు. ప్రపంచానికి భారతదేశం అందించిన అమూల్యమైన కానుక యోగా అని, యోగా ద్వారా ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణం సాధ్యమవుతుందని పలువురు వక్తలు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జవహర్‌నగర్ మాజీ సర్పంచ్ కారింగుల శంకర్ గౌడ్, కల్లేపల్లి సదానందం, మేకల కావ్య, దొంతగాని శాంతి కోటేష్ గౌడ్, ఎస్‌హెచ్‌ఓ సైదులు, మల్లెపూల శ్రీకాంత్ యాదవ్, కుందారం గణేష్ చారి, ఎర్రగుడ్ల వెంకటేశ్వర్, కమల్ చారి, భాషవోని కొండల ముదిరాజ్, బిర్రు యాకస్వామి, కుతాడి సాయి, బల్లి శ్రీను, మండల సురేందర్, పాండాల అనురాధ యాదగిరి గౌడ్, ముప్పా రామారావు, అరుణ్ కుమార్ యాదవ్, వివిధ రాజకీయ పార్టీల నాయకులు, ప్రజా సంఘాల ప్రతినిధులు, కుల సంఘాల నాయకులు, విద్యార్థులు, మహిళలు, యువత మరియు ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# ఆదివాసులపై అటవీ అధికారుల దౌర్జన్యం అన్యాయం

- తుడుం దెబ్బ రాష్ట్ర అధ్యక్షులు గోడాం గణేష్
- నచ్చన్ ఎల్లాపూర్ (గోండుగూడ) బాధితులను పరామర్శించిన నాయకులు
- పోడు భూములకు వెంటనే హక్కు పట్టాలు ఇవ్వాలని డిమాండ్

**(కపిల్ వాగ్మారే సీఆర్ కే,ప్రజా తీర్పు భైంసా) జూన్ 22**



నిర్మల్ జిల్లా కడెం మండలంలోని నచ్చన్ ఎల్లాపూర్ (గోండుగూడ) గ్రామంలో ఇటీవల ఆదివాసులపై అటవీ శాఖ అధికారులు జరిపిన దౌర్జన్యపూరిత దాడిని ఆదివాసి హక్కుల పోరాట సమితి (తుడుం దెబ్బ) రాష్ట్ర నాయకత్వం తీవ్రంగా ఖండించింది. తుడుం దెబ్బ రాష్ట్ర అధ్యక్షులు గోడాం గణేష్ ఆధ్వర్యంలో నాయకుల బృందం సోమవారం నచ్చన్ ఎల్లాపూర్ గ్రామాన్ని సందర్శించి, బాధితులతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా గ్రామస్తులు నాయకులకు తమ ఆవేదనను తెలియజేస్తూ, ఈ నెల 16వ తేదీ తెల్లవారుజామున పెద్ద సంఖ్యలో అటవీ అధికారులు గ్రామంపై పడి ఆదివాసులను భయభ్రాంతులకు గురిచేశారని, మహిళల పట్ల అనుచితంగా ప్రవర్తిస్తూ వారిని బలవంతంగా తీసుకెళ్లారని తెలిపారు. ఈ ఘటనతో గ్రామంలోని చిన్నపిల్లలతో సహా అందరూ తీవ్ర ఆందోళనకు గురయ్యారని వివరించారు. ఈ విషయం తెలిసిన వెంటనే తుడుం దెబ్బ రాష్ట్ర నాయకత్వం ఉన్నతాధికారులతో ఫోన్ ద్వారా మాట్లాడి ఒత్తిడి తీసుకురావడంతో, అటవీ శాఖ అధికారులు నిర్బంధించిన వారిని తిరిగి ఇంటికి పంపించినట్లు వెల్లడించారు. ?గ్రామంలో ఆదివాసులతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో తుడుం దెబ్బ రాష్ట్ర అధ్యక్షులు గోడాం గణేష్ మాట్లాడుతూ, పోడు భూములను నమ్ముకుని జీవిస్తున్న ఆదివాసులకు అటవీ హక్కుల చట్టం ప్రకారం వెంటనే ఉమ్మడి హక్కు పట్టాలు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. ఆదివాసి గ్రామాలకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు పూర్తిస్థాయిలో అందేలా అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆదివాసుల సమస్యలపై ప్రత్యేక దృష్టి సారించాలని, స్థానిక ఎమ్మెల్యేలు, ఎంపీలు తక్షణమే స్పందించి బాధితులకు న్యాయం చేయాలని ఆయన డిమాండ్ చేశారు. అధికారులు చట్టబద్ధంగా, రాజ్యాంగబద్ధంగా వ్యవహరించాలని, భవిష్యత్తులో ఆదివాసి గూడాలపై ఇలాంటి అక్రమ దాడులు పునరావృతం కాకుండా చూడాలని సూచించారు. అటవీ అధికారుల వేధింపులు ఆపకపోతే తుడుం దెబ్బ ఆధ్వర్యంలో ప్రజా సంఘాలను ఏకం చేసి, ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా వ్యాప్తంగా భారీ నిరసన కార్యక్రమాలు, ఉధృత పోరాటాలు చేపడతామని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను హెచ్చరించారు.

?ఈ పరామర్శ కార్యక్రమం మరియు సమావేశంలో తుడుం దెబ్బ రాష్ట్ర కార్యదర్శి వెట్టి మనోజ్, ఆదివాసి విద్యార్థి సంఘం ఆదిలాబాద్ జిల్లా ప్రధాన కార్యదర్శి సలాం వరుణ్, నిర్మల్ జిల్లా ప్రధాన కార్యదర్శి తోడసం గోవర్ధన్, తుడుం దెబ్బ రాష్ట్ర నాయకులు ఆనందరావు, రాష్ట్ర కార్యదర్శి ఆర్క శేషారావు పాల్గొన్నారు. అలాగే సామాజిక కార్యకర్తలు అజయ్, మురళి, కడెం మాజీ ఎంపీపీ రాజేశ్వర్ గౌడు, ఆదివాసి విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షులు సిడం జంగు దేవ్ పటేల్, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ కనక గణేష్, ఆదిలాబాద్ డివిజన్ అధ్యక్షులు ఆత్రం గణపతి, ఉట్నూర్ మండల అధ్యక్షులు పేందర్ త్రిమూర్తి,వివిధ ప్రజాసంఘాల నాయకులు, గూడెం ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



## ఆధునిక పద్ధతులు పాటిస్తూ అధిక దిగుబడులు సాధించాలి

**మహిళా రైతులకు 100% సబ్సిడీపై సోయా విత్తనాలను పంపిణీ చేసిన ఎమ్మెల్యే పవార్ రామరావ్ పటేల్**

**(కపిల్ వాగ్మారే సీఆర్ కే,ప్రజా తీర్పు భైంసా) జూన్ 22**

ఆధునిక పద్ధతులు, వ్యవసాయ అధికారుల సూచనలు పాటిస్తూ అధిక దిగుబడులు సాధించి, వ్యవసాయ రంగంలో మరింత ముందడుగు వేయాలని ఎమ్మెల్యే పవార్ రామరావ్ పటేల్ సూచించారు. భైంసా లోని ఐకెపి కార్యాలయంలో కుభీర్, భైంసా, ముధోల్ మండలాల కు చెందిన మహిళ రైతులకు 670 బస్తాలను 100% సబ్సిడీపై పంపిణీ చేసే కార్యక్రమాన్ని ప్రారంభించిన సందర్భంగా ఆయన మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం నూనె దినుసులను పంటలను,ప్రోత్సహించాలన్న ఉద్దేశంతో రైతులకు ప్రోత్సాహకాలు అందిస్తుందన్నారు.న్యూమో ఆయిల్ సీడ్స్ ఆధ్వర్యంలో ప్రభుత్వం రాయితీలు అందిస్తుందన్నారు. మహిళలు సంఘాలుగా ఏర్పడి ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకుంటూ ఆర్థిక పురోగతి సాధించాలని చెప్పారు. కేంద్ర ప్రభుత్వం మహిళలను అన్ని రంగాల్లో ముందు ఉంచేలా ఎన్నో కార్యక్రమాలు చేపడుతుందని చెప్పారు. గ్రామ గ్రామాన మహిళా సమైక్య సంఘ భవనాలు నిర్మిస్తున్నామంటే అది కేంద్ర ప్రభుత్వం నిధులే అని తెలియజేశారు. కార్యక్రమానికి హాజరైన ఎమ్మెల్యే కు సంఘ సభ్యులు ఘనంగా స్వాగతించి శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ ఆనంద్ రావ్ పటేల్, ఆత్మ చైర్మన్ సిద్ధం వార్ వివేక్,దేగాం, తిమ్మాపూర్ సర్పంచ్ లు సిరం సుష్మ రెడ్డి, సంజీవ్ ఐకెపి డిపిఎం శోభారాణి, విజయలక్ష్మి,మండల వ్యవసాయ అధికారి గణేష్,ఏపీఎం రమేష్, సీసీలు, మహిళా సంఘ సభ్యులు పాల్గొన్నారు.

## మత్తు పదార్థాలకు దూరంగా ఉండండి

- హానికరమైన విషయాలకు ధైర్యంగా నో చెప్పండి
- మంచిర్యాల డీసీపీ ఎ. భాస్కర్

**(వి వెంకటేష్ ప్రజాతీర్పు మంచిర్యాల స్టాఫ్ రిపోర్టర్) జూన్ 22**




అంతర్జాతీయ, మాదకద్రవ్యాల దుర్వినియోగం మరియు అక్రమ రవాణా నిరోధక దినోత్సవం సందర్భంగా నిర్వహిస్తున్న మాదక ద్రవ్యాల వ్యతిరేక అవగాహన వారోత్సవాలలో భాగంగా, సోమవారం మంచిర్యాల జిల్లా శ్రీరాంపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని విశ్వశాంతి కేరళ స్కూల్లో నిర్వహించిన కార్యక్రమానికి మంచిర్యాల డీసీపీ ఎ. భాస్కర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మత్తు పదార్థాల వల్ల కలిగే దుష్పరిణామాలపై విద్యార్థులు రూపొందించిన చిత్రాలను పరిశీలించి వారిని అభినందించారు.ఈ సందర్భంగా డీసీపీ మాట్లాడుతూ, విద్యార్థుల్లో మాదకద్రవ్యాల దుష్ప్రభావాలపై అవగాహన కల్పించేందుకు ప్రభుత్వం,పోలీస్ శాఖ విస్తృత చర్యలు చేపడుతున్నాయని తెలిపారు.డ్రగ్స్ విక్రయించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటూ అరెస్టులు చేస్తున్నప్పటికీ, కొంతమంది యువత తెలిసో తెలియకో వాటి బారిన పడుతున్నారని పేర్కొన్నారు. విద్యార్థులు రూపొందించిన చిత్రాల ద్వారా డ్రగ్స్ వల్ల ఆరోగ్యం, కుటుంబం, సమాజంపై కలిగే ప్రతికూల ప్రభావాలను చక్కగా వివరించారని అభినందించారు. మాదకద్రవ్యాల వినియోగం వల్ల మానసిక సమతుల్యత దెబ్బతిని,కుటుంబ సభ్యులతో పాటు సమాజానికీ ఇబ్బందులు కలుగుతాయని చెప్పారు.సాధారణంగా చిన్న ఆసక్తితో సిగరెట్ లేదా ఇతర మత్తు పదార్థాలను ప్రయత్నించడం ప్రారంభమై,క్రమంగా అది వ్యసనంగా మారే ప్రమాదం ఉందని హెచ్చరించారు.ఈ వ్యసనాల కారణంగా కొందరు దొంగతనాలు వంటి నేరాలకు కూడా పాల్పడే పరిస్థితులు ఏర్పడతాయని వివరించారు. అందువల్ల విద్యార్థులు చిన్న వయస్సు నుంచే మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని సూచించారు.విద్యార్థులకు పాఠ్యాంశాలతో పాటు జీవితానికి అవసరమైన విలువలను కూడా బోధించాల్సిన బాధ్యత ఉపాధ్యాయులపై ఉందని పేర్కొన్నారు. ముఖ్యంగా తమకు నచ్చని లేదా హానికరమైన విషయాలకు ధైర్యంగా నో చెప్పడం నేర్చుకోవాలని సూచించారు. చిన్నప్పటి నుంచే నో చెప్పే అలవాటు పెంపొందితే భవిష్యత్తులో సరైన నిర్ణయాలు తీసుకునే వ్యక్తులుగా ఎదుగుతారని తెలిపారు.విద్యార్థులు తమ పరిసరాల్లో అనుమానాస్పద వ్యక్తులు లేదా మాదకద్రవ్యాలకు సంబంధించిన కార్యకలాపాలను గమనించినట్లయితే వెంటనే తల్లిదండ్రులకు సమాచారం ఇవ్వాలని, అవసరమైతే డయల్-100కు ఫోన్ చేసి పోలీసులకు, తెలియజేయాలని సూచించారు. సమాచారం ఇచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంచబడతాయని భరోసా ఇచ్చారు.మంచి పౌరులుగా, బాధ్యతాయుతమైన విద్యార్థులుగా ఎదిగి, మాదకద్రవ్యాలకు దూరంగా ఉండటంతో పాటు సమాజాన్ని కూడా అప్రమత్తం చేయాలని విద్యార్థులకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మంచిర్యాల ఏసీపీ ఆర్.ప్రకాశ్, శ్రీరాంపూర్ ఇన్స్పెక్టర్ అశోక్ కుమార్,ఎస్ఐ సంతోష్,పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

## నేటి నుండి విత్తన మేళా

- మండల వ్యవసాయ అధికారి కమల్ల మహేష్

**( ఎలుక భగవాన్ యాదవ్, ప్రజాతీర్పు, ఎండపల్లి) జూన్ 22:**



ఈ నెల 23 వ తేదీ నుండి 30 వ తేదీ వరకు ఎండపల్లి మండలంలోని అన్ని క్లస్టర్ లలోని రైతు వేదికల్లో "విత్తన మేళా" నిర్వహిస్తున్నట్లు మండల వ్యవసాయ అధికారి కమల్ల మహేష్ ఓ ప్రకటనలో తెలిపారు. ఈ విత్తన మేళా లో ప్రభుత్వం సాగుకు సూచించిన బీపీటీ 5204, ఆర్ఎన్ఆర్ 15048 (తెలంగాణ సోన), హెచ్ఎంటీ సోన, జైశ్రీరామ్, కేఎన్ఎం 1638, కేఎన్ఎం 7715, డబ్ల్యుజీఎల్ లతో పాటు 44 రకాల వరి విత్తనాలు రైతులకు అందుబాటులో ఉంటాయని, అలాగే కందులు, పెసర్లు, మినుములు, కూరగాయలు, ఇతర ప్రత్యామ్నాయ పంటల విత్తనాలు ప్రదర్శన, విక్రయాలు ఉంటాయని పేర్కొన్నారు.నానో యూరియా, నానో డీఏపీ ఉత్పత్తులు కూడా అందుబాటులో ఉంటాయని, రైతు సోదరులంతా ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.



## బాసర ట్రిపుల్ ఐటీ యూనివర్సిటీలోని సమస్యలను పరిష్కరించాలి

- యూనివర్సిటీలోని విద్యార్థులు మొబైల్ వాడకంపై విధించిన నిషేధాన్ని ఎత్తివేయ్యాలి
- బాసర యునివర్సిటీ సమస్యలపైభైంసా సబ్ కలెక్టర్ కి వినతిపత్రం సమర్పించిన వామపక్ష విద్యార్థి సంఘాల నాయకులు

**(కపిల్ వాగ్మారే సీఆర్ కే,ప్రజా తీర్పు భైంసా) జూన్ 22**

నిర్మల్ జిల్లా లోని బాసర ట్రిపుల్ ఐటీ క్యాంపస్లో విద్యార్థులు ఎదుర్కొంటున్న తీవ్రమైన సమస్యలను తక్షణమే పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ వామపక్ష విద్యార్థి సంఘాలైన అఖిల భారత ప్రగతిశీల విద్యార్థి సంఘం మరియు ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో సోమవారం భైంసా సబ్ కలెక్టర్ అజ్మీరా సంకేత్ కుమార్,ఐఎఎస్, కలిసి వినతిపత్రం సమర్పించడం జరిగింది. ఈ సందర్భంగా విద్యార్థి సంఘాల నాయకులు మాట్లాడుతూ.. క్యాంపస్లో ఇటీవల పీ-1 విద్యార్థిని భవనం పైనుంచి కిందపడిన ఘటన తీవ్ర ఆందోళన కలిగిస్తోందని, దీనిపై ఉన్నతాధికారులతో సమగ్ర విచారణ జరిపించి వాస్తవాలను త్వరగా వెల్లడించాలని డిమాండ్ చేశారు. అలాగే, క్యాంపస్ మెస్లలో నిరంతరం పురుగులు,బొద్దింకలతో కూడిన నాణ్యత లేని కలుషిత ఆహారాన్ని వడ్డిస్తూ 9 వేల మంది విద్యార్థుల ప్రాణాలతో ఆడుకుంటున్న మెస్ కాంట్రాక్టర్ల నిర్లక్ష్యంపై తక్షణమే కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. క్యాంపస్లోని లోపాలను, మెస్ అవినీతిని విద్యార్థులు బయటపెడుతున్నారనే కక్షతో, వారినోళ్లు నొక్కే విధంగా యాజమాన్యం క్లాస్ రూమ్లు,మెస్లలో మొబైల్ ఫోన్ల వాడకంపై విధించిన నిరంకుశ ఆంక్షల సర్క్యులర్ను తక్షణమే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. విద్యార్థుల వ్యక్తిగత స్వేచ్ఛను హరించే ఇలాంటి తుగ్లక్ నిర్ణయాలను వామపక్ష విద్యార్థి సంఘాలు ఎట్టిపరిస్థితుల్లోనూ సహించబోవని స్పష్టం చేశారు.ఈ సమస్యలపై సబ్ కలెక్టర్ గారు సానుకూలంగా స్పందించి, విచారణ జరిపిస్తామని హామీ ఇచ్చారని తెలిపారు. విద్యార్థుల హక్కుల కోసం, క్యాంపస్లో మెరుగైన వసతుల సాధన కోసం మా ఉమ్మడి పోరాటాన్ని మరింత ఉధృతం చేస్తామని నాయకులు ప్రభుత్వాన్ని హెచ్చరించారు.ఈకార్యక్రమంలో అఖిల భారత ప్రగతిశీల విద్యార్థి సంఘం నిర్మల్ జిల్లా కార్యదర్శి గడపాలి పరమేష్, ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం నిర్మల్ జిల్లా అధ్యక్షుడు వాగ్మారే మహేందర్,జిల్లా నాయకులు ప్రతాప్ తదితరులు పాల్గొన్నారు.



## ఉన్నత లక్ష్యాన్ని ఎంచుకొని సాధించే దిశగా పట్టుదలతో కృషి చేయాలి

**రాష్ట్ర కార్మిక, ఉపాధి శిక్షణ, కర్మాగార, గనులు భూగర్భ శాఖ మంత్రి గడ్డం వివేకానంద**

**(వి వెంకటేష్ ప్రజాతీర్పు మంచిర్యాల స్టాఫ్ రిపోర్టర్) జూన్ 22**

యువత ఉన్నత లక్ష్యాన్ని ఎంచుకొని సాధించే విధంగా పట్టుదలతో కృషి చేయాలని రాష్ట్ర కార్మిక, ఉపాధి శిక్షణ, కర్మాగార, గనులు భూగర్భ శాఖ మంత్రి గడ్డం వివేకానంద అన్నారు. సోమవారం మంచిర్యాల జిల్లాలోని మందమర్రి పట్టణంలో ఏర్పాటు చేసిన జర్మన్ భాషా శిక్షణ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్, సింగరేణి సంస్థ మందమర్రి ఏరియా జనరల్ మేనేజర్ రాధాకృష్ణ లతో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా రాష్ట్ర మంత్రి మాట్లాడుతూ యువత లక్ష్యాలను ఉంచుకొని వాటిని సాధించే దిశగా పట్టుదలతో కృషి చేయాలని తెలిపారు. టామ్ కామ్ సంస్థ ద్వారా విదేశాలలో ఉపాధి అవకాశాలను కల్పించడం జరుగుతుందని, ఈ నేపథ్యంలో అభ్యర్థులు జర్మన్ భాషను ఇష్టంగా నేర్చుకోవాలని తెలిపారు. ఉద్యోగాలు పొందిన వారు తమ తల్లిదండ్రులను సంతోషంగా చూసుకోవాలని, ఇతరులకు ఆదర్శంగా నిలిచి మరింత మందికి అవకాశాలు కల్పించేలా కృషి చేయాలని తెలిపారు. విదేశాలలో స్థానిక నిబంధనల ప్రకారం నడుచుకోవాలని, పనిలో బాస్ మేనేజ్మెంట్ 70 శాతం ఉంటే పని 30 శాతం ఉంటుందని, అభ్యర్థులు నైపుణ్యాన్ని పెంపొందించుకోవాలని తెలిపారు. ప్రపంచ వ్యాప్తంగా అనేక ఉపాధి అవకాశాలు ఉన్నాయని, జర్మనీలో నైపుణ్యం కలిగిన యువతకు భారీగా ఉద్యోగ అవకాశాలు ఉన్నాయని తెలిపారు. జర్మనీలో వారానికి కేవలం 32 నుండి 35 గంటల పని సమయం మాత్రమే ఉంటుందని, మిగతా సమయంలో ఇతర నైపుణ్యాలను అభివృద్ధి చేసుకునే అవకాశం ఉంటుందని తెలిపారు. యువతలో క్రమశిక్షణ, పట్టుదల, లక్ష్యసాధనపై దృష్టి ఉండాలని, జర్మన్ భాషను నేర్చుకోవడానికి ప్రతిరోజూ సాధన చేయాలని సూచించారు. జర్మనీలో ఉద్యోగం సాధించాలనే స్పష్టమైన లక్ష్యంతో శిక్షణ పొందితే విజయం సాధిస్తారని అన్నారు. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ శిక్షణ కేంద్రంలో అందిస్తున్న జర్మన్ భాషా శిక్షణను ఏకాగ్రతతో నేర్చుకోవాలని, కమ్యూనికేషన్ స్కిల్స్ అభివృద్ధి చేసుకోవాలని తెలిపారు. భాష శిక్షణను నిదానంగా, స్పష్టంగా నేర్చుకోవాలని శిక్షణ కాలం పూర్తి అయ్యేసరికి భాషపై పట్టు సాధించాలని, నైపుణ్యం సంపాదించాలని తెలిపారు. విదేశాలలో ఉన్న అవకాశాలను అందిపుచ్చుకుని అభివృద్ధి చెందాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు, శిక్షకులు, యువత, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

## సింగరేణి విశ్రాంత ఉద్యోగులకు 30 లక్షల ప్రమాద బీమా సౌకర్యం

- మేనేజర్ ను ఘనంగా సన్మానం చేసిన సింగరేణి రిటైర్డ్ ఉద్యోగుల సంఘం

**(అరికిల్ల జయకుమార్, ప్రజా తీర్పు, మంచిర్యాల మండల్) జూన్ 22**



ఈ సంతోష సందర్భంగా మిఠాయిలు పంచిన విశ్రాంత ఉద్యోగుల సంఘం నాయకులు. తేదీ 22-06-2026 సోమవారం రోజున, 70 సంవత్సరాల లోపు ూదీ× లో ఖాత కలిగి ఉన్న సింగరేణి విశ్రాంత ఉద్యోగులకు కోల్ మైన్స్ పెన్షనర్లకు 30 లక్షల ప్రమాద బీమా సౌకర్యం కల్పించినందుకు మంచిర్యాల జిల్లా కేంద్రంలోని స్టేట్ బ్యాంకు ఆఫ్ ఇండియా (ూదీ×) మెయిన్ బ్రాంచ్ మేనేజర్ అలోక్ వర్మ కు సింగరేణి విశ్రాంత ఉద్యోగుల సంఘం మంచిర్యాల జిల్లా ఆధ్వర్యంలో పూల బొకే అందజేసి శాలువాతో ఘనంగా ఆత్మీయ సన్మాన కార్యక్రమాన్ని నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా ూదీ× మేనేజర్ అలోక్ వర్మ గారు మాట్లాడుతూ ూదీ× బ్యాంకు లలో ఖాత లు కలిగి ఉన్న 70 సంవత్సరాల లోపు కోల్ మైన్స్ పెన్షనర్లకు ప్రమాద బీమా కింద 30 లక్షల వరకు మరణించిన వారి కుటుంబానికి ఆసరాగా అందజేయడం జరుగుతుందని , ఈ అవకాశాన్ని కోల్ మైన్స్ పెన్షన్ దారులందరూ సద్వినియోగం చేసుకోవాలని కోరినారు . అదే విధంగా 70 సంవత్సరాల లోపు కోల్ మైన్స్ పెన్షన్ దారులకు 30 లక్షల ప్రమాద బీమా సౌకర్యం కల్పించిన ంఎఱ యాజమాన్యానికి , రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కి, ఉప ముఖ్యమంత్రి బట్టి విక్రమార్క కి, రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వర్యులు గడ్డం వివేక్ వెంకట స్వామి కి, పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీ కృష్ణ కి, సింగరేణి సి అండ్ ఎం డి జ్యోతి బుద్దా ప్రకాష్ కి , డైరెక్టర్ పా గౌతమ్ పోట్రు గార్లకు సింగరేణి విశ్రాంత ఉద్యోగుల సంఘం పక్షాన హృదయ పూర్వకంగా కృతజ్ఞతలు, ధన్యవాదాలు తెలియజేశారు . 130 సంవత్సరాల సింగరేణి చరిత్ర లో ఇతర ఏ సంస్థ లో లేని విధంగా కోల్ మైన్స్ పెన్షన్ దారులకు 30 లక్షల ప్రమాద బీమా సౌకర్యం కల్పించడం వారి కుటుంబానికి బరోసా , చేయూత అందించడం ఒక్క గొప్ప చరిత్రాత్మకమైన నిర్ణయం అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ూదీ× బ్యాంకు అకౌంటెంట్ రంజిత్ కుమార్, సింగరేణి విశ్రాంత ఉద్యోగుల సంఘం, తెలంగాణ ఉద్యమ కారుల ఐక్య వేదిక అధ్యక్షుడు గజెల్లి వెంకటయ్య, గౌరవ అధ్యక్షులు రాళ్లబండి రాజన్న , ప్రధాన కార్యదర్శి పుదారి నర్సయ్య, ఉపాధ్యక్షులు ఏ గంగయ్య, పి రాంరెడ్డి , బూర్ల జ్ఞాని , కార్యదర్శి అడిచర్ల రాజేశం, నాయకులు గుజ్జ చందు , సర్వేశ్వర చారి తదితరులు పాల్గొన్నారు.

# టేకులపల్లి మండలంలో ఎమ్మెల్యే కోరం కనకయ్య పర్యటన

- ఇందిరమ్మ ఇళ్ల గృహ ప్రవేశ కార్యక్రమం పాల్గొన్న ఎమ్మెల్యే

**(పొనకంటి ఉపేందర్ రావు ప్రజా తీర్పు టేకులపల్లి) జూన్ 22**



టేకులపల్లి :బొమ్మనపల్లి, కొత్తతండా(జి), చంద్రుతండా, బిల్లుడుతండా గ్రామాలలో ప్రజా ప్రభుత్వంలో నిర్మించిన ఇందిరమ్మ ఇళ్ళ లబ్ధిధారులతో కలిసి ఎమ్మెల్యే గృహ ప్రవేశంటేకులపల్లి మండలంలో పర్యటనలోభాగంగా బొమ్మనపల్లి,కొత్తతండా(జి),చంద్రుతండా,బిల్లుడుతండా గ్రామాలలోప్రజా ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్న ఇందిరమ్మ ఇళ్ళ పధకంలోభాగంగా నిర్మాణం పూర్తి అయిన ఇందిరమ్మ ఇళ్ళ లబ్ధిధారుల ఆహ్వానం మేరకు ముఖ్య అతిధిగాహాజరై వారి కుటుంబ సభ్యులతో కలిసి రిబ్బన్ కట్ చేసి గృహ ప్రవేశం.చేయించిన ఇల్లందు శాసన సభ్యులు కోరం కనకయ్యఈయొక్కకార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ నాయకులు కోరం సురేందర్ ఇల్లందు మార్కెట్ కమిటి ఛైర్మెన్ బానోత్ రాంబాబు టేకులపల్లి మండల పార్టీ అధ్యక్షులు లక్కినేని శ్యామ్, నాయకులు ఈది గణేష్, జిల్లా కాంగ్రెస్ కమిటి సభ్యులు కాలే ప్రసాద్, మార్కెట్ కమిటి డైరెక్టర్ శివలాల్, గొల్లపల్లి(బొమ్మనపల్లి), కొత్తతండా(జి), చంద్రుతండా, బిల్లుడుతండా సర్పంచులు కోరం సుజాత, మాళోత్ తారాచంద్, బానోత్ సంతోషా, బానోత్ లక్ష్మి మంగ్యా, నాయకులు ధర్మయ్య గౌడ్, భుక్యా రవి, కొయగూడెం సర్పంచ్ కోరం చంద్రబోస్, సర్దార్, కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు కార్యకర్తలు, ఇందిరమ్మ కమిటి సభ్యులు, అధికారులు తదితరులు పాల్గోన్నారు

# మొక్కలు నాటి పర్యావరణాన్ని కాపాడుకుందాం

- విక్కుర్తి లక్ష్మీనారాయణ ప్రధానోపాధ్యాయుడు

**(కవ్వాల సురేందర్, ప్రజాతీర్పు, వేములవాడ) జూన్ 22:**



వేములవాడ మున్సిపాలిటీ పరిధిలోని ప్రాథమిక పాఠశాల న్యూ అర్బన్ కాలనీ వేములవాడలో 5వ తరగతి చదువుతున్న హిప్సిబా రెచల్ జన్మదిన సందర్భంగా చిన్నారి చే మొక్కను నాటించి సంరక్షణ బాధ్యతను అప్పగించడమైనది. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయుడు విక్కుర్తి లక్ష్మీనారాయణ మాట్లాడుతూ "పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరి సామాజిక బాధ్యతగా మొక్కలు నాటి పర్యావరణాన్ని కాపాడుకోవాలని, ప్రతి శుభకార్యానికి ప్రతి ఒక్కరు తమ వంతుగా రెండు మొక్కలు విధిగా నాటే సామాజిక బాధ్యతను చేపట్టాలని, స్వచ్ఛమైన, ఆహ్లాదకరమైన వాతావరణం కోసం నాటిన ప్రతి మొక్కను కాపాడుకోవాల్సిన బాధ్యతను ప్రతి ఒక్కరు తీసుకోవాలని, భూమండలంపై కాలుష్యాన్ని తగ్గించేందుకు, ప్రాణవాయువు శాతాన్ని పెంచేందుకు, వర్షాలు పడేందుకు, విపత్తుల సమయంలో చెట్లు ఎంతగానో ఉపయోగపడతాయని, పర్యావరణ సమతుల్యతను కాపాడడానికి మరియు స్వచ్ఛమైన గాలిని పొందడానికి మొక్కలు నాటడం అత్యంత ఆవశ్యకమని, మొక్కలు నాటడం అనేది కేవలం ఒక కార్యక్రమంలో కాకుండా దైనందిన జీవితంలో భాగం కావాలని, ప్రాథమిక పాఠశాల దశలోనే పిల్లలకు మొక్కల పెంపకం పై అవగాహన మరింత పెంచే విధంగా కార్యక్రమాలు చేపట్టాలని, ఇంట్లో లేదా పరిసరాలలో సులభంగా పెరిగే నీడనిచ్చే చెట్లు, పూల మొక్కలు మరియు పండ్ల మొక్కలను ఎంచుకోవడం మంచిదని, అటవీశాఖ లేదా స్థానిక నర్సింలు ద్వారా అవసరమైన మొక్కలను సులభంగా పొందవచ్చునని, మొక్కల పెంపకంతో కాలుష్యాన్ని నియంత్రించవచ్చునని" పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు దుర్శేటి లక్ష్మీనారాయణ, దాసరి సుజాత, అంగన్వాడి ఉపాధ్యాయురాలు లిక్కిడి మంజుల, పులి శారద మరియు విద్యార్థులు పాల్గొన్నారు.



# మా భూమికి దారి కల్పించండి

- ఆరేళ్లుగా అధికారుల చుట్టూ తిరుగుతున్నా న్యాయం జరగలేదు
- ప్రజావాణిలో కలెక్టర్‌కు రైతు తాటికొండ రమేష్ వినతి

**(దుర్గం నగేష్, ప్రజా తీర్పు పెద్దపల్లి జిల్లా స్టాఫ్ రిపోర్టర్), జూన్ 22**

తన వ్యవసాయ భూమికి వెళ్లేందుకు రహదారి కల్పించి, భూమి వివాదంపై సమగ్ర విచారణ జరిపి న్యాయం చేయాలని ఓదెల మండలానికి చెందిన రైతు తాటికొండ రమేష్ సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. అవసరమైతే ఆక్రమణకు గురైన భూములను సీజ్ చేసి కోర్టు పరిధిలోకి తీసుకెళ్లాలని కోరారు.బాధితుడు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామంలోని సర్వే నంబర్ 943లో తనకు 1.05 ఎకరాల వ్యవసాయ భూమి ఉందని, అయితే కొంతకాలంగా పొరుగు భూస్వాములు తనను తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తున్నారని ఆరోపించారు. గతంలో ప్రభుత్వ సర్వే ఆధారంగా భూమిని కొలతలు వేసి హద్దు రాళ్లు ఏర్పాటు చేసినప్పటికీ, వాటిని కొందరు తొలగించి సుమారు ఏడు గుంటల భూమిని ఆక్రమించి సాగు చేస్తున్నారని తెలిపారు. దీనిపై కేసులు నమోదైనప్పటికీ ఇప్పటివరకు న్యాయం జరగలేదని ఆవేదన వ్యక్తం చేశారు. తన పొలంలోకి ట్రాక్టర్లు, హార్వెస్టర్లు వెళ్లకుండా అడ్డుకోవడంతో పాటు వ్యవసాయ పనులకు వచ్చే కూలీలను కూడా బెదిరించి పంపిస్తున్నారని ఆరోపించారు. అలాగే రేవులకుంట చెరువును ఆక్రమించి బావులు తవ్వడం, డి-86 కాలువను ధ్వంసం చేయడంతో తమ భూమికి సాగునీరు అందకుండా పోయిందని పేర్కొన్నారు. ఈ సమస్యల పరిష్కారం కోసం గత ఆరేళ్లుగా కలెక్టర్లు, ఎమ్మార్వోలు, ఆర్డీవోలు, పోలీసు అధికారుల చుట్టూ తిరుగుతున్నప్పటికీ ఫలితం లేకపోయిందని రమేష్ వాపోయారు. 2024 నవంబర్, డిసెంబర్ నెలల్లో, 2025 మార్చి, మే నెలల్లో కలెక్టర్ కార్యాలయానికి ఫిర్యాదులు చేసినట్లు తెలిపారు. ఇటీవల 2026 జూన్ 18న ప్రజావాణిలో మరోసారి ఫిర్యాదు చేసినప్పటికీ భూమి కొలతలు చేపట్టలేదని ఆవేదన వ్యక్తం చేశారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ఈజ్‌మెంట్ హక్కుల చట్టం ప్రకారం తమ వ్యవసాయ భూమికి రహదారి ఏర్పాటు చేసి, ఆక్రమణలను తొలగించి న్యాయం చేయాలని జిల్లా కలెక్టర్‌ను రైతు తాటికొండ రమేష్ కోరారు.

# రాష్ట్ర స్థాయి పవర్‌లిఫ్టింగ్‌లో కోరుట్ల క్రీడాకారుల సత్తా

జాతీయ ఛాంపియన్‌షిప్‌కు ముగ్గురు ఎంపిక

**కోరుట్ల జూన్ 22 (ప్రజాతీర్పు)**




హైదరాబాద్‌లోని సుల్తాన్‌బజార్ వి.పి.జి గ్రౌండ్స్‌లో నిర్వహించిన రాష్ట్ర స్థాయి పవర్‌లిఫ్టింగ్ ఛాంపియన్‌షిప్‌లో కోరుట్లకు చెందిన క్రీడాకారులు ప్రతిభ కనబరిచి పతకాలు సాధించారు.పోటీల్లో కల్లెడ రోహిత్ కుమార్, యు. మన్విత్ తమ తమ విభాగాల్లో అద్భుత ప్రదర్శనతో గోల్డ్ మెడల్స్‌ను కైవసం చేసుకోగా, గిన్నెల నిపుణ్ తేజ్ సిల్వర్ మెడల్‌ను గెలుచుకున్నారు. రాష్ట్ర స్థాయిలో అత్యుత్తమ ప్రదర్శన కనబరిచిన ఈ ముగ్గురు క్రీడాకారులు ఆగస్టు నెలలో ఢిల్లీలో జరగనున్న జాతీయ స్థాయి పవర్‌లిఫ్టింగ్ ఛాంపియన్‌షిప్‌కు ఎంపికయ్యారు.క్రీడాకారుల విజయంపై కోరుట్ల పట్టణ ప్రజలు, క్రీడాభిమానులు, కోచ్‌లు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా పలువురు ప్రముఖులు క్రీడాకారులను అభినందిస్తూ, జాతీయ స్థాయిలో కూడా ఉత్తమ ప్రతిభ కనబర్చి మరిన్ని విజయాలు సాధించి కోరుట్లకు, తెలంగాణకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు.

# రామకృష్ణ ముదిరాజ్ జ్ఞాపకార్థం అన్నదానం.. వృద్ధుల ఆశీస్సులు పొందిన సూర్యకళ

- ఆకలికి అన్నం.. భర్తకు ఘన నివాళి!
- సేవతో భర్త జ్ఞాపకాలను చిరస్థాయిగా నిలిపిన సూర్యకళ.

**బోడుప్పల్ సర్కిల్/ జూన్ 22. ( ప్రజాతీర్పు )**



భార్యాభర్తల అనుబంధానికి నిలువెత్తు నిదర్శనంగా, తన భర్త కీ.శే. రామకృష్ణ ముదిరాజ్ జన్మదినాన్ని పురస్కరించుకుని సూర్యకళ మానవతా సేవా కార్యక్రమాన్ని నిర్వహించారు. మల్కాజ్గిరి మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని బోడుప్పల్ సర్కిల్ చెంగిచెర్ల క్రాంతి కాలనీలో ఉన్న కరుణా సదన్ వృద్ధాశ్రమంలో దాదాపు 100 మంది అనాథ వృద్ధులకు కుటుంబ సభ్యులు, బంధుమిత్రులతో కలిసి అన్నదానం చేశారు.ఈ సందర్భంగా వృద్ధులకు స్వయంగా భోజనం వడ్డించి వారి ఆశీర్వాదాలు పొందారు. అనంతరం సూర్యకళ మాట్లాడుతూ, తన భర్త కీ.శే. రామకృష్ణ ముదిరాజ్ జన్మదినం సందర్భంగా ఆయన జ్ఞాపకార్థం అనాథ వృద్ధులకు ఒక్కపూట భోజనం అందించడం తనకు ఎంతో ఆత్మసంతృప్తిని కలిగించిందని తెలిపారు.సమాజంలో ప్రతి ఒక్కరూ తమ కుటుంబ సభ్యుల జ్ఞాపకార్థం ఇలాంటి సేవా కార్యక్రమాలు నిర్వహించి అవసరమైన వారికి అండగా నిలవాలని ఆమె పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కుటుంబ సభ్యులు, బంధుమిత్రులు, ఆశ్రమ నిర్వాహకులు పాల్గొని సూర్యకళ సేవా భావాన్ని అభినందించారు.



# జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్ కుమార్‌కి ఉపసర్పంచుల వినతి పత్రం


**బీర్పూర్. జూన్ 22( ప్రజా తీర్పు )**

బీర్‌పూర్ మండల ఉపసర్పంచుల ఫోరం అధ్యక్షులు దగ్గుల వీరేశం ఆధ్వర్యంలో మండల కార్యవర్గ సభ్యులు గౌరవ జగిత్యాల నియోజకవర్గ శాసనసభ్యులు శ్రీ సంజయ్ కుమార్ ని కలిసి పలు సమస్యలు, డిమాండ్లపై వినతి పత్రాన్ని సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, ఇటీవల ఉపసర్పంచుల చెక్ పవర్ రద్దు చేస్తారు అని సోషల్ మీడియా మరియు ఇతర మాధ్యమాల్లో వస్తున్న వార్తల కారణంగా రాష్ట్రవ్యాప్తంగా ఉపసర్పంచుల్లో తీవ్ర ఆందోళన నెలకొందని తెలిపారు. ఈ విషయంపై రాష్ట్ర ప్రభుత్వం స్పష్టత ఇవ్వడంతో పాటు, అసత్య ప్రచారాలను ఖండించే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని, అలాగే ఈ అంశాన్ని రాష్ట్ర శాసనసభలో లేవనెత్తాలని ఎమ్మెల్యే గారిని కోరారు.అదేవిధంగా గ్రామ పంచాయతీల్లో ప్రజాసేవ చేస్తున్న ఉపసర్పంచులకు, వార్డు సభ్యులకు గౌరవ వేతనం ప్రభుత్వం మంజూరు చేయాలని ఎమ్మెల్యే ద్వారా రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.వినతి పత్రాన్ని స్వీకరించిన గౌరవ ఎమ్మెల్యే శ్రీ సంజయ్ కుమార్.ఉపసర్పంచులు, వార్డు సభ్యుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి, వారి న్యాయమైన డిమాండ్ల పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చినట్లు మండల ఫోరం నాయకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో బీర్‌పూర్ మండల ఉపసర్పంచుల ఫోరం అధ్యక్షులు దగ్గుల వీరేశం, ఉపాధ్యక్షులు నారపాక రమేష్ ప్రధాన కార్యదర్శి తరాళ్ల మల్లేశం, కోశాధికారి జక్కుల నాగరాజ్ సలహాదారు శీలం లింగన్న మండల కార్యవర్గ సభ్యులు ఎనగంటి జితేంధర్ ఎనగంటి రమేష్, సంగ గంగన్న, చిక్రం అంజన్న,పట్టం స్వర్ణలత-రమేష్ బత్తుల పద్మ-రాజేష్ , సీతారాం మహేష్, మల్లేశం,వివిధ గ్రామాల ఉపసర్పంచులు ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

# నీట్ పరీక్షల నిర్వహణలో కేంద్రం పూర్తిగా విఫలం

- ఎంపీ గడ్డం వంశీకృష్ణ

**(దుర్గం నగేష్ ,ప్రజాతీర్పు పెద్దపల్లి జిల్లా స్టాఫ్ రిపోర్టర్), జూన్ 22**



నీట్ పరీక్షల నిర్వహణలో కేంద్ర ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీకృష్ణ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. విద్యార్థుల భవిష్యత్తుతో కేంద్ర ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని ఆయన మండిపడ్డారు. సోమవారం విడుదల చేసిన ప్రకటనలో ఆయన మాట్లాడుతూ.. నీట్ ప్రశ్నాపత్రాల లీకేజీల కారణంగా ఇప్పటికే లక్షలాది మంది విద్యార్థులు తీవ్ర మానసిక వేదనకు గురయ్యారని పేర్కొన్నారు. ఒకసారి పరీక్ష రద్దు కావడంతో మళ్లీ నెలల తరబడి శ్రమించి సిద్ధమైన విద్యార్థులను కేవలం ఐదు, పది నిమిషాలు ఆలస్యంగా వచ్చారనే కారణంతో పరీక్ష కేంద్రాల్లోకి అనుమతించకపోవడం అత్యంత దురదృష్టకరమని విమర్శించారు. కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్, ప్రధానమంత్రి నరేంద్ర మోదీ విద్యార్థుల సమస్యలపై బాధ్యతాయుతంగా స్పందించాలని కోరారు. ప్రశ్నాపత్రాల లీకేజీలను అరికట్టడంలో విఫలమైన ప్రభుత్వం, మరోవైపు కష్టపడి చదివిన విద్యార్థుల భవిష్యత్తును దెబ్బతీసే నిర్ణయాలు తీసుకోవడం సమంజసం కాదన్నారు. పరీక్ష కేంద్రాల వద్ద కన్నీటి పర్యంతమైన విద్యార్థులు, వారి తల్లిదండ్రుల ఆవేదన ప్రభుత్వానికి శాపంగా మారుతుందని హెచ్చరించారు. యువత ఆశయాలను గౌరవించి, వారి భవిష్యత్తును కాపాడేలా కేంద్ర ప్రభుత్వం తక్షణ చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. "పిల్లల భవిష్యత్తు కోసం పని చేయండి.. వారి జీవితాలతో ఆడుకోవద్దు" అని ఎంపీ గడ్డం వంశీకృష్ణ కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు.



# బీర్పూర్ మండల రైతువేదికలలో మంగళవారం విత్తన మేళాలి

**బీర్ పూర్ జూన్2 (ప్రజాతీర్పు ).**

బీర్పూర్ మండలం లోని మండల విత్తన డీలర్ల తో సమావేశంప్రభుత్వం ప్రతిష్టాత్మకము.వానాకాలం సాగు కొరకు రైతులకు విత్తనాలు మరింత చేరువలో అందుబాటులో ఉంచాలని మన మండలంలో నీ కండ్లపల్లి, కోల్వాయి క్లస్టర్ రైతువేదిక లలో రేపు లివిత్తన మేళా నిర్వహిస్తున్నామని తెలుపుతున్నాము.విత్తన మేళా లో భాగంగా వానాకాలం సాగుకు అనువైన డిమాండ్ ఉన్న వరి విత్తనాలు, కందుల విత్తనాలు, నానో యూరియా రైతులకు మేళా లో స్టాల్ లు ఏర్పాటు చేయడం జరుగుతోంది

**డీలర్ లతో సమావేశం :**

విత్తన మేళా ఏర్పాట్లలో భాగంగా ఈరోజు మండలం లోని విత్తన డీలర్ లతో మండల వ్యవసాయ అధికారి ఎన్ .తిరుపతిసమావేశం నిర్వహించడం జరిగింది.

సమావేశంలో రేపు మంగళవారం అందరూ డీలర్స్ తమ వద్ద ఉన్న వరి విత్తనాలు , కందులు, పెసర్లు ఇతర విత్తనాల ను రేపటి విత్తన మేళా లో అందుబాటులో ఉంచాలని తెలుపడం జరిగింది ఈ కార్యక్రమంలో ఏఈఓలు.అయ్యోరీ వినోద్.వడ్లూరి శిరీష.బీర్పూర్ మండల డీలర్.లుపాల్గొన్నారు.

## జేఈఈ ర్యాంకులు ప్లేస్‌మెంట్లలో చూపించొద్దు

ఇన్ని రోజులు ఐఐటీ స్టూడెంట్లు జేఈఈ ర్యాంకు అనేది తమ కష్టానికి ప్రతిఫలంగా భావించేవారు. కానీ ఇక నుంచి అది ఐఐటీ కాలేజీల గేటు వద్దే ముగిసేలా కనిపిస్తున్నది. ఎందుకంటే జేఈఈ ర్యాంకులు, గేట్ స్కోర్లు, పర్సంటైల్‌ను ఇక నుంచి కాలేజీ ప్లేస్‌మెంట్లలో చూపించొద్దని ఆల్ ఐఐటీస్ ప్లేస్‌మెంట్ కమిటీ (ఏఐపీసీ) దేశంలోని 23 ఐఐటీల స్టూడెంట్లను ఆదేశించింది. స్టూడెంట్లు వారి రెజ్యూమేలలో జేఈఈ ర్యాంకుల వివరాలను అస్సలు ఉంచొద్దని తెలుపడం చర్చనీయాంశంగా మారింది. 23 ఐఐటీల బాడీ మీటింగ్‌లో ఏఐపీసీ ఏకపక్షంగా ఈ నిర్ణయం తీసుకుంది.

**ఎందుకీ నిర్ణయం..?**

ఉన్నట్టుండి ఈ నిర్ణయం తీసుకోవడం వెనుక బలమైన కారణాలున్నాయని ఏఐపీసీ కన్వీనర్ జాన్ జోస్ వెల్లడించారు. ఐఐటీల్లో రిజర్వేషన్ల ద్వారా సీట్లు పొందిన విద్యార్థులపై వివక్షను తగ్గించేందుకే ఈ నిర్ణయం తీసుకున్నట్టు తెలిపారు.

# గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి అధిక నిధులు

## మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్

**(కుమారస్వామి ప్రజాతీర్పు జగిత్యాల రూరల్ )జూన్ 22**



జగిత్యాల జిల్లా ధర్మపురి నియోజకవర్గంలోని గ్రామీణ ప్రాంతాల సమగ్ర అభివృద్ధికి అధిక నిధులు కేటాయించి ప్రజల అవసరాలను తీర్చేందుకు కృషి చేస్తానని తెలంగాణ రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ తెలిపారు. పెగడపల్లి మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో 68 మంది లబ్ధిదారులకు సీఎం సహాయ నిధి (జవీ=ఫ్) చెక్కులు, 9 మంది లబ్ధిదారులకు కళ్యాణ లక్ష్మి చెక్కులను మంత్రి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, తనపై నమ్మకం ఉంచి ఎమ్మెల్యేగా గెలిపించిన ప్రజలకు సేవ చేయడం తన ప్రధాన బాధ్యత అని అన్నారు. పేద ప్రజల జీవితాల్లో ఆర్థిక భరోసా కల్పించేందుకు రాష్ట్ర ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తోందని పేర్కొన్నారు. ప్రతి పేద కుటుంబం కలగంటున్న సొంతింటి స్వప్నాన్ని సాకారం చేయడమే తన లక్ష్యమని, అందులో భాగంగా అర్హులైన నిరుపేదలకు జూలై నెల నాటికి ఇందిరమ్మ ఇండ్ల మంజూరు ప్రక్రియను వేగవంతం చేస్తామని హామీ ఇచ్చారు. గ్రామీణ ప్రాంతాల్లో మెరుగైన రవాణా సౌకర్యాల కోసం పెగడపల్లి మండలానికి రూ. 2.51 కోట్ల నిధులు మంజూరు చేసినట్లు మంత్రి తెలిపారు. ఈ నిధులతో గ్రామాల మధ్య రోడ్ల నిర్మాణం, మరమ్మతులు చేపట్టి ప్రజలకు మెరుగైన వసతులు కల్పిస్తామని చెప్పారు. అదేవిధంగా, మండల వ్యాప్తంగా చివరి ఆయకట్టు వరకు సాగునీరు అందేలా చర్యలు తీసుకుంటామని, రైతులకు నీటి ఇబ్బందులు లేకుండా చేసి వ్యవసాయాన్ని మరింత అభివృద్ధి చేస్తామని పేర్కొన్నారు. సాగునీటి వసతుల విస్తరణతో పెగడపల్లి మండలాన్ని సస్యశ్యామలం చేయడమే ప్రభుత్వ లక్ష్యమని మంత్రి లక్ష్మణ్ కుమార్ స్పష్టం చేశారు.



## రోడ్డు ప్రమాద బాధితుడిని పరామర్శించిన ఇల్లందు ఎమ్మెల్యే కోరం కనకయ్య

**(పొనకంటి ఉపేందర్ రావు ప్రజాతీర్పు టేకులపల్లి) జూన్ 22**

టేకులపల్లి :చంద్రుతండా (ప), సూర్యతండా గ్రామానికి చెందిన ధరావత్ రవి బస్సు డ్రైవర్‌గా అవుట్ సోర్సింగ్ లో పనిచేస్తూ తన కుటుంబాన్ని పోషిస్తున్నాడు. ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్ర గాయాలపాలై ప్రస్తుతం ఇంటికే పరిమితమై, జీవనోపాధి కోసం ఎటువంటి పని చేయలేని దుర్భర పరిస్థితిలో ఉన్నాడు.ఈ విషయం తెలుసుకున్న ఇల్లందు ఎమ్మెల్యే కోరం కనకయ్య బాధితుడు హరి నివాసానికి వెళ్లి పరామర్శించి, ఆయన ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పి అన్ని విధాలుగా అండగా ఉంటామని హామీ ఇచ్చారు.అనంతరం కొత్తగూడెం డి.ఎస్. పి తో ఫోన్‌లో మాట్లాడిన ఎమ్మెల్యే నిరుపేద కుటుంబానికి చెందిన రవి రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డాడని, లక్ష్మీదేవిపల్లి పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు నమోదు అయినప్పటికీ బాధితుడికి తెలంగాణ స్టేట్ రోడ్డు ట్రాన్స్పోర్ట్ కార్పొరేషన్ నుండి ఇప్పటివరకు ఎలాంటి పరిహారం అందలేదని తెలిపారు. ఈ ఘటనపై తక్షణమే విచారణ జరిపి, బాధితుడికి న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.ఈమానవతాస్పందనపై స్థానిక ప్రజలు అభినందనలు తెలిపారు.



## ప్రజావాణి దరఖాస్తుల పరిష్కారంలో ఆలస్యం చేయకూడదు

- జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా

**నిర్మల్ జిల్లా ప్రతినిధి,జూన్ 22(ప్రజాతీర్పు )**

ప్రజావాణి దరఖాస్తుల పరిష్కారంలో ఆలస్యం చేయకూడదని జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో కలెక్టర్ పాల్గొన్నారు. ప్రజల నుంచి వచ్చిన ఫిర్యాదులను ఆయన స్వయంగా స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ఆయా శాఖల అధికారులు ప్రతి దరఖాస్తును క్షుణ్ణంగా పరిశీలించి, తక్షణమే స్పందించాలని అధికారులకు సూచించారు. మండలాల వారీగా పెండింగ్ లో ఉన్న ప్రజావాణి దరఖాస్తులకు సంబంధించి సమస్యలను వెంటనేపరిష్కరించాలన్నారు. ప్రజల సమస్యలను సంబంధిత శాఖలు సమన్వయంతో పరిష్కరించేలా పనిచేయాలని సూచించారు. ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా, ప్రజలు విద్య, వైద్యం, ఇందిరమ్మ ఇండ్లు, పింఛన్లు, భూ సమస్యలకు సంబంధించి దరఖాస్తులను కలెక్టర్ కు సమర్పించారు ప్రజావాణి కార్యక్రమం అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ, "ప్రజాపాలన – ప్రగతి ప్రణాళిక" కార్యక్రమానికి సంబంధించి జిల్లా ప్రత్యేక అధికారి సమీక్షా సమావేశానికి సిద్ధంగా ఉండాలన్నారు. శాఖలవారిగా చేపట్టిన కార్యక్రమాలు, సక్సెస్ స్టోరీలు, నివేదికలను సిద్ధం చేసుకోవాలని తెలిపారు. అనంతరం జిల్లా మహిళా శిశు సంక్షేమ శాఖకు సంబంధించి "నషా ముక్త్ భారత్ అభియాన్" గోడ ప్రతులను కలెక్టర్, అధికారులు ఆవిష్కరించారు. ఈ ప్రజావాణి కార్యక్రమంలో అదనపు కలెక్టర్ లు బి. వెంకటేశ్వర్లు, కిషోర్ కుమార్, డిఆర్ఓ రాథోడ్ రమేష్, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.



## నర్సంపేట సోషల్ వెల్ఫేర్ పాఠశాలలో మాదకద్రవ్యాలపై నిర్మూలనపై విద్యార్థులకు అవగాహన కార్యక్రమం

**నర్సంపేట జూన్ 22 ప్రజా తీర్పు**

నర్సంపేట సోషల్ వెల్ఫేర్ పాఠశాలలో ఈగల్ ఫోర్స్ తెలంగాణ ఆధ్వర్యంలో అంతర్జాతీయ మాదకద్రవ్యాల వ్యతిరేక దినోత్సవం సందర్భంగా అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి నర్సంపేట సీఐ శ్రీనివాస్, ఎస్సై అరుణ్ కుమార్, రాజన్ బాబు హాజరై విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, మాదకద్రవ్యాల వినియోగం యువత భవిష్యత్తును దెబ్బతీస్తుందని, విద్యార్థులు చెడు వ్యసనాలకు దూరంగా ఉండి విద్య, క్రీడలు, సృజనాత్మక కార్యకలాపాలపై దృష్టి సారించాలని సూచించారు. సమాజంలో మాదకద్రవ్యాల నిర్మూలనకు ప్రతి ఒక్కరూ బాధ్యత వహించాలని, అనుమానాస్పద కార్యకలాపాలపై వెంటనే 1908 టోల్ ఫ్రీ నంబర్ ద్వారా సమాచారం అందించాలని తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల సిబ్బంది, ఉపాధ్యాయులు పాల్గొనగా, విద్యార్థులు పెద్ద సంఖ్యలో హాజరై మాదకద్రవ్యాలకు దూరంగా ఉంటామని ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమం సీఐ శ్రీనివాస్, ఎస్సై అరుణ్ కుమార్, రాజన్ బాబు ఆధ్వర్యంలో విజయవంతంగా నిర్వహించబడింది.

## మంథని క్యాంపు కార్యాలయంలో ఘనంగా ఊట్ల అక్షిత్ రెడ్డి జన్మదిన వేడుకలు

**మంథని, జూన్-22 (ప్రజాతీర్పు)**



మంథని క్యాంపు కార్యాలయంలో యూత్ కాంగ్రెస్ నాయకుడు ఊట్ల అక్షిత్ రెడ్డి జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి టీపీసీసీ ప్రధాన కార్యదర్శి దుద్దిళ్ల శ్రీను బాబు, జిల్లా అధికార ప్రతినిధి సేగ్గం రాజేష్, ఊట్ల అనిల్ రెడ్డి ఆధ్వర్యంలో అక్షిత్ రెడ్డికి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి, అక్షిత్ రెడ్డి ప్రజాసేవలో మరింత ముందుకు సాగాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో రావికంటి సతీష్ దొర, గొర్ల శ్రీనివాస్, ఎరుకల ప్రవీణ్, కొమ్మిడి నరేష్, బూడిద శంకర్, ఐదో వార్డు సభ్యుడు రాజకుమార్, యూత్ కాంగ్రెస్ నాయకులు సాయి గౌడ్, మసీరెడ్డి రాజ్, కొమ్మిడి గోవర్ధన్, బిబ్బర రామకృష్ణ, కొమ్మిడి సంతోష్, బెల్లం మధుకర్, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొని అక్షిత్ రెడ్డికి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు.

### ఈజీఎస్ నిధులను స్థానిక మండల పరిధి, జగ్గు తండా తదితర పంచాయతీలకు పెట్టకపోవడం

# ఎమ్మెల్యే పక్షపాత వైఖరికి నిదర్శనం



సిపిఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ

**(పగడాల రామారావు ప్రజా తీర్పు బయ్యారం మండల ప్రతినిధి) జూన్ 22**

బయ్యారం. ఎంజిఎన్ఆర్ఇజిఎస్ లో కూలీలు చేసిన పనికి వచ్చిన మొత్తం వేతనాల్లో 40% వరకు సిసి రోడ్లు, కల్వర్టులకు కేటాయించే పథకంలో భాగంగా స్థానిక మండలానికి రెండు కోట్ల 20 లక్షల నిధులు కేటాయించగా వాటిలో మేజర్ పంచాయతీ అయిన బయ్యారతో పాటు జగ్గుతండ, నామాలపాడు, కాచనపల్లి తదితర గ్రామపంచాయతీలకు ఒక్క పని కూడా కేటాయించక పోవడం ఎమ్మెల్యే పక్షపాత వైఖరికి నిదర్శనమని సిపిఐ (ఎమ్మెల్) న్యూ డెమోక్రసీ ఆరోపించింది. ఈరోజు సిపిఐ(ఎంఎల్)న్యూడెమోక్రసీ ప్రతినిధి బృందం ఈ మేరకు స్థానికఎంపీడీవో కు మెమోరాండం సమర్పించింది. తక్షణమే స్థానిక పంచాయతీతో సహా వివిధ పంచాయతీల్లో చేసిన పనికి సరిపడా మెటీరియల్ కాంపోనెంటు నిధులను ఆయా పంచాయతీలలో సిసి రోడ్లకు కేటాయించాలని వారు డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా సిపిఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ డివిజన్ నాయకులు తుడుం వీరభద్రం మాట్లాడుతూ బయ్యారం, జగ్గుతండ లలో రోజుకు 1100 మంది కూలీలు ఈజీఎస్ పనులకు వెళుతుంటారని, వారు చేసిన పనికి సంవత్సరానికి సుమారు కోటి రూపాయలు వేతనాలు వస్తాయని, వాటిలో కనీసం 60 లక్షలకు తగ్గకుండా ఈ పంచాయతీలకు కేటాయించాల్సి ఉంటుందన్నారు. కాగా ఎమ్మెల్యే వీటికి ఒక్క పని కూడా కేటాయించకుండా తమకు ఇష్టమైన పంచాయితీలకు మాత్రమే ఎక్కువ పనులు మళ్ళించారని విమర్శించారు. 100 మంది కూలీలు కూడా ఈజీఎస్ పనులకు వెళ్లని చిన్న పంచాయతీలలో మూడు,నాలుగు పనులను కేటాయించారని, ఇలాంటి పక్షపాత వైఖరి వలన ఎక్కువమందితో ఈజీఎస్ పనులు చేయించిన గ్రామపంచాయతీలకు అన్యాయం జరుగుతుందని అన్నారు. ఎంజిఎన్ఆర్ఇజిఎస్ నిధులను ఏ ప్రాతిపదికన గ్రామపంచాయతీలకు కేటాయించారో ఎమ్మెల్యే, ఉన్నతాధికారులు సమాధానం చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజా పాలన పేరుతో ఏకపక్షపాలన సాగిస్తున్నదని, ఎమ్మెల్యేలు నియోజకవర్గాల్లో ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారని వీరభద్రం ఆరోపించారు. ఇందిరమ్మ ఇండ్లు ఎలాంటి ప్రమాణాలు పాటించకుండా ఇష్టారాజ్యంగా కేటాయిస్తున్నారని, ఇప్పుడు ఈజీఎస్ పనులలో కూడా పక్షపాతంతో వ్యవహరిస్తూ ఇష్టమైన ప్రాంతాలకు నిధులు మళ్ళిస్తున్నారని ఆయన అన్నారు. కూలీలతో పనులు చేయించాలని ఒత్తిడి పెట్టే అధికారులు నిధులు కేటాయించే సందర్భంలో ఎందుకు మాట్లాడటం లేదని, పనులు చేసేది ఒకరైతే లాభపడేది మరొకరు అవుతున్నారని ఆయన అన్నారు. ఎన్ఆర్ఈజీఎస్ మెటీరియల్ కాంపోనెంట్ నిధుల కేటాయింపులు జరిగిన అన్యాయాన్ని ఉన్నతాధికారులు జోక్యం చేసుకొని సరిచేయాలని, స్థానికజగ్గు తండా తో సహా మినహాయించబడిన గ్రామపంచాయతీలు అన్నిటికీ అక్కడ జరిగిన పనుల ఆధారంగా నిధులు కేటాయించాలని వీరభద్రం డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు నేతగాని రాకేష్, ఏపూరి వీరభద్రం, కొదుమూరి నాగేశ్వరరావు, బీరెడ్డి సంగయ్య, రెడ్డిమల్ల విశ్వనాథం, ఊకె శేషు, సాగర్ తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా లయన్స్ క్లబ్ ఆఫ్ సెంటినరీకాలనీ నూతన పాలకవర్గ ప్రమాణ స్వీకార మహోత్సవం

**రామగిరి, జూన్-22 (ప్రజాతీర్పు)**



లయన్స్ క్లబ్ ఆఫ్ సెంటినరీకాలనీ నూతన పాలకవర్గ ప్రమాణ స్వీకార మహోత్సవం రామగిరి మండలం సెంటినరీ కాలనీలోని సింగరేణి కమ్యూనిటీ హాల్‌లో ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా, క్లబ్ ఇన్‌స్టాలేషన్ ఆఫీసర్‌గా విచ్చేసిన జిల్లా మాజీ గవర్నర్ లయన్ డాక్టర్ విజయ రేకులపల్లి నూతన పాలకవర్గ సభ్యులతో ప్రమాణ స్వీకారం చేయించారు. నూతన అధ్యక్షురాలిగా డాక్టర్ శరణ్య యాదవ్, కార్యదర్శిగా కాటం సత్యం, కోశాధికారిగా టి.వి. సురేష్ బాబు, ఉపాధ్యక్షుడిగా బుద్యార్థి బుచ్చన్నతో పాటు వివిధ చైర్ పర్సన్‌లు బాధ్యతలు స్వీకరించారు. అనంతరం డాక్టర్ విజయ రేకులపల్లి మాట్లాడుతూ.. గత పాలకవర్గం సేవా కార్యక్రమాల్లో విశేష కృషి చేసిందని, ఒకే సంవత్సరంలో 165 సేవా కార్యక్రమాలను నిర్వహించి 7, 539 మంది లబ్ధిదారులకు సేవలు అందించడం అభినందనీయమని కొనియాడారు. ఇదే సేవా స్ఫూర్తితో నూతన పాలకవర్గం మరిన్ని సామాజిక కార్యక్రమాలు చేపట్టి ప్రజలకు మరింత చేరువ కావాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా గత సంవత్సరంలో నేత్రదానం చేసిన 22 మంది నేత్రదాతల కుటుంబ సభ్యులను ఘనంగా సన్మానించి జ్ఞాపికలను అందజేశారు. అలాగే 14 మంది నూతన సభ్యులను లయన్స్ క్లబ్‌లోకి ఆహ్వానించి సభ్యత్వ పత్రాలను అందజేశారు. నూతన అధ్యక్షురాలు డాక్టర్ శరణ్య యాదవ్ మాట్లాడుతూ.. తనపై ఉంచిన నమ్మకానికి క్లబ్ సభ్యులందరికీ కృతజ్ఞతలు తెలిపారు. గత పాలకవర్గం చూపిన సేవా మార్గంలో ముందుకు సాగుతూ, విద్య, వైద్యం, పర్యావరణం, మానవతా సేవా కార్యక్రమాలకు మరింత ప్రాధాన్యత ఇస్తూ క్లబ్‌ను మరింత ఉన్నత స్థాయికి తీసుకెళ్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో జి ఎస్ టి కో–ఆర్డినేటర్ సాదుల వెంకటేశ్వర్లు, జిల్లా సెక్రటరీ రామకిషన్, రీజనల్ చైర్మన్ కావేటి రాజగోపాల్, జోనల్ చైర్మన్ భాస్కర్ రావు, వేల్పుల రమేష్, సెంటినరీకాలనీ లయన్స్ క్లబ్ చైర్ పర్సన్‌లు, మహిళా చైర్ పర్సన్‌లు, సభ్యులు మరియు స్థానికులు అధిక సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.



## మండల వార్డ్ సభ్యుల అధ్యక్షుడిగా కొల్లూరిమల్లేశం ఎన్నిక

**బీర్పూర్. జూన్ 22 (ప్రజా తీర్పు)**

బీర్పూర్ మండలశీ అభివృద్ధిలో సరికొత్త అధ్యాయం! ఈరోజు జరిగిన బీర్పూర్ మండల వార్డ్ మెంబర్స్ ఫోరమ్ ప్రతినిధుల సమావేశంలో నూతన కార్యవర్గాన్ని అత్యంత ఉత్సాహభరిత వాతావరణంలో, అందరి ఆమోదంతో ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది. నాయకత్వ బాధ్యతలు చేపట్టబోతున్న నూతన కార్యవర్గ విజేతలు వీరే: అధ్యక్షులు: కొల్లూరి మల్లేశంప్రధాన.కార్యదర్శి. ఎనగందుల.శ్రీనివాస్ఉపాధ్యక్షులు. గురునాథం నరేష్, సదాల లత.జగదీష్,పూడూరిరాజేందర్. కోశాధికారి.పూదరిప్రవీణ్. కార్యదర్శులు. కొండ మమత మహేష్,కందుకూరిలక్ష్మణ్.సలహాదారులు:పెద్రం రాకేష్, ఎలగందుల అనిల్ఈ నూతన కమిటీ ఎన్నికకు మండలంలోని వార్డ్ సభ్యులందరూ పెద్ద సంఖ్యలో హాజరై, తమ పూర్తి మద్దతును తెలియజేస్తూ ఈ కార్యక్రమాన్ని ఘనంగా విజయవంతం.చేశారు.మండల సమస్యల పరిష్కారానికి, ప్రజల సంక్షేమానికి మరియు వార్డ్ మెంబర్ల హక్కుల సాధనకు ఈ నూతన కార్యవర్గం అహర్నిశలు కృషి చేస్తుందని ఆశిస్తూ.నూతనంగా ఎన్నికైన ప్రతి ఒక్కరికీ హృదయపూర్వక తెలిపారు అభినందనలు శుభాకాంక్షలు తెలిపారు.

## కాంగ్రెస్ కు కొత్త రథసారధులు

- పట్టణ అధ్యక్షుడిగా వడ్డేపల్లి వెంకట రమణ
- మండల పార్టీఅధ్యక్షుడిగా వెన్న రాజు

**హుస్నాబాద్ జూన్ 22 ప్రజా తీర్పు**



హుస్నాబాద్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడిగా వెన్న రాజు, హుస్నాబాద్ పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడిగా వడ్డేపల్లి వెంకటరమణలను టీపీసీసీ అధ్యక్షుడు బి. మహేష్ కుమార్ గౌడ్ నియమించారు. ఈ సందర్భంగా ఇద్దరు నాయకులు రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ నాయకత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. తమ నియామకానికి సహకరించిన రాష్ట్ర మంత్రి, స్థానిక ఎమ్మెల్యే పొన్నం ప్రభాకర్‌కు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. కాంగ్రెస్ పార్టీ రాష్ట్రంలో అధికారంలో లేని సమయంలో కూడా పార్టీ బలోపేతానికి వెన్న రాజు, వడ్డేపల్లి వెంకటరమణలు అంకితభావంతో పనిచేశారని పార్టీ వర్గాలు పేర్కొన్నాయి. ఇటీవల జరిగిన స్థానిక సంస్థల ఎన్నికల్లో వెన్న రాజు తన స్వగ్రామమైన మాలపల్లిలో తన సతీమణి వెన్న స్వర్ణలతను కాంగ్రెస్ పార్టీ సర్పంచ్ అభ్యర్థిగా నిలబెట్టి గెలిపించుకున్నారు. అలాగే నియోజకవర్గ వ్యాప్తంగా కాంగ్రెస్ పార్టీ అభివృద్ధికి కృషి చేశారు. హుస్నాబాద్ మున్సిపల్– 2026 ఎన్నికల్లో వడ్డేపల్లి వెంకటరమణ కీలక పాత్ర పోషించారు. మున్సిపాలిటీలో 20 వార్డుల్లో 16 స్థానాలను కాంగ్రెస్ పార్టీ కైవసం చేసుకోవడంలో కీలక పాత్ర పోషించారు. ఆయన చేసిన సేవలను గుర్తించిన పార్టీ అధిష్టానం ఈ బాధ్యతలను అప్పగించినట్లు తెలుస్తోంది. వి.వెంకటరమణ, వెన్నరాజు ల నియామకంపై హుస్నాబాద్ మున్సిపల్ పాలకవర్గ సభ్యులు, హుస్నాబాద్ మండల, పట్టణ కాంగ్రెస్, యువజన కాంగ్రెస్, ఎన్ఎస్‌యూఐ, మహిళా కాంగ్రెస్ నాయకులు హర్షం వ్యక్తం చేస్తూ శుభాకాంక్షలు తెలిపారు. రాబోయే రోజుల్లో పార్టీ ఆదేశాలకు అనుగుణంగా పనిచేస్తూ హుస్నాబాద్ లో కాంగ్రెస్ పార్టీని మరింత బలోపేతం చేయాలని ఆకాంక్షించారు.




## మంచిర్యాల : జైపూర్ మండల కేంద్రంలో నూతన కమ్యూనిటీ భవన నిర్మాణానికి భూమి పూజ :

**(అరికిల్ల జయకుమార్, ప్రజా తీర్పు, మంచిర్యాల మండల్) జూన్ 22**

మంచిర్యాల జిల్లా జయపూర్ మండల కేంద్రంలో రూ.25 లక్షల సీఎస్ఆర్ (జూ=) నిధులతో నిర్మించనున్న నూతన కమ్యూనిటీ భవనానికి రాష్ట్ర కార్మిక, ఉపాధి మరియు గనుల శాఖ మంత్రి డా. జి. వివేక్ వెంకటస్వామి భూమి పూజ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్, సంబంధిత శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు, స్థానిక నాయకులు మరియు గ్రామస్తులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో ప్రజల సామాజిక, సాంస్కృతిక అవసరాలను తీర్చేందుకు కమ్యూనిటీ భవనాలు ఎంతో ఉపయోగపడతాయని అన్నారు. సీఎస్ఆర్ నిధులను ప్రజా ప్రయోజనాల కోసం వినియోగించడం ద్వారా గ్రామాల అభివృద్ధికి మరింత ఊతం లభిస్తుందని పేర్కొన్నారు. అనంతరం కమ్యూనిటీ భవన నిర్మాణ పనులను నాణ్యతతో, నిర్దేశిత గడువులోగా పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని అధికారులకు సూచించారు. ఈ భవనం స్థానిక ప్రజలకు సమావేశాలు, సామాజిక కార్యక్రమాలు మరియు ఇతర ప్రజా అవసరాల నిర్వహణకు ఉపయోగపడనుందని తెలిపారు. పలువురు ప్రజాప్రతినిధులు, అధికారులు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

# నిబంధనలు పాటించని ప్రైవేటు పాఠశాలలు

ఆర్డీవో కు బీఆర్ఎస్ నాయకుల ఫిర్యాదు

**హుస్నాబాద్, జూన్ 22 ప్రజా తీర్పు**



హుస్నాబాద్ పట్టణంలోని ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలలు విద్యార్థుల తల్లిదండ్రుల నుంచి అధిక ఫీజులు వసూలు చేస్తూ విద్యను వ్యాపారంగా మార్చాయని ఆరోపిస్తూ బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో సోమవారం ప్రజావాణి కార్యక్రమంలో అధికారులకు వినతిపత్రం సమర్పించారు.

ఈ సందర్భంగా బీఆర్ఎస్ నియోజకవర్గ నాయకుడు అయిలేని మల్లికార్జున రెడ్డి మాట్లాడుతూ ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలలు ప్రభుత్వ నిబంధనలను ఏమాత్రం పాటించకుండా ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నాయని విమర్శించారు. అడ్మిషన్ల పేరుతో, టీసీల పేరుతో, పుస్తకాలు, యూనిఫాంల కొనుగోళ్ల పేరుతో తల్లిదండ్రులపై అదనపు భారం మోపుతున్నారని అన్నారు. పాఠశాలల్లో సరైన ఆటస్థలాలు, పార్కింగ్ సదుపాయాలు కూడా లేకపోయినా అధిక ఫీజులు వసూలు చేస్తున్నారని ఆరోపించారు. హుస్నాబాద్‌లోని ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలల యాజమాన్యాలు సిండికేట్‌గా ఏర్పడి తల్లిదండ్రులను ఇబ్బందులకు గురిచేస్తున్నాయని పేర్కొన్నారు. విద్యాశాఖ అధికారులు ఈ వ్యవహారంపై నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుండటంతో పాఠశాల యాజమాన్యాలు మరింతగా రెచ్చిపోతున్నాయని, ప్రభుత్వం మాటలకే పరిమితమైందని విమర్శించారు. నిబంధనలు పాటించని ప్రైవేట్ పాఠశాలలపై వెంటనే చర్యలు తీసుకోవాలని, లేకపోతే విద్యార్థులు, తల్లిదండ్రుల పక్షాన బీఆర్ఎస్ పార్టీ ఉద్యమాన్ని చేపడుతుందని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పార్టీ సీనియర్ నాయకులు యాస శ్రీనివాస్, కొమ్మెర నర్సింహారెడ్డి, శ్రీనివాస్ పాల్గొన్నారు.

# అగ్గిమల్ల గ్రామ కాంగ్రెస్ పార్టీ నూతన కమిటీ ఎన్నిక

**కుమారస్వామి ప్రజాతీర్పు జగిత్యాల రూరల్) జూన్ 22**



జగిత్యాల జిల్లా గొల్లపెల్లి మండల పరిధిలోని అగ్గిమల్ల గ్రామంలో కాంగ్రెస్ పార్టీ నూతన గ్రామ కమిటీ ఎన్నికల సమావేశం నిర్వహించారు. రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్, జిల్లా అధ్యక్షులు గాజంగి నందయ్యల పిలుపు మేరకు... మండల పార్టీ అధ్యక్షులు రాపల్లె గంగన్న, జనరల్ సెక్రటరీ జెల్లా అనిల్ కుమార్ ల ఆధ్వర్యంలో ఈ కమిటీని ఎన్నుకున్నారు. గ్రామ కాంగ్రెస్ అధ్యక్షుడిగా సట్టా ఎల్లయ్య, వైస్ ప్రెసిడెంట్లుగా కొత్త మోహన్, పొలగని మహేష్, జనరల్ సెక్రటరీగా మల్లెత్తుల మహేష్, సెక్రటరీలుగా తడవేణి నరసయ్య, మారం అంజన్న, దారవేణి పోషయ్య, తడవేని రాజయ్య, చిట్యాల శంకరయ్యలు ఎన్నికయ్యారు. మహిళా విభాగానికి ఉప్పులేటి ప్రియాంక జలంధర్, మైనారిటీ సభ్యులుగా ఎండి రఫీ, ఎండి నవాబ్ లు నియమితులయ్యారు. అదేవిధంగా మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు గౌతమ్ గారి ఆధ్వర్యంలో గ్రామ యూత్ కాంగ్రెస్ కమిటీ ఎన్నిక జరిగింది. ఇందులో అధ్యక్షుడిగా తుల్ల అజయ్, ఉపాధ్యక్షులుగా సందవేణి నరేష్, తోకల సురేష్, జనరల్ సెక్రటరీగా చలిగంటి శ్రీనివాస్, సెక్రటరీలుగా పొలగని రాజు, మారం సురేష్, సట్టా మహేష్, సందవేణి మల్లేష్, మైనారిటీ మెంబర్‌గా ఎండి అమీర్, సోషల్ మీడియా ఇన్‌చార్జ్‌లుగా గంగాధర సునీల్, ఎండి వజీర్ లు ఎన్నికయ్యారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ కంకణాల వసంత లక్ష్మణ్, ఉప సర్పంచ్ తడవేణి నరేష్, మాజీ సర్పంచ్ కొలగని మల్లయ్య, వార్డ్ మెంబర్లు కంకణాల వెంకన్న, సట్ట నందయ్య, మ్యాక వెంకట్రాజ్యం, ఉప్పులేటి జలంధర్, దాడిగొప్పల రాయమల్లు మరియు ముఖ్య నాయకులు లక్ష్మీనారాయణ, జోగు శ్రీనివాస్, సట్ట శంకర్ సంతోష్ రాజేశం తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నూతన కార్యవర్గం మాట్లాడుతూ పార్టీ బలోపేతానికి, ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లడానికి కష్టపడి పనిచేస్తామని పేర్కొన్నారు.



## మైనంపల్లి హనుమంతరావుపై విమర్శలు మానుకోవాలి కాంగ్రెస్ నేతల హెచ్చరిక

**(వినోద్, ప్రజా తీర్పు, మల్కాజిగిరి మేడ్చల్ జిల్లా) జూన్ 22**

మేడ్చల్ జిల్లా, మల్కాజిగిరి కాంగ్రెస్ సీనియర్ నాయకుడు మైనంపల్లి హనుమంతరావుపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, నాయకుడు క్రిషాంక్ చేసిన వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తూ మల్కాజిగిరిలో కాంగ్రెస్ నాయకులు సోమవారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ నేతలు మాట్లాడుతూ, ప్రజా సేవలో నిరంతరం ముందుండే మైనంపల్లి హనుమంతరావుపై వ్యక్తిగత విమర్శలు చేయడం దురదృష్టకరమని మండిపడ్డారు. ప్రజల మధ్య ఉంటూ వారి సమస్యల పరిష్కారం కోసం పోరాడుతున్న నాయకుడిని విమర్శించే ముందు బీఆర్ఎస్ నాయకులు తమ పాలనలో జరిగిన అవినీతి, అక్రమాలపై సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. ప్రజలు బీఆర్ఎస్ ప్రభుత్వ పనితీరును గమనించి ఎన్నికల్లో తగిన గుణపాఠం చెప్పారని, అందుకే ఆ పార్టీ అధికారానికి దూరమైందని వ్యాఖ్యానించారు. రాజకీయ విమర్శలు ప్రజా సమస్యలపై ఉండాలే గానీ వ్యక్తిగత దూషణలు, అసత్య ప్రచారాలు చేయడం సరికాదన్నారు. మైనంపల్లి హనుమంతరావుపై బురదజల్లే ప్రయత్నాలు కొనసాగితే కాంగ్రెస్ శ్రేణులు ప్రజాస్వామ్యబద్ధంగా గట్టి సమాధానం ఇస్తాయని హెచ్చరించారు. సోషల్ మీడియా వేదికగా అసభ్యకర వ్యాఖ్యలు చేయడం, చిల్లర రాజకీయాలకు పాల్పడటం మానుకోవాలని బీఆర్ఎస్ నాయకులకు సూచించారు. ప్రజా సమస్యలపై చర్చించాల్సిన ప్రతిపక్ష నాయకులు వ్యక్తిగత విమర్శలతో రాజకీయ లబ్ధి పొందాలని ప్రయత్నించడం ప్రజలు గమనిస్తున్నారని పేర్కొన్నారు. రాజకీయాల్లో హుందాతనం పాటిస్తూ బాధ్యతాయుతంగా వ్యవహరించాలని కాంగ్రెస్ నేతలు సూచించారు.

## భారత్‌తో పొట్టి సిరీస్.. ఐర్లాండ్, ఇంగ్లండ్ స్క్వాడ్ ప్రకటన..!

వన్డే సిరీస్‌లో అఫ్గనిస్థాన్‌ను వైట్‌వాష్ చేసిన భారత జట్టుతో ఇంగ్లండ్, ఐర్లాండ్ అమీతుమీకి సిద్ధమవుతున్నాయి. స్వదేశంలో టీమిండియాతో పొట్టి సిరీస్ సమీపిస్తున్నందున ఇరు దేశాలు బోర్డులు సోమవారం తమ స్క్వాడ్‌ను ప్రకటించాయి. హ్యారీ బ్రూక్ సారథిగా ఇంగ్లండ్ వేల్స్ బోర్డు 17 మందితో కూడిన బృందాన్ని ఎంపిక చేయగా.. ఐర్లాండ్ క్రికెట్ మాత్రం 14 మందినే తీసుకుంది. రెండు టీ20ల సిరీస్‌కు ఐరిష్ జట్టుకు లొర్కాన్ టక్కర్ కెప్టెన్‌గా వ్యవరహించనున్నాడు. స్వదేశంలో అఫ్గనిస్థాన్‌తో ఏకైక టెస్టు, వన్డే సిరీస్ గెలుచుకున్న భారత జట్టు విదేశీ పర్యటనలతో బిజీ కానుంది. జూన్ 26న ఐర్లాండ్‌తో.. ఆపై జూలై 1 నుంచి ఇంగండ్ జట్టుతో టీ20 సిరీస్‌లో తలపడనుంది టీమిండియా.



## పెండింగ్ ఎక్స్ గ్రేషియా వెంటనే చెల్లించాలి

**నర్సంపేట జూన్ 22 ప్రజా తీర్పు**

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం గీత కార్మికులకు చెల్లించాల్సిన పెండింగ్ ఎక్స్ గ్రేషియా వెంటనే చెల్లించాలని గౌడ జన హక్కుల పోరాట సమితి మోకుదెబ్బ స్టేట్ వొర్కింగ్ ప్రెసిడెంట్ ఆనంతుల రమేష్ గౌడ్ డిమాండ్ చేశారు. సోమవారంవరం గల్ జిల్లా అబ్కారి శాఖ అసిస్టెంట్ సూపరిండెంట్ జి.సరిత కు పెండింగ్ ఎక్స్ గ్రేషియా చెల్లించాలని కోరుతూ మోకుదెబ్బ ఆధ్వర్యంలో వినతి పత్రం అందజేయడం జరిగింది. ఈ సందర్బంగా రమేష్ గౌడ్ మాట్లాడుతూ గత బి ఆర్ఎస్ ప్రభుత్వంలోప్రమాదవషాత్తు తాటి చెట్ల పై నుంచి పడి చనిపోయిన, తీవ్రంగా గాయపడిన గీత కార్మికులకు చెలించాల్సిన ఎక్స్ గ్రేషియా ఏడు కోట్ల రూపాయలు పెండింగ్ లో ఉండన్నారు. ప్రస్తుతం కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం మూడేళ్లుగా తాటి చెట్ల పై నుంచి పడి చనిపోయిన వారికీ బీసీ కార్పొరేషన్ నుంచి ఇచ్చే 25 వేలు, గాయపడిన గీత కార్మికులకు ఇచ్చే హాస్పిటల్ ఖర్చులు పదిహేను వేలు చెల్లించడం లేదన్నారు. వీటితో పాటు అబ్కారి శాఖ నుండి ఇచ్చే ఎక్స్ గ్రేషియా ఇవ్వడం లేదని రమేష్ గౌడ్ ఆరోపించారు. ఇప్పటికైనా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం బీసీ కార్పొరేషన్, అబ్కారి శాఖ నుండి పెండింగ్ నిధులు మంజూరు చేయాలని, ఏజెన్సీ ఏరియాలో రద్దయిన సొసైటీలను పునరుద్దరించాలని,గీత కార్మికులకు ద్వి చక్ర వాహనాలు ఇవ్వాలని, గౌడ కులస్తులకు పెన్షన్ సౌకర్యం కల్పించాలని రమేష్ గౌడ్ డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మోకుదెబ్బ జిల్లా అధ్యక్షులు గొప్పగాని వెంకట్ గౌడ్, రాష్ట్ర కార్యదర్శి శీలం వీరన్న గౌడ్, నాయకులు కందుకూరి వెంకటేశర్లు (బాబు )గౌడ్, సట్ల సురేష్ గౌడ్, కందుకూరి అశోక్ గౌడ్, రమేష్ పాల్గొన్నారు.

## పాండ్యాను వదిలేస్తున్న ముంబై.. రాజస్థాన్‌తో డీల్ కుదిరేనా..!

ఐపీఎల్‌లో మరో భారీ డీల్‌పై ఉత్కంఠ కొనసాగుతోంది. సారథిగా విఫలమవుతున్న హార్దిక్ పాండ్యా (ఝతీఱఱని ఝఱఅఎఱ)ను వదులుకునేందుకు ముంబై ఇండియన్స్(వీబఎఝఱ ×అఎఱఝఅం) సిద్ధమవుతోంది. ఐదుసార్లు ఛాంపియన్ ముంబై పాండ్యా కెప్టెన్సీలో అనామక జట్టుగా మారడంపై ఆగ్రహించిన యాజమాన్యం.. రాజస్థాన్ రాయల్స్(ఝఞఝరేఝ్షఱ =శీఝశ్రీం)కు అతడిని అప్పగించేందుకు పావులు కదుపుతోంది. బదులుగా రాజస్థాన్ స్టార్ ఆటగాడిని ఇవ్వాల్సిందిగా ముంబై పట్టుపడుతున్నట్టు సమాచారం. అయితే.. పదిహేనేళ్ల వైభవ్ సూర్యవంశీ తప్ప.. ఎవరినైనా ట్రేడ్ డీల్ ద్వారా మార్చుకునేందుకు జైపూర్ ఫ్రాంచైజీ ఆసక్తి కనబరుస్తోంది.




## డ్రగ్స్ నిర్మూలనకు ప్రతి పౌరుడు సైనికుడిగా మారాలి: సూర్యాపేట జిల్లా ఎస్పీ నరసింహ ఐపీఎస్.

- యాంటీ డ్రగ్ సోల్జర్ నమోదు ప్రక్రియను, డ్రగ్స్ నిర్మూలన అవగాహన పోస్టర్లను ఆవిష్కరించిన ఎస్పీ.
- సూర్యాపేట జిల్లాను డ్రగ్స్ రహిత జిల్లాగా తీర్చిదిద్దాలి, అందరూ భాగస్వామ్యం కావాలి.

**(అనంతుల శ్రీనివాస్ గౌడ్, ప్రజా తీర్పు సూర్యాపేట జిల్లా ప్రతినిధి) జూన్ 22**

మాదకద్రవ్యాల నిర్మూలనకు ప్రతి ఒక్క పౌరుడు ఒక సైనికుడిగా నిలబడి పోరాడాలని సూర్యాపేట జిల్లా ఎస్పీ నరసింహ ఐపీఎస్ పిలుపునిచ్చారు. మాదకద్రవ్యాల నిర్మూలన అవగాహన కార్యక్రమాలలో భాగంగా సోమవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో తెలంగాణ ఈగల్ పోలీస్ ఫోర్స్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన "యాంటీ డ్రగ్ సోల్జర్" పౌరుల నమోదు ప్రక్రియను ఆయన ప్రారంభించారు. ప్రతి పౌరుడు, యువత, విద్యార్థులు యాంటీ డ్రగ్స్ సోల్జర్ గా పేరు నమోదు చేసుకోవాలని అన్నారు. ఈ సందర్భంగా జిల్లా పోలీస్ కార్యాలయంలో అదనపు ఎస్పీ రవీందర్ రెడ్డి, డీఎస్పీలు రవి, నరసింహ చారి, మరియు స్థానిక ఇన్స్పెక్టర్లతో కలిసి ఎస్పీ గారు డ్రగ్స్ నిర్మూలన అవగాహన పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ నరసింహ ఐపీఎస్ గారు మాట్లాడుతూ గంజాయి లాంటి ప్రమాదకరమైన డ్రగ్స్ నిర్మూలనలో ప్రతి పౌరుడు భాగస్వామ్యం కావాలని కోరారు. మన సమాజాన్ని, సూర్యాపేట జిల్లాను డ్రగ్స్ రహితంగా తీర్చిదిద్దేందుకు పోలీస్ శాఖతో ప్రజలు చేతులు కలపాలన్నారు. మాదకద్రవ్యాల వ్యతిరేక, రవాణా నిర్మూలన అంతర్జాతీయ దినోత్సవం సందర్భంగా జిల్లా వ్యాప్తంగా విస్తృతంగా డ్రగ్స్ నిర్మూలన అవగాహన కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. యువత గంజాయి వంటి మత్తు పదార్థాలకు దూరంగా ఉంటూ, ఉజ్వల భవిష్యత్తు వైపు అడుగులు వేయాలని కోరారు. "సే నో టు డ్రగ్స్ – సే ఎస్ టు లైఫ్" (ఝఎ చీశ్ శీ ణతీబస్త్రం – ఝఎ్వం్ శీ ాఱటవ) అనే నినాదంతో ప్రతి ఒక్కరూ ముందుకు సాగాలని, మత్తుకు దూరంగా ఉండి సంతోషకరమైన జీవితాన్ని గడుపుతూ, అందమైన కుటుంబాన్ని నిర్మించుకోవాలని ఎస్పీ సూచించారు. గంజాయి లాంటి మత్తుపదార్థాలకు అలవాటు పడిన వారిని సంస్కరించుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉన్నదని దీనికోసం జిల్లా వ్యాప్తంగా గంజాయి సంభంద కేసుల్లో ఉన్న యువకులకు కౌన్సిలింగ్ కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని, సత్ప్రవర్తన కోసం జిల్లా కేంద్రంలో పునరావత కేంద్రం ఏర్పాటు చేయడం జరిగిందని. డ్రగ్స్ వినియోగము రవాణా కు సంబంధించిన సమాచారాన్ని 100, 112, 1908 లకు తెలియజేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు ఎస్పీ రవీందర్ రెడ్డి, డీఎస్పీలు రవి, నరసింహ చారి, ఱజ=దీ ఇన్స్పెక్టర్ మగ్దూం అలీ, ఎస్ఐ యాకూబ్, మరియు సిబ్బంది పాల్గొన్నారు.




## ప్రియుడి మోజులో పడిన ఓ తల్లి రెండేళ్ల కుమారుడిని కడతేర్చింది

**(వినోద్, ప్రజా తీర్పు, కిసర, మేడ్చల్ జిల్లా) జూన్ 22**

మేడ్చల్ జిల్లా కీసర పోలీస్ స్టేషన్ పరిధిలో సంచలనం సృష్టించిన రెండేళ్ల బాలుడి హత్య కేసును పోలీసులు ఛేదించారు. చేర్యాల గ్రామంలో ప్రియుడి మోజులో పడిన ఓ తల్లి రెండేళ్ల కుమారుడిని కడతేర్చింది, ప్రియుడితో కలిసి ఈ దారుణానికి ఒడిగట్టగా, పోలీసులు బాలుడి మృతదేహాన్ని వెలికితీసి కేసు నమోదు చేశారు. సోమవారం ఈ కేసులో బాలుడి తల్లి మరియు ఆమెతో అక్రమ సంబంధం ఉన్న వ్యక్తిని అరెస్ట్ చేసినట్లు పోలీసులు వెల్లడించారు. కీసర పోలీస్ స్టేషన్‌లో క్రైం నెం. 555/2026 కింద నమోదైన ఈ కేసులో, చేర్యాల గ్రామంలోని ఈడెన్ గార్డెన్స్‌కు చెందిన రంగా స్వామి తన రెండేళ్ల కుమారుడు మాస్టర్ రంగా హరికృష్ణ అనుమానాస్పద పరిస్థితుల్లో మరణించాడని ఈ నెల 13న ఫిర్యాదు చేశారు. ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. దర్యాప్తులో భాగంగా సీసీటీవీ ఫుటేజీలు, సాక్షుల వాంగ్మూలాలు, సాంకేతిక ఆధారాలను పరిశీలించిన పోలీసులు కీలక విషయాలను వెలికితీశారు. బాలుడి తల్లి రంగా జ్యోతి మరియు మొగిళ్ల నవీన్ మధ్య అక్రమ సంబంధం ఉన్నట్లు గుర్తించారు. తమ సంబంధానికి బాలుడు అడ్డుగా ఉన్నాడని భావించిన నిందితులు ముందస్తుగా కుట్ర పన్ని ఈ ఏడాది మే 29న బాలుడిని హత్య చేసినట్లు పోలీసులు నిర్ధారించారు. పోలీసుల కథనం ప్రకారం, నిందితుడు మొగిళ్ల నవీన్ బాలుడిని నేలపై బలంగా కొట్టగా, తల్లి రంగా జ్యోతి అతనికి సహకరించింది. అనంతరం బాలుడు ప్రమాదవశాత్తు పడిపోవడంతో గాయపడ్డాడని నమ్మించే ప్రయత్నంలో ఆసుపత్రికి తరలించారు. అయితే వైద్యులు బాలుడిని మృతుడిగా ప్రకటించారు. కేసులో అనుమానాస్పద పరిస్థితులు ఉండటంతో ఈ నెల 19న బాలుడి మృతదేహాన్ని వెలికితీసి (ఎక్స్యూమేషన్) ఫోరెన్సిక్ పరీక్షలు నిర్వహించారు. పోస్టుమార్టం నివేదిక ఇంకా రావాల్సి ఉందని పోలీసులు తెలిపారు. ఈ నెల 21న నిందితులు మొగిళ్ల నవీన్ (28), రంగా జ్యోతి (23)లను అరెస్ట్ చేసి విచారించగా, వారు నేరాన్ని అంగీకరించినట్లు పోలీసులు వెల్లడించారు. అనంతరం వారిని న్యాయస్థానం ముందు హాజరుపరిచారు. మల్కాజిగిరి డీసీపీ శ్రీధర్ ఐపీఎస్ పర్యవేక్షణలో, కీసర పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ ఆంజనేయులు ఆధ్వర్యంలో ఎస్సై శ్రీనివాస్ రెడ్డి మరియు సిబ్బంది సమర్థవంతంగా దర్యాప్తు నిర్వహించి కేసును ఛేదించారు. ఈ విషయాన్ని జవహర్‌నగర్ డివిజన్ అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ పోలీస్ వై.ఎస్. చక్రపాణి అధికారికంగా వెల్లడించారు.

# ఫణిగిరి సమగ్రాభివృద్ధికి రూ.5 కోట్లు

- ఫణిగిరి, గాజులబండ బౌద్ధ కట్టడాల పరిరక్షణ పనులకు మంత్రి జూపల్లి శంకుస్థాపన

**(అనంతుల శ్రీనివాస్ గౌడ్, ప్రజా తీర్పు సూర్యాపేట జిల్లా ప్రతినిధి) జూన్ 22**



తెలంగాణలోని ప్రాచీన బౌద్ధ వారసత్వ సంపద పరిరక్షణకు రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తోందని పర్యాటక, సాంస్కృతిక, క్రీడా ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు సూర్యాపేట జిల్లా నాగారం మండలం ఫణిగిరి గ్రామంలో ఫణిగిరి, గాజులబండ బౌద్ధా క్షేత్రాల్లో పరిరక్షణ, పునరుద్ధరణ పనులకు ఎమ్మెల్యే మందుల సామేల్ తో కలిసి మంత్రి జూపల్లి కృష్ణారావు సోమవారం శంకుస్థాపన చేశారు. తెలంగాణ జెన్కో (వైటీపీఎస్) సీఎస్ఆర్ నిధులతో ఫణిగిరి బౌద్ధ కట్టడాల పరిరక్షణకు రూ. 1.60 కోట్లు, గాజులబండ కట్టడాల సంరక్షణకు రూ. 23 లక్షలు నిధులు మంజూరు చేశారు. ముందుగా మంత్రి ఫణిగిరిలో పురావస్తు శాఖ వారి తవ్వకాలలో లభించిన బౌద్ధ కళాఖండాల అవశేషాలకు సంబంధించిన మ్యూజియంని సందర్శించి ఆసక్తిగా తిలకించారు. తదుపరి ఏర్పాటు చేసిన సమావేశంలో మంత్రి మాట్లాడుతూ ఫణిగిరి దక్షిణ భారతదేశంలోనే అత్యంత ప్రాముఖ్యత కలిగిన బౌద్ధ వారసత్వ కేంద్రాల్లో ఒకటని పేర్కొన్నారు. బౌద్ధల యొక్క ధర్మం, శాంతి, అహింస, మానవతా విలువలకు ప్రతీకగా నిలిచిందని, బుద్ధుడు 29 సంవత్సరాల వయస్సులో రాజ సౌఖ్యాలు వదిలేసి దేశసంచారం చేస్తూ ప్రజలకు జ్ఞానోపదేశాలు చేశారని, మన కోరికలను అదుపులో ఉంచుకుంటే మనసు ప్రశాంతతగా ఉంటుందని, నేను, నాది అనే వాటిని వదిలివేసి మనం, మనది అనుకున్నప్పుడు బాధలు ఉండవని మన ఆలోచన విధానాలే మన కోరికలకు మూలమని బోధించిన బుద్ధుని బోధనలు మరువ వద్దని అన్నారు. ప్రజలు కూడా లేనిపోని ఆడంబరాలకు పోయి ఆర్థికంగా, మానసికంగా, శారీరకంగా నష్టపోవద్దని మంత్రి అన్నారు. చారిత్రక వారసత్వాన్ని భావితరాలకు అందించడం ప్రభుత్వ బాధ్యత అని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం చారిత్రక, పురావస్తు, వారసత్వ సంపద పరిరక్షణకు ప్రత్యేక ప్రాధాన్యం ఇస్తోందని చెప్పారు. బౌద్ధ పర్యాటక పటంలో తెలంగాణకు మరింత గుర్తింపు తీసుకువస్తామని ఫణిగిరి, గాజులబండ వంటి బౌద్ధ క్షేత్రాల అభివృద్ధి ద్వారా తెలంగాణను జాతీయ, అంతర్జాతీయ బౌద్ధ పర్యాటక పటంలో మరింత ప్రముఖంగా నిలిపేందుకు చర్యలు తీసుకుంటున్నామని మంత్రి తెలిపారు. తవ్వకాలలో వెలుగులోకి వచ్చిన శిల్పాలు, శాసనాలు, నాణేలు తెలంగాణ చరిత్ర వైభవాన్ని ప్రపంచానికి చాటుతున్నాయని అన్నారు. పర్యాటకుల రాక పెరగడం ద్వారా స్థానిక యువతకు ఉపాధి అవకాశాలు, గ్రామీణ ఆర్థికాభివృద్ధికి కొత్త మార్గాలు తెరుచుకుంటాయని పేర్కొన్నారు. ఎమ్మెల్యే మందుల సామేల్ మాట్లాడుతూ ఇది బుద్ధుడు నడయాడిన పవిత్ర నేలని, దీనిని ఇంకా అభివృద్ధి చేసుకొనే బాధ్యత మనందరి మీద ఉన్నదని ప్రభుత్వం నుండి ఇంకా నిధులు మంజూరు చేసి మెయిన్ రోడ్డు నుండి ఫణిగిరి గుట్ట వరకు డబుల్ రోడ్డు మంజూరు చేయవలసిందిగా మంత్రిని కోరగా, ఎమ్మెల్యే విజ్ఞప్తి పై వెంటనే స్పందించిన మంత్రి జూపల్లి కృష్ణారావు.. ఫణిగిరి బౌద్ధ క్షేత్ర సమగ్ర అభివృద్ధికి రూ. 5 కోట్ల నిధులు మంజూరు చేస్తున్నట్లు ప్రకటించారు. ఈ నిధులతో ప్రధాన రహదారి నుంచి క్షేత్రానికి చేరుకునే డబుల్ రోడ్డు నిర్మాణం, కొండపైకి వెళ్లే మెట్లదారి నిర్మాణం, టాయిలెట్స్, పర్యాటక మౌలిక సదుపాయాల కల్పన, సందర్శకుల వసతుల మెరుగుదల చేపట్టనున్నట్లు తెలిపారు. తదుపరి జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ మాట్లాడుతూ ఫణిగిరి చరిత్ర ఎంతో గొప్పదని, అలాంటి చరిత్రను కాపాడుకోవడం మనందరి బాధ్యత అని ఇలాంటి బౌద్ధ కట్టడాలు మన జిల్లాలో ఉండటం మన జిల్లాకు గర్వకారణం అని భవిష్యత్తులో సూర్యాపేట జిల్లాను పర్యటక ప్రాంతంగా అభివృద్ధి చేయుటకు ఫణిగిరి క్షేత్రం దోహదపడుతుందని కలెక్టర్ అన్నారు. ఈ కార్యక్రమంలో సూర్యాపేట జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్, ఎస్పీ నరసింహ, పురావస్తు శాఖ డైరెక్టర్ అర్జున రావు, డిప్యూటీ డైరెక్టర్లు పగడం నాగరాజు, నర్సింగ్ నాయక్, ఓఎస్డీ రాజు, అసిస్టెంట్ డైరెక్టర్లు నాగలక్ష్మి, మల్లు నాయక్, ఫణిగిరి, గాజులబండ గ్రామాల సర్పంచులు ఎర్ర సావిత్రి, వంగూరు దామోదర్ ప్రజాప్రతినిధులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

## అతనికే అప్పగించండి!



సోషల్ మీడియాలో యాక్టీవ్‌గా ఉండే తారల్లో శ్రీదేవి ముద్దుల తనయ జాన్వీకపూర్ ముందు వరుసలో ఉంటుంది. ఇటీవల ఇన్‌స్టాగ్రామ్‌లో ఈ ముద్దుగుమ్మ పెట్టిన పోస్ట్ ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. పింక్ కలర్ నైట్ సూట్‌లో ఉన్న ఓ ఫొటోని ఇన్‌స్టాలో పోస్ట్ చేసి, దాని కింద.. 'ఒకవేళ నేను తప్పిపోతే.. దయచేసి శిఖర్ పహారియాకు నన్ను అప్పగించండి' అంటూ ఓ చమత్కారమైన సందేశాన్ని పొందుపరిచింది జాన్వీ. ప్రస్తుతం ఈ పోస్ట్‌పై నెటిజన్లు రకరకాలుగా స్పందిస్తున్నారు. 'ఎంతో ముద్దుగా ఉంది' అంటూ ఒకరు కామెంట్ చేస్తే, 'రిలేషన్‌షిప్ గోల్స్' అంటూ మరొకరు అభినందించారు.

Edited Printed Published and Owned by SOYINENI MAHESH, **RNI Reg no. APTEL/2001/5268** printed at m/s Ganesh Printers Ramantapur Hyderabad, Published at m/s Bavani Publication Trust Plot No C-1/2c idl Uppal hydrabad-500039 Chieff Editor : S.Mahesh, 94946 59622, office : 8309979541, Admn office: 1-7-334 2nd floor Musherabad Hydrabad -500020